www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 68
సంచిక : 218
గురువారం 31-01-2019
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
వెల: రూ.4.00
పేజీలు: 12+ టాబ్లాయిడ్
విజయవాడ ప్రచురణ

మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలో ప్రసంగిస్తున్న అనీ రాజా. వేదికపై దుర్గాభవానీ, వనజ, ముప్పాళ్ల, జల్లి విల్సన్, భాగ్యలక్ష్మి, జయలక్ష్మి, వంక నాగమణి, రాంబాబు, ఓబులేసు, శైలజ, గాళ్ల శారద, లలిత, డాక్టర్ సుజాత తదితరులు



హాజరైన ప్రతినిధులు



మనువాద పాలనను

మట్టుబెడదాం

- హిట్లర్‌లా వ్యవహరిస్తున్న మోడీ
- మహిళలను వంటింటికి పరిమితం చేసే కుట్ర
- పర్సనల్ లా బోర్డులు ప్రమాదకరం
- మహిళలంతా సంఘటితమవ్వాలి
- మహిళా సమాఖ్య 14వ రాష్ట్ర మహాసభ ప్రారంభిస్తూ అనీ రాజా పిలుపు

దేశంలో ప్రజాస్వామ్యాన్నీ, లౌకికతత్వాన్నీ, రాజ్యాంగ విలువలను దెబ్బతీసేలా మోడీ పాలన సాగుతోంది. మతోన్మాద పోకడలు, మనువాద ధోరణులతో ప్రజల్ని భయాందోళనలకు గురిచేస్తోంది. ముఖ్యంగా మహిళల స్వేచ్ఛను హరించివేసే విధానాలనూ, వారిని వంటింటికి పరిమితం చేసే మధ్యయుగాల భావాలను అమలుచేసేందుకు మోడీ సర్కారు నిస్సిగ్గుగా వ్యవహరిస్తోంది. మహిళలపై వివక్ష, వారిని రెండో తరగతి పౌరులుగా పరిగణించే ప్రమాదకర ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. బాలికలపై అత్యాచారాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఇటువంటి మహిళా వ్యతిరేక పాలనను అంతమొందించేందుకు స్త్రీ శక్తి సంఘటితం కావాలి అని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర 14వ మహాసభ పిలుపునిచ్చింది.

12లో

లోక్‌పాల్, లోకాయుక్త కోసం

అన్నాహజారే దీక్ష

- మోడీ సర్కారు జాప్యంపై ఆగ్రహం
- ఏ పార్టీ పట్టించుకోవడం లేదు
- హజారే నిశిత విమర్శ




రాలేగావ్ సిద్ధి : లోక్‌పాల్, లోకాయుక్త నియామకాల్లో జాప్యాన్ని నిరసిస్తూ సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే మరోసారి నిరాహార దీక్షను ప్రారంభించారు. బుధవారం ఉదయం మహారాష్ట్రలోని స్వగ్రామం రాలేగావ్ సిద్ధిలో హజారే నిరాహార దీక్ష చేపట్టారు. కేంద్రంలో లోక్‌పాల్, రాష్ట్రాలలో లోకాయుక్త ఏర్పాటు చేయాలని ఆయన డిమాండు చేశారు. అవినీతి వ్యతిరేక సంస్థలను ఏర్పాటు చేయడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. 'లోక్‌పాల్ బిల్లు 2013లోనే పార్లమెంట్‌లో ఆమోదం పొందింది. కానీ ఇంతవరకూ లోక్‌పాల్, లోకాయుక్తలను నియమించలేదు. అసలు ఏ పార్టీ దీని గురించి పట్టించుకోవట్లేదు' అని హజారే అసహనం వ్యక్తం చేశారు. లోక్‌పాల్, లోకాయుక్తలను ఏర్పాటుచేసే వరకూ నిరాహార దీక్ష విరమించబోనని స్పష్టం చేశారు. "లోక్‌పాల్ ద్వారా ప్రధానమంత్రిని సైతం

- మిగతా 2 లో

ప్రతికూలతలలోనూ ప్రగతి

- విభజన హామీలు ఇప్పటికీ అమలు కాలేదు
- కేంద్రం సహకరించకున్నా వృద్ధిరేటులో ముందంజ
- సాగునీటి కోసం రూ.64,333 కోట్లు ఖర్చు
- 2019 చివరికల్లా పోలవరం పూర్తి
- పంచనదుల మహాసంగమమే లక్ష్యం
- వచ్చే నెలలో రుణమాఫీ బకాయిలు చెల్లింపు
- ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ నరసింహన్



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : విభజన ఇబ్బందులు, కేంద్రం నుంచి సహకారం లేకపోవడం వంటి ప్రతికూలతలను అధిగమించి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం అద్భుత ప్రగతిని సాధించి దేశానికి మార్గదర్శకంగా నిల్చిందని రాష్ట్ర గవర్నర్ ఈఎస్‌ఎల్‌ఎస్ నరసింహన్ కొనియాడారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉభయసభల నుద్దేశించి గవర్నర్ విభజన వల్ల రాష్ట్రం ఎదుర్కొంటున్న ఇబ్బందులు, కేంద్రం సహాయ నిరాకరణ, ప్రతికూల అం శాల్లోనూ రాష్ట్రం సాధించిన ప్రగతి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సుదీర్ఘ ఉపన్యాసం చేశారు. విభజన వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని, ఈ నేపథ్యంలో ఆదుకోవల్సిన కేంద్ర ప్రభుత్వం నుంచి తగిన సహకారం లభించలేదన్నారు. విభజన చట్టంలోని అనేక అంశాలను ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. కేంద్రం ఆదుకుంటుందని ప్రజలు ఎంతో ఆత్రుతతో ఎదురుచూసి నిరాశకు గురయ్యారన్నారు. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రస్తావించడం, విభజన సమస్యలపై మాట్లాడటం ఇది తొలిసారి కాదు. గత బడ్జెట్ సమావేశంలో కూడా మాట్లాడాను. గౌరవ సభ్యులు అందరికీ మరోసారి గుర్తుచేస్తున్నాను. విభజన చేసిన గాయం చాలా తీవ్రమైనది. నాలుగున్నరేళ్లు గడిచినా విభజనచట్టంలోని అనేక అంశాలను నెరవేర్చలేదు. అందుకే దీని గురించి పదేపదే ప్రస్తావిస్తున్నాం. తలసరి ఆదాయం అతి తక్కువగా ఉన్న కొత్త రాష్ట్రం. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి రాజధానిని ఏపీకి లేకుండా చేశారు. తీవ్ర ఆర్థికలోటు, అసమానంగా ఆస్తుల పంపకం, పరిశోధన, అభివృద్ధి సంస్థల కొరత, ప్రామాణికంగా లేకుండా చేసిన విభజన రాష్ట్రాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టాయి. భౌగోళిక ప్రాతిపదికన ఆస్తుల పంపిణీ, జనాభా ప్రాతిపదికన అప్పుల పంపిణీ, 58.42శాతం జనాభా గల కొత్త రాష్ట్రం ఏపీకి ఉమ్మడి రాష్ట్ర రాబడుల్లో 46% మాత్రమే ఉండేలా విభజన చేయడం, విద్యుత్ రంగంలో వినియోగం ప్రాతిపదిక కారణంగా విభజించడం వంటి అంశాలతో రాష్ట్రం మరిన్ని కష్టనష్టాల్లో పడిందని గవర్నర్ ఇబ్బందులను వివరించారు.

కేంద్రం సహకరించకున్నా రెండంకెల వృద్ధి

ఇటువంటి పరిస్థితుల్లో సైతం కేంద్రప్రభుత్వం నుంచి ఏమాత్రం సహకారం అందకున్నా రాష్ట్రం వివిధ రంగాలలో

- మిగతా 2 లో

రేపటి బంద్ జయప్రదం చేయండి



- అన్ని రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు మద్దతివ్వాలి
- రాజకీయ లబ్ధి కోసమే బాబు అఖిలపక్ష సమావేశం
- ప్రధాని మోడీని కలుద్దామంటే మేం సిద్ధమే
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

3లో



సదస్సులో మాట్లాడుతున్న హరగోపాల్. వేదికపై సురవరం, చాడ తదితరులు

బుసలు కొడుతున్న అసహనం

- లౌకికవాదం, రాజ్యాంగ రక్షణకు ప్రజాతంత్ర శక్తులు ఏకం కావాలి
- హైదరాబాద్ సదస్సులో సురవరం

11లో

సుప్రీం హెచ్చరికతో దిగొచ్చిన కేంద్రం

లోక్‌పాల్ ఏర్పాటుకు నిర్ణయం
దరఖాస్తులు కోరనున్న అన్వేషణ కమిటీ

2లో

సెబీ అధికారాలకు కత్తెర?

1న మధ్యంతర బడ్జెటే..

2లో

ఇదీ లోకం!



విభజన హామీలు నెరవేర్చాలి




విభజన హామీలు నెరవేర్చాలని కోరుతూ సాధన సమితి, ఉత్తరాంధ్ర చర్చావేదిక ఆధ్వర్యంలో మూడురోజులుగా దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయ పార్టీల నేతలకు, ప్రభుత్వ పెద్దలకు వినతులు అందిస్తున్న నేపథ్యంలో బుధవారం వైసీపీ నేత, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డికి నివేదికను అందించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, ఉత్తరాంధ్ర చర్చావేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణ, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ, ఉత్తరాంధ్ర రక్షణ వేదిక కన్వీనర్ ఎన్.శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

హోదా సాధనకు జేఏసీ


దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించేలా ఉద్యమం

- ఫిబ్రవరి 1నుంచి 13వరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు
- 11న ఢిల్లీలో ఆందోళన- 12న రాష్ట్రపతి వద్దకు అఖిలపక్షం
- హోదా ఉద్యమకారులపై కేసులు ఎత్తివేత
- హాజరు కాని పార్టీలను కూడా మరలా ఆహ్వానించండి
- అఖిలపక్ష సమావేశంలో సీఎం చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : కేంద్రప్రభుత్వం ఏపీ పట్ల వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా, హోదా సాధన కోసం ఫిబ్రవరి 1 నుంచి 13వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడదామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. దీనిలో భాగంగా 11న ఢిల్లీలో ఆందోళన చేపట్టి, 12న రాష్ట్రపతి దగ్గరకు అఖిలపక్షం వెళుతుందని చెప్పారు. విభజన హామీల్లో ఏ ఒక్కటీ ఇప్పటివరకు సక్రమంగా అమలు చేయలేదు. వీటి గురించి మనం ప్రాధేయపడాల్సిన అవసరం లేదు. హక్కుగా రావాల్సిందే అడుగుదాం. అందుకోసం దేశం దద్దరిల్లేలా ప్రజా ఉద్యమం చేపడదాం, అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు జేఏసీగా ఏర్పడదామని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. హోదా ఉద్యమకారులపై కేసులు ఎత్తివేస్తామని ప్రకటించారు. బుధవారం సచివాలయంలో తన కార్యాలయ సమావేశమందిరంలో ఆంధ్రప్రదేశ్ అఖిలపక్ష పార్టీల ప్రతినిధులతో సమావేశమ య్యారు. అయితే, అఖిలపక్షానికి ప్రధాన

- మిగతా 2 లో



ఇక... ఏపీ 39

- రవాణాశాఖలో ఏకీకృత రిజిస్ట్రేషన్ విధానం
- ప్రారంభించిన అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఒక రాష్ట్రం-ఒక సిరీస్‌ను రవాణాశాఖలో ఏకీకృత రిజిస్ట్రేషన్ మార్కుగా ప్రవేశపెట్టినట్లు రవాణాశాఖమంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. దేశంలోనే కాదు.. ప్రపంచంలో ఇలాంటి విధానం ఎక్కడాలేదని ఆయన స్పష్టం చేశారు. విజయవాడలోని ప్రైవేటు సమావేశమందిరంలో బుధవారం ఏపీ 39 ఏకీకృత సిరీస్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఒక రాష్ట్రంలో తిరిగే వాహనానికి ఒకే రిజిస్ట్రేషన్ సిరీస్ నెంబరు విధానం ఎంతో ఉపయుక్తంగా

- మిగతా 2 లో

ఆనకట్ట ప్రమాదంలో మృతుల సంఖ్య 84



బ్రుమందిన్ : బ్రెజిల్‌లో ఆనకట్ట తెగిపోయి భారీ వరదలాగా నీరు చుట్టుప్రక్కల గ్రామాలపై బురదతో సహా పడిపోవడంతో ఇంతవరకు 84 మంది చనిపోయినట్టు మంగళవారం అధికారవర్గాలు తెలిపాయి. సమీపంలోని ఇనుపగనిలో పనిచేస్తున్న వారిలో కొంతమంది కూడా చనిపోయారు. వలె సంస్థ ఆధ్వర్యంలో గని తవ్వకాలు జరుగుతున్నాయి. దాదాపు వారంక్రితం జరిగిన ఈ ప్రమాదంలో మొదట మృతుల సంఖ్య తక్కువగా ఉండవచ్చునని భావించారు. అయితే అది క్రమంగా 65 నుండి 84కు పెరిగింది. ఇంకా 276 మంది ఆచూకీ తెలియడంలేదని పౌరరక్షణ విభాగం ప్రతినిధి తెలిపారు. వలె సంస్థ ప్రపంచంలోని అతిపెద్ద ముడిఇనుప ఖనిజం తవ్వకాలు నిర్వహించే సంస్థ. మూడేళ్ల క్రితం ఇదే ప్రాంతంలో జరిగిన ఆనకట్ట ప్రమాదంలో 19 మంది మృతిచెందారు.

అమెరికా వల్లే ఆర్థిక సంక్షోభం : ఇరాన్

జెనీవా : తమ దేశంలో 40 ఏళ్లకాలంలో ఏనాడూలేనంత తీవ్రమైన ఆర్థిక పరిస్థితి నెలకొనివున్నదని ఈ సంక్షోభానికి అమెరికాయే కారణమని ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహాణి విమర్శించారు. ఇరాన్‌తో కుదిరిన అణు ఒప్పందంనుండి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత ఏడాది వైదొలిగారు. ఆ తరువాత ఇరాన్‌పైన అనేక విధాలుగా ఆంక్షలు విధించారు. దీంతో దేశంలో ఆర్థిక పరిస్థితులు గణనీయంగా దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితులకు ఇరాన్ ప్రభుత్వమే కారణమని విమర్శిస్తూ కార్మికులు, ట్రక్కు డ్రైవర్లు, చిన్నచిన్న వ్యాపారులు అప్పుడప్పుడు నిరసన ఆందోళనకు పూనుకుంటున్నారు. ప్రదర్శనల సందర్భంగా భద్రతాదళాలకు, ఆందోళనకారులకు మధ్య ఘర్షణలు జరిగాయి. ప్రస్తుతం దేశంలో ఆర్థిక పరిస్థితులు తీవ్రతరం అయిన సమయంలో అమెరికా ఆర్థిక ఆంక్షలు విధించింది. ఇస్లాం రిపబ్లిక్ వ్యవస్థాపకుడైన అయతుల్లారొహుల్లాకొమేని స్మారకంగా నిర్మించిన ప్రార్థనాలయంవద్ద జరిగిన కార్యక్రమంలో రౌహాణి పాల్గొని మాట్లాడారు. ఇటీవలకాలంలో ఇరాన్ కరెన్సీ రియల్ విలువ గణనీయంగా పడిపోయింది.

బోట్లు తిరగబడి 130 మంది మృతి

28 మృతదేహాలు లభ్యం

అడిస్‌అబాబా : దిగ్బొటికి సమీపంలో సముద్రజలాల్లో మంగళవారం రెండు బోట్లు తిరగబడి ఆఫ్రికానుండి వలసవెళుతున్న 130 మంది చనిపోయివుంటారని ఐక్యరాజ్యసమితి వలస ఏజెన్సీ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ బోట్లు ఎమెన్‌వైపు ప్రయాణిస్తున్నాయి. గల్ఫ్ దేశాలకు ఎమెన్ ముఖద్వారం లాంటిది. అక్కడ పనులు చేసుకునేందుకు వీరంతా బోట్లలో బయలుదేరారు. బోట్ల నుండి నీళ్లలో పడిపోయిన వారిలో 28 మంది చనిపోయారని వారి మృతదేహాలు లభ్యమయ్యాయని వలసల ఏజెన్సీ తెలిపింది. మునిగిపోయిన వారికోసం ఇంకా గాలింపు చర్యలు జరుగుతున్నాయని ఆ ఏజెన్సీ బుధవారం వెల్లడించింది. ఆఫ్రికాలోని గొడోరియా నుండి ఈ బోట్లు బయలుదేరి వస్తున్నాయి. దిగ్బొటి సమీపంలోకి వచ్చేటప్పటికి సముద్రం అల్లకల్లోలంగా ఉండటంతో అవి తిరగబడినట్టు వలసల ఏజెన్సీ తెలిపింది. బోట్లపైన ప్రయాణించవలసిన వారి సంఖ్యకంటే ఎక్కువగా ఉండటంమూలంగానే ప్రమాదం సంభవించిందని ప్రమాదం నుండి బయటపడిన ఇద్దరు తెలిపారు.



అంతర్యుద్ధంతో తల్లడిల్లుతున్న ఎమెన్ ప్రాంతంలోని బబెల్-మండెబ్ జలసంధిలో ఈ ప్రమాదం జరిగింది. వలసలకు దిగ్బొటి ఇటీవల ఇతర ప్రాంతాలకు చేరుకునేముందు ఒక కీలకమైన స్థానంగా మారింది.

పాలస్తీనా ప్రధాని రాజీనామా

రమల్లా : పాలస్తీనా ప్రధానమంత్రి రమిఅల్-హమదల్లా తన రాజీనామాను అధ్యక్షుడు మొహమ్మద్‌అబ్బాస్‌కి మంగళవారం అందజేశారు. ప్రధానితో పాటు ఆయన ప్రభుత్వం కూడా రాజీనామా చేసింది. గాజా ప్రాంతంలో పరిపాలిస్తున్న హమస్ నాయకులతో సయోధ్యకు చర్చలు జరుగుతున్న సమయంలో ప్రభుత్వం రాజీనామా చేయడం చర్చలపైన తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుంది. రాజీనామాను ఆమోదించిన అధ్యక్షుడు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పడేవరకు ఇప్పుడున్న ప్రభుత్వమే విధులను నిర్వహిస్తుందని తెలిపారు. ప్రధాని, ప్రభుత్వం రాజీనామా చేయడాన్ని హమస్ అధికారికంగా ఖండించింది. తమను పాలస్తీనా రాజకీయాలనుండి మినహాయించేందుకు జరిగిన ప్రయత్నం ఇదని హమస్ తెలిపింది. హమదల్లా ప్రభుత్వం 2014లో ఏర్పడింది. గాజా ప్రాంతంలో 2007లో అధికారాన్ని చేజిక్కించుకున్న హమస్‌తో సయోధ్య కుదుర్చుకునేందుకు హమదల్లా నాయకత్వంలో చర్చలు జరుగుతున్నాయి. రెండేళ్ల క్రితం రెండు గ్రూపుల మధ్య సయోధ్యకు సంబంధించిన ఒప్పందంపై సంతకాలు జరిగాయి. అబ్బాస్ నాయకత్వంలోని పాలస్తీనా అథారిటీ గాజాలో ప్రభుత్వం ఏర్పడేందుకు, అలాగే కోస్టల్ ప్రాంతంలోని క్రాసింగ్ పాయింట్లను కూడా ప్రభుత్వ నియంత్రణలో ఉంచేందుకు ఈ ఒప్పందం అవకాశం కల్పించింది. అయితే అధికారపంపిణీ, ఇజ్రాయిల్‌పట్ల అనుసరించవలసిన విధానంపై విభేదాలు ఏర్పడి ఒప్పందాన్ని అమలు చేయలేదు. ప్రభుత్వం రాజీనామా చేసిన నేపథ్యంలో పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్ (పిఎల్ఒ) గ్రూపులతో కలిపి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అధ్యక్షుడు చర్చలు జరపనున్నారు. ఈ రాజకీయ ప్రభుత్వం పార్లమెంటుకు ఎన్నికలు జరిపేందుకు తగు ఏర్పాట్లు చేస్తాయని అధ్యక్షుడు చెప్పారు.

చర్చలకు మదురో పిలుపు



పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధమని వెల్లడి

మాస్కో : ప్రతిపక్షంతో చర్చలకు సిద్ధంగా ఉన్నానని వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురొ ప్రకటించారు. అంతేకాదు ముందుగానే పార్లమెంటు ఎన్నికలు నిర్వహించటానికి తన తోడ్పాటు అందిస్తానని ఆయన చెప్పినట్టుగా ఆర్ఐఎ నొవస్తి వార్తా ఏజెన్సీ బుధవారం తెలియజేసింది. చర్చలు జరిగితే దేశ ప్రజలకి మేలు జరుగుతుందని ఆయన అన్నారు. రష్యాకు చెందిన ఈ వార్తాసంస్థ కారకాస్‌లో మదురొను ఇంటర్వ్యూ చేసింది.

అమెరికా అండదండలతో ప్రతిపక్ష నాయకుడు జాన్‌గుయ్‌డొ తిరుగుబాటుకు విఫలయత్నం చేశారు. తానే తాత్కాలిక దేశాధ్యక్షుడునని కూడా ప్రకటించుకోగా ట్రంప్ ప్రభుత్వం హడావుడిగా ఆయనకు అధికార గుర్తింపు కూడా ప్రకటించింది. కెనడా తదితర అమెరికా అనుంగుదేశాలు గుయ్‌డొకి మద్దతు ప్రకటించగా చైనా, రష్యా, క్యూబా, మెక్సికొ, టర్కీ తదితర దేశాలు మదురొకు మద్దతు ప్రకటించాయి. రాజకీయ చర్చలకు అనువైనది పార్లమెంటు అని, పార్లమెంటుకు త్వరలో ఎన్నికలు జరపడం మంచిదేనని ఆయన అన్నారు. అయితే అధ్యక్ష పదవికి ఇప్పుడే మరోసారి ఎన్నికలు జరపడం సాధ్యంకాదని ఆయన అన్నారు. ఇటీవలే అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. మళ్లీ అధ్యక్ష ఎన్నికలు కావాలని సామ్రాజ్యవాదులు పట్టుబడితే 2025 వరకు ఆగాల్సిందే అని మదురొ తెలిపారు. 2013 నుండి కూడా మదురొ రాజీనామా చేసి ఎన్నికలు జరపాలని ప్రతిపక్షం కోరింది. అధ్యక్ష ఎన్నికలలో పాల్గొనకుండా ఎన్నికలు సజావుగా జరగలేదని ఇప్పుడు ఆరోపిస్తోంది.

ఈ ఎన్నికలు న్యాయబద్ధమైనవి కాదని యూరోపియన్ యూనియన్, అమెరికా వాదిస్తున్నాయి. దేశంలో అనిస్థితి ఏర్పడిన దశలో సైన్యం కూడా మదురొకు అండగా నిలిచింది. తనను హత్యచేయవలసిందిగా కొలంబియా ప్రభుత్వాన్ని ట్రంప్ ఆదేశించినట్టుగా మదురొ చెప్పారు. తనకేమైనా జరిగితే అందుకు ట్రంప్, కొలంబియా అధ్యక్షుడు ఇవాన్‌డ్యూక్ బాధ్యత వహించాలని మదురొ అన్నారు. అయితే తాను రక్షణలోనే ఉన్నానని చెప్పారు. ప్రతిపక్షం అధికారాన్ని చేజిక్కించుకునేందుకు చేసిన ప్రయత్నాన్ని రష్యా ఖండిస్తూ మదురొనే ఆదేశానికి న్యాయబద్ధమైన నాయకుడని ప్రకటించింది. వెనిజులాతో రష్యాకు చాలాకాలంగా మంచి సంబంధాలున్నాయి. అమెరికా ఆంక్షలు విధించడం వల్ల రష్యాతో తమకుగల సంబంధాలు ఏమాత్రం దెబ్బతినవని మదురొ ప్రకటించారు.

రష్యా స్వతంత్రమైన, సార్వభౌమాధికారంగల శక్తివంతమైన దేశం. రష్యా, వెనిజుల స్వతంత్ర దేశాలు. రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, భారీ చమురు ఉత్పత్తి ప్రాజెక్టులకు సంబంధించిన అవగాహన ఉంది. రెండు దేశాల మధ్య సంబంధాలు చక్కగానేవున్నాయని స్పుత్నిక్ వార్తాసంస్థతో అన్నారు.

ఆంక్షలపై చైనా హెచ్చరిక : వెనిజులాపైన విధించిన ఆంక్షల పర్యవసానాలకు అమెరికా బాధ్యత వహించవలసి ఉంటుందని చైనా హెచ్చరించింది. వెనిజుల ప్రభుత్వ చమురు కంపెని పిడివియస్‌ఎ పైన అమెరికా ఆంక్షలు విధించిన అంశం తెలిసిందే. చైనా విదేశాంగశాఖ ప్రతినిధి జంగ్‌షుయాంగ్ మాట్లాడుతూ, విదేశీ జోక్యం పరిస్థితులను మరింత సంక్లిష్టం చేస్తాయన్న అంశం చరిత్రలో అనుభవమైందని పేర్కొన్నారు. అమెరికా ఆంక్షలవల్ల ప్రజల జీవితాలు మరింతగా దుర్భరంగా తయారవుతాయని షుయాంగ్ అన్నారు.

ఈయూతో చర్చలకు బ్రిటన్ ఎంపీల మద్దతు

లండన్ : యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుండి వైదొలగేందుకు బ్రెగ్జిట్ ముసాయిదా ఒప్పందంపై మరోసారి ఈయూతో చర్చలు జరపడానికి బ్రిటన్ పార్లమెంటు సభ్యులలో ఎక్కువమంది తమ మద్దతు తెలియజేశారు. అయితే చర్చలకు ఈయూ కౌన్సిల్ అధ్యక్షుడు డొనాల్డ్‌టస్క్ తిరస్కరించారు. గత నవంబరులో కుదిరిన బ్రెగ్జిట్ ముసాయిదా ఒప్పందంపై తిరిగి చర్చలు జరిపే అవకాశం లేదన్నారు. బ్రెగ్జిట్ ఒప్పందంపై ఈయూ తీసుకున్న వైఖరిలో ఎలాంటి మార్పులేదని ఐర్లాండ్ ప్రభుత్వం కూడా తెలిపింది. బ్రెగ్జిట్‌పై ఈయూతో మరోసారి చర్చలు జరిపేందుకుగాను పార్లమెంటులో ప్రవేశపెట్టిన తీర్మానానికి అనుకూలంగా 3017మంది ఓటు చేయగా 301 మంది వ్యతిరేకంగా ఓటు చేశారు. ఐర్లాండ్ సరిహద్దులో రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా కుదిరిన ఒప్పందంలో సవరణలు చేయడానికి ఎంపీలు తమ సమ్మతి తెలిపారు. మంగళవారం రాత్రి జరిగిన కామన్స్ సభలో ఎంపీల నుండి ప్రధాని థెరిసామె తోడ్పాటును పొందారు. బ్రస్సెల్స్‌తో కొత్త ఒప్పందం చేసుకునేందుకు తనకు ఎంపీలు అవకాశం ఇచ్చారని ఆమె అన్నారు. దీనిపై ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రాన్ మాట్లాడుతూ ఒప్పందం తిరిగి చర్చించేదికాదని అన్నారు. బ్రిటన్ కామన్స్ సభలో పార్టీలతో నిమిత్తం లేకుండా ఎక్కువమంది ప్రధానికి అనుకూలంగా ఓటు చేయడం విశేషం. ఒప్పందం లేకుండా ఈయూ నుండి వైదొలగాలన్న ప్రతిపాదనను కూడా ఎంపీలు తిరస్కరించారు. థెరిసా మాట్లాడుతూ ఒప్పందం జరగకుండా ఈయూ నుండి వైదొలగడానికి తాను కూడా సమ్మతించడంలేదని చెప్పారు. కామన్స్ సభ మద్దతు ఇచ్చినందున థెరిసా ఒప్పందంపై తిరిగి చర్చలు జరిపేందుకు రెట్టింపు కృషి చేయవలసివుంటుంది. మరోసారి చర్చలు జరపడం కూడా అంత తేలికైన అంశంకాదు. ఒప్పందంలో చట్టబద్ధమైన మార్పులకోసం తాను కృషి చేస్తానని థెరిసా అన్నారు. సభ మద్దతు తనకు ఉన్నట్టయితే 2016 జూన్‌లో దేశ ప్రజలు చేసిన నిర్ణయాన్ని అమలు జరిపి ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసాన్ని పునరుద్ధరించగలమని థెరిసా అన్నారు. ఈయూ నుండి వైదొలగేందుకు మార్చి 29 చివరిగడువు. అయితే ఆ గడువును లెక్కచేయకుండా ఒప్పందాన్ని ఆమోదించడానికి జాప్యం చేయాలని కొంతమంది ఎంపీలు కోరుతున్నారు.



అన్నాహజారే దీక్ష

(మొదటిపేజీ తరువాయి)

విచారించవచ్చు. ప్రధానికి వ్యతిరేకంగా ప్రజలు ఆధారాలు ఇస్తే లోక్‌పాల్ విచారణ జరుపుతుంది. అదేవిధంగా, తగిన ఆధారాలు అందజేస్తే ముఖ్యమంత్రి, మంత్రులందరినీ, ఎమ్మెల్యేలను లోకాయుక్త విచారించవచ్చు. అందువల్ల లోకాయుక్త, లోక్‌పాల్‌ను తీసుకురావాలని వారు కోరుకోవడంలేదు. ఏ పార్టీ కూడా దీని గురించి పట్టించుకోవడంలేదు. లోక్‌పాల్ బిల్లును 2013లో పార్లమెంట్ ఆమోదించింది. కానీ, ప్రభుత్వం ఇంత వరకు నియామకం జరపలేదు" అని హజారే తెలిపారు. ఇప్పుడు రాజకీయ నాయకులుగా ఉన్న మీ పాత మద్దతుదారులను దీక్షలో మీతోపాటు వేదిక పంచుకునేందుకు అనుమతిస్తారా? అని అడిగిన ప్రశ్నకు హజారే "రాజకీయ నాయకులు నాతో వేదికపై ఉండాలని నేను అనుకోవడంలేదు" అని చెప్పారు. "లోక్‌పాల్‌ని నియంత్రిస్తూ మరో చట్టాన్ని వారు మూడు రోజుల్లో ఆమోదిస్తారు, రాష్ట్రపతి సంతకం కూడా పొందుతారు. కానీ, లోక్‌పాల్ నియామకానికి వారు ఐదేళ్లు సమయం తీసుకున్నా ఏమీ చేయరు. అందువల్ల రాజకీయ నాయకులు మాతో వేదికపంచుకోవాలని మేము కోరుకోవడంలేదు" అని హజారే స్పష్టం చేశారు. జనవరి 30వ తేదీ జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి. ఈ రోజును మృతవీరుల స్మారక దినంగా పాటిస్తారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న హజారే నిరాహార దీక్ష గురించి ప్రకటించారు. '2014లో అవినీతి రహిత ప్రభుత్వం అనే నినాదంతో మోడీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఆయన లోక్‌పాల్ బిల్లును అమలు చేస్తారని, తద్వారా దేశంలో అవినీతికి కళ్లెం పడుతుందని ఆశించా. ఐదేళ్లు గడిచిపోయాయి. ఇప్పటికీ ఆ దిశగా అడుగులు పడలేదు. ప్రభుత్వం కావాలనే దీన్ని ఆలస్యం చేస్తూ వస్తోంది. అందుకే నేను మరోసారి దీక్షకు దిగుతున్నా' అని ఆ సందర్భంలో హజారే తెలిపారు. లోక్‌పాల్, లోకాయుక్త నియామకాలపై హజారే గతంలోనూ నిరాహార దీక్ష చేపట్టిన సంగతి తెలిసిందే.

సుప్రీం హెచ్చరికతో దిగొచ్చిన కేంద్రం

న్యూఢిల్లీ : అవినీతి కేసులను విచారించేందుకు కేంద్రంలో లోక్‌పాల్ ఏర్పాటు చేయాలని సుదీర్ఘ కాలంగా ప్రజలు డిమాండు చేస్తున్నప్పటికీ, ఇంతవరకూ ఫలితం కన్పించలేదు. ఇటీవల సుప్రీంకోర్టు గడువు విధించి చేసిన హెచ్చరికతో కేంద్ర ప్రభుత్వం దిగొచ్చింది. లోక్‌పాల్ చైర్మన్, ఇతర సభ్యులను నియమించేందుకుగాను అర్హుల నుండి దరఖాస్తులను స్వీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దరఖాస్తులను ఆహ్వానిస్తూ, త్వరలో ప్రకటనలు జారీ చేయనున్నట్లు బుధవారం అధికారులు తెలియజేశారు. ఎనిమిది మంది సభ్యులతో కూడిన అన్వేషణ కమిటీని ఏర్పాటుచేశారు. ఈ కమిటీ అర్హులైన వారి నుండి దరఖాస్తులను ఆహ్వానించడం లేదా నియామకాలు చేయడం లాంటి కార్యకలాపాలను నిర్వహిస్తుంది. సుప్రీంకోర్టు మాజీ జడ్జి రంజనప్రకాష్ దేశ్‌య్ ఈ కమిటీకి నాయకత్వం వహిస్తున్నారు. కమిటీ మంగళవారం సమావేశమై లోక్‌పాల్ ఏర్పాటు అంశాన్ని చర్చించింది. త్వరలో దరఖాస్తులను కోరనున్నట్టు సిబ్బంది మంత్రిత్వశాఖ బుధవారం ప్రకటించింది. తదుపరి అంశాలను చర్చించేందుకు 15 రోజుల లోపు మరోసారి అన్వేషణ కమిటీ సమావేశమవుతుంది. లోక్‌పాల్ చైర్మన్, సభ్యులను నియమించేందుకు వీలుగా ప్యానల్ సభ్యుల పేర్లను ఫిబ్రవరి చివరిలోపు పంపాలని సుప్రీంకోర్టు ఆదేశించిన కొద్దిరోజుల్లోనే అన్వేషణ కమిటీ సమావేశమైంది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలోని ఎంపిక కమిటీ లోక్‌పాల్ చైర్మన్‌ను, సభ్యులను ఎంపిక చేస్తుంది. జనవరి 17వ తేదీన సుప్రీంకోర్టు చర్చలను త్వరగా పూర్తిచేసి ప్యానల్ పేర్లను సిఫార్సు చేయాలని కోరింది. లోక్‌పాల్ చట్టం ప్రకారం, అవినీతి కేసులను విచారించేందుకు కేంద్రంలో లోక్‌పాల్‌ను, రాష్ట్రాలలో లోకాయుక్తలను ఏర్పాటుచేయాలి. ప్రభుత్వ యంత్రాంగంలోని కొన్ని కేటగిరీల సిబ్బందిపై వచ్చే ఆరోపణలను ఇవి విచారిస్తాయి. 2013లో లోక్‌పాల్ చట్టం చేశారు. అన్వేషణ కమిటీలో ఎస్‌బీఐ మాజీ చైర్మన్ అరుంధతీ భట్టాచార్య , ప్రసారభారతీ చైర్మన్ ఏ.సూర్యప్రకాష్, ఇస్రో చైర్మన్ ఏఎస్ కిరణ్‌కుమార్ సభ్యులుగా ఉన్నారు. వీరే కాకుండా అలహాబాద్ హైకోర్టు మాజీ జడ్జి సఖరాం సింగ్ యాదవ్, గుజరాత్ పోలీసు విభాగం మాజీ చీఫ్ షబ్బీర్ హుస్సేన్, పదవీ విరమణ చేసిన ఐఏఎస్ అధికారి లలిత్ కె పన్వర్, రంజిత్‌కుమార్ సభ్యులుగా ఉన్నారు. లోక్‌పాల్ ఎంపిక కమిటీ చైర్మన్‌గా ప్రధాని, సభ్యులుగా లోక్‌సభ స్పీకర్, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేదా ఆయన నియమించే జడ్జి, రాష్ట్రపతి నియమించే ప్రముఖ న్యాయాధిపతి సభ్యులుగా ఉంటారు. ప్యానల్ సభ్యుడిగా ఉన్న సీనియర్ న్యాయవాది పీపీ రావు మృతిచెందడంతో ఆయన స్థానంలో మాజీ అటార్నీ జనరల్ ముఖుల్ రోహతగిని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నియమించారు.

ఇక... ఏపీ 39

(మొదటిపేజీ తరువాయి)

ఉంటుందన్నారు. పూర్తి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఈ విధానాన్ని అందు బాటులోకి తీసుకొచ్చామన్నారు. రాష్ట్రంలోని ఆటోలు, ట్రాక్ట ర్లకు రోడ్డు పన్నును మినహాయిం చడం ద్వారా 10 లక్షల కుటుంబాలకు మేలు చేకూరింద న్నారు. విద్యుత్‌తో నడిచే వాహనాలకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్, జీవిత పన్ను రుసు ములను మినహాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన చెప్పారు. తొలి నెంబరు ఏపీ-39 ఏ 0002 నెంబరును కైవసం చేసుకున్న ముప్పాల కల్పనకు మంత్రి సర్టిఫికెట్‌తో పాటు వాహన రిజిస్ట్రేషన్ ప్లేటును అందజేశారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గద్దె అనురాధ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, రవాణాశాఖ కమిషనర్ బాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

హోదా సాధనకు జేఏసీ

(మొదటిపేజీ తరువాయి)

రాజకీయ పార్టీలన్నీ గైర్హాజరయ్యాయి. తొలుత చంద్ర బాబు మాట్లాడుతూ తమిళనాడులో రాష్ట్రప్రయోజనాల కోసం అన్ని పార్టీలూ ఏకమవుతాయని, ఇక్కడ భిన్నమైన పరిస్థితి ఉందని సీఎం తెలిపారు. భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక కోసమే ఈ సమావేశమన్నారు. అఖిలపక్ష సమావేశానికి ప్రతి పక్షపార్టీలు తక్కువగా వచ్చాయని, ప్రజా సంఘాల ప్రతినిధులు ఎక్కువగా హాజరయ్యారన్నారు. బహుశా ఎన్నికలు ఆసన్నమైన సమయం అయినందువల్ల రాజకీయపార్టీల నేతలు రాలేక పోయివుండవచ్చని అభిప్రాయపడ్డారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి నిరసనగా ఫిబ్రవరి 1న అఖిలపక్షాలు ఇచ్చిన రాష్ట్ర బంద్‌కు సంఘీభావం తెలుపలేం కాబట్టి, అసెంబ్లీలో నల్ల బ్యాడ్జీలు ధరించి కేంద్రానికి తమ నిరసనను తెలుపుతామన్నారు. కేంద్రం తనకింద గుమాస్తాగా పనిచేసే వారిలా రాష్ట్రాన్ని లెక్కలు అడుగుతోందని, ఇదేం పద్ధతి? అని ముఖ్యమంత్రి ఆగ్రహంగా ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు నిధుల మంజూరులో ఇబ్బందులు పెట్టడం, ప్రత్యేక హోదా కంటే మిగులుగా ప్యాకేజీ ఇస్తానని మోసం చేసిన పరిణామాలను వివరించారు. ప్రత్యేక ప్యాకేజి ఇస్తామని చెప్పినట్లు ఇవ్వకపోగా వెనుకబడిన జిల్లాలకు ఇచ్చిన రూ.350కోట్లు వెనక్కి తీసుకోవడం దారుణమన్నారు. బుధవారం హాజరు కాని పక్షాలను కూడా మరలా జేఏసీకి ఆహ్వానించాలని అధికారులకు సూచించారు. ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ ఫిబ్రవరి 1వ తేదీ జరుగనున్న బంద్‌కి అన్నివర్గాలు సహకరించి ఢిల్లీ దద్దరిల్లేలా నిర్వహించాలని కోరారు. ఏపీఎన్జీవో మాజీ అధ్యక్షులు అశోక్‌బాబు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐ.వి.సుబ్బారావు, ప్రధానకార్యదర్శి చందు జనార్ధన్, ఏపీజేఏఫ్ అధ్యక్షులు కృష్ణాంజ నేయులు, ఫార్వర్డ్‌బ్లాక్ నాయకులు పీవీ సుందరరామరాజు, మహిళా ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.

1న మధ్యంతర బడ్జెటే..

న్యూఢిల్లీ : సంప్రదాయాలను పక్కనబెట్టి ఈసారి కేంద్రప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్లు కొన్ని రోజులుగా పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ ఊహాగా నాలపై కేంద్ర ఆర్థికశాఖ తాజాగా స్పందించింది. బడ్జెట్‌పై ఎలాంటి గందరగోళం అవసరం లేదని, 2019-20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్లు స్పష్టం చేసింది. అటు లోక్‌సభ ప్రొవిజినల్ క్యాలెండర్‌లోనూ మధ్యంతర బడ్జెట్ అనే ఉంది. ఫిబ్రవరి 1 ఉదయం 11గంటలకు ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నట్లు ఆ క్యాలెండర్‌లో పేర్కొన్నారు. ఈ మధ్యంతర బడ్జెట్‌ను కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ప్రవేశపెట్టనున్నారు. వైద్య చికిత్సల నిమిత్తం అరుణ్‌జైట్లీ అమెరికా వెళ్లడంతో ఆర్థికశాఖ బాధ్యతలను తాత్కాలికంగా పీయూష్ గోయల్‌కు అప్పగించారు.

సార్వత్రిక ఎన్నికల ముందు పూర్తిస్థాయి బడ్జెట్ కాకుండా నాలుగు నెలల కోసం మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ఎన్నికల అనంతరం ఏర్పడే ప్రభుత్వం మిగతా ఎనిమిది నెలలకు పూర్తిస్థాయి బడ్జెట్ తీసుకొస్తుంది. ఈ సంప్రదాయాన్ని పక్కనబెట్టి ఈసారి ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను తీసుకురావాలనే యోచనలో ఉన్నట్లు కొన్ని రోజులుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీనిపై ఆర్థికశాఖ స్పష్టతనిచ్చింది. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి.

సెబీ అధికారాలకు కత్తెర?

ముంబై : సెక్యూరిటీ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) అధికారాలకు కత్తెర వేసేందుకు కేంద్ర ప్రభుత్వం వ్యూహాన్ని సిద్ధం చేస్తున్నట్లు పలు పత్రికల్లో వార్తలు వచ్చాయి. ఇప్పటికే కేంద్రం ఆర్‌బీఐకి కళ్లెం వేసింది. సెబీ ఏవైనా నిర్ణయాలు తీసుకొనే ముందు ఆ ప్రతిపాదనలను ఒక స్వతంత్ర కమిటీకి నివేదించాలని సూచించినట్లు సమాచారం. ఈ కమిటీలో సభ్యులుగా బోర్డు డైరెక్టర్లు ఉంటారా.. బయట వ్యక్తులు ఉంటారా అనే విషయంపై ఇంకా స్పష్టతరాలేదు. ఒకవేళ ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఆర్థిక వ్యవహారాల

విభాగం ఈ కమిటీ సభ్యులను నియమిస్తే ప్రభుత్వానికి సెబీపై మరింత పట్టు లభిస్తుంది. సెబీ నిబంధనలను ఆమోదించే ముందు ఆ ప్రతిపాదనలను ఒక కమిటీ ఎదుట ఉంచాలని ఆర్థిక వ్యవహారాల విభాగం సూచించినట్లు సమాచారం. దీనికి భవిష్యత్తులో సెబీ చట్టానికి సవరణ చేయాల్సిన అవసరం ఉంటుంది. దాదాపు 25 ఏళ్ల నుంచి సెబీ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటోంది. కానీ ఈ కొత్త మార్పు వల్ల సెబీ నిర్ణయాలకు జవాబుదారీ బాధ్యతలు పెరుగుతాయి. సెబీ కొన్నేళ్లుగా అమల్లోకి తెచ్చిన నియమ నిబంధనల్లో ఒక్కదానినీ పార్లమెంట్ మార్చలేదు.

ఈ వార్తలపై సెబీ ఇంతవరకు స్పందించలేదు. అక్టోబరులో ఆర్‌బీఐ స్వతంత్రతపై వివాదం చెలరేగింది. అప్పట్లో ప్రభుత్వం ఆర్‌బీఐపై సెక్షన్ 7ఏను ఉపయోగించినట్లు విమర్శలు వెల్లువెత్తాయి. దీనిప్రకారం ఆర్‌బీఐ ఏ నిర్ణయం తీసుకొనే ముందైన ప్రభుత్వంతో చర్చించాల్సి ఉంటుంది. దీంతో ప్రభుత్వం వెనక్కి తగ్గినట్లు అనిపించినా.. బోర్డులోని నామినేటెడ్ డైరెక్టర్ల రూపంలో ఆర్‌బీఐ పట్టు సాధించింది.

ప్రతికూలతలోనూ ప్రగతి

(మొదటిపేజీ తరువాయి)

అద్భుతమైన వృద్ధిని సాధించడం విశేషమన్నారు. ఏపీ వృద్ధి రేటు సగటున 10.66 శాతంగా ఉండగా, జాతీయస్థాయిలో వృద్ధి గమనం 7.3 శాతంగానే ఉందన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాలలో 11 శాతం వృద్ధితో రికార్డు స్థాయి నమోదు చేసుకుందన్నారు. ఇది దేశంలోనే అత్యధికమని, జాతీయ స్థాయి వృద్ధి రేటును పరిశీలిస్తే కేవలం 2.4 శాతంగానే ఉందన్నారు. కేంద్రం సహకరించి ఉంటే మరింతగా వృద్ధిని సాధించే వాళ్లమని గవర్నర్ చెప్పారు.

ప్రస్తుతం పయాడక్ట్ ప్లాట్‌ఫామ్‌పై విజన్ 2019-24ను రూపొందించుకుని అడుగులు వేస్తున్నాం. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రజలకు చేర్చడం, మౌలిక సదుపాయాల కల్పన, అవసరమైన పౌర సేవలలో చాలావరకు గరిష్ఠ స్థాయి పురోగతిని సాధించడం లక్ష్యంగా పేర్కొన్నారు. అన్ని విభాగాలలో పూర్తిస్థాయిలో ప్రజలకు ప్రయోజనాలను అందించడం కోసం విజన్ 2019-24ను రూపొందించుకుంటున్నాం. 2029 విజన్ ద్వారా ప్రభుత్వ లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రజల్లో విశ్వాసం పెంచేందుకు ప్రయత్నిస్తున్నాం. దీనిలో భాగంగానే పట్టిసీమ ద్వారా గోదావరి-కృష్ణా అనుసంధానం చేశాం. ఇది దేశానికే మార్గదర్శకం. తాజాగా గోదావరి-పెన్నా అనుసంధానానికి రంగం సిద్ధం చేశాం. పంచనదుల మహా సంగమమే మన లక్ష్యమని ఉద్ఘాటించారు. నాలుగున్నరేళ్లలో నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణంపై రూ.64,333 కోట్లు ఖర్చుచేసి 23ప్రాజెక్టులు పూర్తిచేశాం. అందులో 17ప్రాజెక్టులను ఇప్పటికే జాతికి అంకితం చేశామని, మరో ఆరు ప్రాజెక్టులు ప్రారంభానికి సిద్ధంగా ఉండగా, 26 ప్రాజెక్టుల నిర్మాణం పురోగతిలో ఉందని వివరించారు. ఇవికాక మరో 13ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. .2014నుంచి ఇప్పటిదాకా 32.02లక్షల ఎకరాల ఆయకట్టుకు(స్థిరీకరణ తో సహా) సాగునీటి వసతి కల్పించినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వాలు 2004-14మధ్య పదేళ్లలో రూ.79,357 కోట్లు ఖర్చుచేసినా జలయజ్ఞాన్ని ధనయజ్ఞంగా మార్చి ఒక్క ప్రాజెక్టు పని కూడా సక్రమంగా చేయలేదన్నారు. పట్టిసీమ ద్వారా గత నాలుగేళ్లలో 260 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా ఆయకట్టు రైతులకు ఇచ్చామని, దీనివల్ల దాదాపు రూ.40వేల కోట్ల విలువైన పంట దిగుబడులు సాధించామన్నారు. అంతేగాక పోతిరెడ్డిపాడు ద్వారా దాదాపు 110 టీఎంసీల కృష్ణా జలాలను రాయలసీమకు మళ్లించే అవకాశం ఏర్పడిందన్నారు.

పోలవరానికి గిన్నీస్ రికార్డు

పోలవరం ప్రాజెక్టుపై ఇంతవరకు రూ.15,585.17కోట్లు ఖర్చుచేశాం. 32,315.50 క్యూబిక్ మీటర్ల సిమెంట్ కాంక్రీట్ పనులు ఒకేరోజు పూర్తి చేసి గిన్నీస్ రికార్డు సాధించాం. బెస్ట్ ప్రాజెక్టుగా పోలవరానికి సీబీఐపీ అవార్డు వచ్చిందంటే మన ప్రభుత్వ ఘనత అని గవర్నర్ పేర్కొన్నారు. 28వేల ఊటకుంటలు పునరుద్ధరించాం. 4,735చెరువులు, 3,348కేస్ కేడ్లు అభివృద్ధి చేశాం. 93వేల చెక్ డ్యాములు నిర్మించాం. 8లక్షల పంటకుంటలు తవ్వాం.పంటకుంటల తవ్వకంలో అనంతపురం జిల్లా దేశంలోనే నంబరు వన్‌గా నిల్చింది.

మైక్రో ఇరిగేషన్‌లో నంబరు వన్‌గా ఉన్నాం. దేశంలో ముందున్న 10జిల్లాలలో ఆరు మనవే(అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు, ప్రకాశం, పశ్చిమ గోదావరి) వుండడం విశేషంగా పేర్కొన్నారు. రూ.24,000కోట్ల రుణమాఫీ రైతుల్లో ఎనలేని భరోసా నింపింది. రైతులను సంక్షోభం నుంచి గట్టెక్కించింది. మిగిలింది కూడా ఒక్కసారే వచ్చే నెలలో ఇస్తున్నామని గవర్నర్ ప్రకటించారు. ప్రజలకు మెరుగైన జీవనం అందించాలన్నదే మన అంతిమలక్ష్యమన్నారు.

అందుకు అవసరమైన జీవన ప్రమాణాలను పెంచడమే మన ముందున్న కర్తవ్యమని, సమాజ వికాసం, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, కీ పెర్ఫామెన్స్ ఇండికేటర్స్, జీవీఏ లక్ష్యాలు వంటి సామాజిక కొలమానాల ద్వారా ప్రపంచ ప్రమాణాలను అందుకునేందుకు తగ్గ కృషి జరుగుతోంది.

గ్రామ, జిల్లా, రాష్ట్ర స్థాయి మూడంచెల పరిపాలనలో రానున్న ఐదేళ్లకు అవసరమైన విజన్‌ను రూపొందించుకున్నాం. అభివృద్ధి ఫలాలను ప్రజలందరికీ చేర్చడంలో 'పయాడక్ట్' అనే మన నూతన విధానమే సమ్మిళత అభివృద్ధి మంత్రమన్నారు. అవినీతిరహిత పాలనతో ప్రభుత్వాన్ని జవాబుదారీగా, పారదర్శకంగా ఉంచాలన్నదే ప్రయత్నమన్నారు. ప్రజల సంతృప్తిస్థాయిలో పెరుగుదల కనిపించడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని గవర్నర్ తన ప్రసంగాన్ని ముగించారు. అనంతరం స్పీకర్ సభను గురువారానికి వాయిదా వేశారు.

ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి అసెంబ్లీకి హాజరైన చంద్రబాబు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యే ముందుగా ఎప్పటిలాగే వెంకటపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, మంత్రులు అచ్చెన్నాయుడు, నక్కా ఆనందబాబు, కేఎస్ జవహర్, చీఫ్‌విప్ పల్లె రఘునాథరెడ్డి, పలువురు శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

ఏడేళ్ల చిన్నారిపై అఘాయిత్యం

- గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స
- మాచర్ల-గుంటూరు ప్రధాన రహదారిపై గ్రామస్తుల ధర్నా
- పోలీసుల అదుపులో నిందితుడు

విశాలాంధ్ర-రెంటచింతల : గుంటూరు జిల్లా రెంటచింతల మండలం తుమ్మకోట గ్రామంలో 1వ తరగతి చదువుతున్న చిన్నారిపై 25 ఏళ్ళ యువకుడు అత్యాచారానికి పాల్పడిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. తుమ్మకోట గ్రామానికి చెందిన ఏడేళ్ళ చిన్నారి రాత్రి 8.00 గంటల సమయంలో బహిర్భుమికి వెళ్ళేందుకు ఇంటి నుంచి బయటకు వచ్చింది. అదే గ్రామానికి చెందిన జయరావు ఫుల్‌గా మద్యం సేవించి చిన్నారిపై దారుణంగా అత్యాచారానికి ఒడిగట్టాడు. తీవ్ర రక్తస్రావంతో ఇంటికి వెళ్ళిన చిన్నారి తల్లికి జరిగిన విషయాన్ని వివరించింది. తల్లి స్థానిక హాస్పిటల్‌కు తీసుకువెళ్ళగా వైద్యులు గుంటూరు తీసుకువెళ్ళవలసిందిగా సూచించడంతో బాలికకు గుంటూరు సమగ్ర వైద్యశాలలో చికిత్సను అందిస్తున్నారు. గ్రామస్తులంతా చిన్నారికి జరిగిన ఘటనపై మండిపడుతూ నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని పాల్వాయి జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహించారు. బుధవారం ఉదయం 9 గంటల సమయంలో ప్రారంభమైన రాస్తారోకో మధ్యాహ్నం 2.30 గంటల వరకు కొనసాగింది. దీంతో ఇరువైపుల భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. గురజాల డీఎస్పీ శ్రీహరిబాబు, ఎస్సై హరిబాబు గ్రామస్తులను సముదాయించే ప్రయత్నం చేశారు. నిందితుడిని బహిరంగంగా ఉరి తీయాలని, లేదంటే వారికి అప్పగించాలని డిమాండు చేశారు. నిందితుడిని గురజాల పోలీసుస్టేషన్‌కు తరలించడంతో గ్రామస్తులు శాంతించారు.





దళితుల అభివృద్ధికి పాటుపడాలి

- సోషల్ వెల్ఫేర్ కమిషనర్ రామారావు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్
- డీహెచ్‌పీఎస్ డైరీ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : దళితుల అభివృద్ధి, సంక్షేమం కోసం సామాజిక సంఘాలన్నీ కృషి చేయాలని సోషల్ వెల్ఫేర్ కమిషనర్ ఎం.రామారావు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ పిలుపునిచ్చారు. అమరావతిలోని సోషల్ వెల్ఫేర్ కమిషనర్ కార్యాలయంలో బుధవారం దళితహక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) డైరీని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ, దళితుల అభ్యున్నతికి అనేక చట్టాలు, పథకాలు రూపొందించినప్పటికీ, సమర్థంగా అమలు కావట్లేదని అన్నారు. సమగ్ర సమాచారంతో ముద్రించిన డీహెచ్‌పీఎస్ డైరీ ఉద్యమ నాయకులకు కరదీపికగా ఉపయోగపడుతుందని ఆకాంక్షించారు. జల్లి విల్సన్ మాట్లాడుతూ, దీర్ఘకాలికంగా దళితులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేవీ ప్రభాకర్, కరవది సుబ్బారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి బుట్టి రాయప్ప, సహాయ కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు వి.కృష్ణంరాజు పాల్గొన్నారు.

ఆంధ్ర జాతీయ విద్యా పరిషత్ ఆస్తులు కాపాడండి

సీఎంకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు లేఖ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : మచిలీపట్నంలోని ఆంధ్ర జాతీయ విద్యా పరిషత్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంస్థలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించి, ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఆయన కోరారు. ఈమేరకు బుధవారం సీఎం చంద్రబాబుకు ఆయన లేఖ రాశారు. భారత జాతీయోద్యమ కాలంలో స్వదేశీ విద్యను ప్రోత్సహించేందుకు కోపల్లి హనుమంతరావు, ముట్నూరు కృష్ణారావు, డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య అనేక కష్టనష్టాలను ఎదుర్కొని విరాళాల రూపంలో వనరులు సమకూర్చి 1910లో ఆంధ్ర జాతీయ కళాశాలను స్థాపించారన్నారు. ఎంతో పేరు ప్రఖ్యాతులు పొందిన ఈ సంస్థ ప్రస్తుతం అక్రమార్కుల బారిన పడిందని, సంస్థ ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. వ్యవస్థాపకుల కుటుంబ సభ్యులెవరికీ వారసత్వ హక్కులుండవని 'మెమోరాండం ఆఫ్ ఆర్టికల్స్'లో పేర్కొన్నారన్నారు.

గవర్నర్ ప్రసంగం అవాస్తవాల పుట్ట

ప్రస్తుత ప్రభుత్వ చివరి అసెంబ్లీ సమావేశాల సందర్భంగా రాష్ట్ర గవర్నర్ చేసిన ప్రసంగం ప్రజల వాస్తవ సమస్యలను విస్మరించిందని మధు విమర్శించారు. ఈమేరకు ఆయన ప్రకటన చేశారు. ఈ ప్రసంగం ద్వారా ప్రభుత్వం ఎన్నికల హామీలు గుప్పించి ప్రజలను మోసపుచ్చడానికి ప్రయత్నించిందన్నారు. కేంద్ర హామీల గురించి ఏకరవు పెట్టి తన అసమర్థతను కప్పిపుచ్చుకునే ప్రయత్నంగానే గవర్నర్ ప్రసంగం ఉందన్నారు.

మత్స్యకారులను ఎస్టీల్లో చేర్చుతాం : మంత్రి కొల్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మత్స్యకారులను ఎస్టీల్లో చేర్చేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందని రాష్ట్ర న్యాయ, యువజన, క్రీడల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మత్స్యకారులను ఎస్టీలో చేర్చే అంశంపై ప్రత్యేక కమిటీ నియమించి అధ్యయనం చేయిస్తున్నామన్నారు. నివేదిక వచ్చిన వెంటనే సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో 14 మత్స్యకార ఉప కులాలున్నాయని, టీడీపీ ప్రభుత్వం వారందరికీ అండగా ఉంటుందని స్పష్టంచేశారు. ప్రత్యేక కార్పొరేషన్ ద్వారా వారి బలోపేతానికి కృషి చేస్తామని వెల్లడించారు.

17న ఏలూరులో వైసీపీ బీసీ గర్జన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : వైసీపీ బీసీగర్జన సభను ఫిబ్రవరి17న ఏలూరులో నిర్వహిస్తామని ఆ పార్టీ సీనియర్ నేతలు ప్రకటించారు. విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం బీసీగర్జనపై కోస్తాంధ్ర రీజియన్ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. బీసీలను ఓట్ల కోసం టీడీపీ వాడుకుంటోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులను కోరారు. ఈ సమావేశానికి బీసీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి, పార్టీ సీనియర్‌నేతలు వైవీ సుబ్బారెడ్డి, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, బొత్స సత్యనారాయణ, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మోపిదేవి వెంకట రమణ, ఎమ్మెల్యేలు రక్షణనిధి, ఆదిమూలపు సురేష్, ఆళ్ల రామకృష్ణారెడ్డి, పార్టీనేతలు సామినేని ఉదయభాను, మల్లాది విష్ణు, జోగి రమేష్, నియోజకవర్గాల సమన్వయకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైసీపీ బీసీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ, బీసీ గర్జనలో బీసీ డిక్లరేషన్‌ను వైసీపీ అధినేత జగన్ ప్రకటిస్తారని, రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

హోదా పేరిట సీఎం డ్రామాలు

బంద్‌కు దూరం : వైసీపీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ప్రత్యేకహోదా సాకుతో సీఎం చంద్రబాబు డ్రామాలాడుతున్నారని వైసీపీ సీనియర్‌నేత, మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి ఎద్దేవా చేశారు. విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రత్యేక హోదాకు వైసీపీ కట్టుబడి ఉందని, గ్రామస్థాయి నుంచి ఢిల్లీ వరకూ ఆందోళనలు నిర్వహించామని వివరించారు. గతంలో ప్రత్యేక హోదా కోసం వైసీపీ బంద్‌కు పిలుపునివ్వగా, పలు రాజకీయ పార్టీలు మద్దతివ్వలేదని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం వైసీపీ కట్టుబడి ఉంటుందని, కొన్ని రాజకీయ పార్టీల నిర్ణయాల కారణంగా ఫిబ్రవరి 1న బంద్‌కు మద్దతివ్వట్లేదని స్పష్టం చేశారు. మాజీ ఎంపీ ఉండవల్లి నిర్వహించిన అఖిలపక్ష సమావేశంపై ఆయన స్పందిస్తూ..టీడీపీ రావడంతోనే వైసీపీ దూరంగా ఉందని వివరణ ఇచ్చారు. గతంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా వద్దని, ప్యాకేజీ కావాలంటూ చంద్రబాబు తెలిపి, పరోక్షంగా హోదాను అడ్డుకున్నారని దుయ్యబట్టారు. అలాంటి పార్టీలు అఖిలపక్ష సమావేశాలకు వస్తే..ఇంకా చర్చలు ఏమి ఉంటాయని ప్రశ్నించారు. గతంలో హోదాను అడ్డుకున్న చంద్రబాబు..మళ్లీ ఢిల్లీలో ఎందుకు ధర్నాకు దిగుతున్నారని విమర్శించారు.

వైసీపీ కార్యాలయంలో గాంధీజీ వర్థంతి

వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో గాంధీజీ వర్థంతి నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి వైసీపీ సీనియర్ నేతలు వైవీ సుబ్బారెడ్డి, బొత్స సత్యనారాయణ, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఆ పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు పూలమాలలేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ చేసిన కృషిని వారు గుర్తుచేశారు.

17న నర్సుల రాష్ట్ర సంఘం ఎన్నికలు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికలు ఫిబ్రవరి 17న గుంటూరులో నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎన్నికల అధికారి, కో-ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి.రాజశేఖర్ తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన ప్రకటన చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నర్సుల సంఘంలో అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఫిబ్రవరి 10 ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. అదే రోజు నామినేషన్లను పరిశీలించి అర్హత కలిగిన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకూ నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని, తర్వాత తుది జాబితాను విడుదల చేస్తామన్నారు. పోలింగ్ 17వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ గుంటూరులోని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ కల్యాణమండపంలో జరుగుతుందన్నారు. అదే రోజు మధ్యాహ్నం ఓట్లను లెక్కించి ఎన్నికైన అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామని రాజశేఖర్ తెలిపారు.

బంద్ జయప్రదం చేయండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : ప్రస్తుత పార్లమెంటు చివరి సమావేశాలలో ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న సందర్భంగా ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో ఫిబ్రవరి ఒకటో తేదీన జరిగే రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. అన్ని రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు, విద్యార్థి, యువజన సంఘాలు, మేధావులు, కార్మికులు, ఉద్యోగులు, వర్తక, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా, సంపూర్ణ మద్దతు తెలపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పార్టీ జిల్లా సమితులు పూర్తిస్థాయిలో కష్టించి పనిచేసి బంద్‌ను జయప్రదం చేయడం ద్వారా కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలన్నారు. విజయవాడ దాసరిభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉండవల్లి అరుణకుమార్ నేతృత్వంలో మంగళవారం జరిగిన సమావేశంలో 2014 ఫిబ్రవరి 18వ తేదీన లోక్‌సభలో విభజన బిల్లు ఆమోదించే సమయంలో రాజ్యాంగ సంప్రదాయాలు పాటించలేదన్న విషయం చర్చకు వచ్చిందన్నారు. విభజన బిల్లులో పొందుపరచిన అంశాలు, హామీలు అమలు చేయలేదని అంతా అంగీకరించారన్నారు. విభజన కారణంగా కేంద్రం నుంచి రూ. 1.13 లక్షల కోట్లు రావాలని ప్రభుత్వం చెబుతోందన్నారు. లోక్‌సత్తా పార్టీ అధినేత జయప్రకాష్ తన నివేదికలో దాదాపు లక్ష కోట్లు రావాలని, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఏర్పాటు చేసిన సంయుక్త నిజ నిర్ధారణ కమిటీ రూ. 70వేల కోట్ల వరకూ కేంద్రం ఇవ్వాల్సి ఉందని తేల్చి చెప్పిందన్నారు. ఈ అంశాలపై సమావేశం ఏకాభిప్రాయానికి వచ్చినప్పటికీ బీజేపీ తరపున హాజరైన మాజీ సీఎస్ ఐవైఆర్ కృష్ణారావు అన్నీ చేశామన్నారే తప్ప ఏం చేశారో స్పష్టంగా చెప్పలేకపోయారని తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా ఏం మాట్లాడుతున్నారో ఆయనకే అర్థం కావడంలేదన్నారు. విభజన సమయంలో ప్రధాని మోడీ గుజరాత్ సీఎంగానూ, కన్నా ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా ఉన్న విషయాన్ని కన్నా గుర్తించాలన్నారు. హోదా విషయమై సీఎం చంద్రబాబు ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశం ఆయన రాజకీయ లబ్ధి కోసం తప్ప రాష్ట్రానికి ప్రత్యేకంగా ఒరిగేదేమీ ఉండదన్నారు. మొదట్నుంచీ తాము అఖిలపక్షాన్ని వేయాలని కోరుతుంటే నాలుగేళ్లపాటు బీజేపీతో అంటకాగిన టీడీపీ హోదా సంజీవని కాదని పట్టించుకోలేదన్నారు. ఆరు నెలల క్రితం నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి ఉభయ కమ్యూనిస్టు పార్టీల తరపున తాము హాజరై హోదా ఉద్యమ సమయంలో పెట్టిన పోలీసు కేసులు ఎత్తివేయాలని కోరితే అంగీకరించిన చంద్రబాబు ఇంత వరకూ ఆ దిశలో చర్యలు చేపట్టలేదన్నారు. కేసులు ఎత్తివేయకపోగా 2015 మార్చి నెలలో అనంతపురంలో తమపై పెట్టిన కేసును విజయవాడ కోర్టుకు బదిలీ చేశారన్నారు. దీనిని బట్టి చంద్రబాబుకున్న చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతోందన్నారు. ప్రభుత్వ ధనంతో చంద్రబాబు ధర్మపోరాట దీక్ష చేయవచ్చు కానీ.. తాము



చేస్తే మాత్రం కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పుతారా? అని ప్రశ్నించారు. అఖిలపక్షం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని, అంతిమంగా మోడీ వద్దకు వెళదామంటే తాము సిద్ధమేనని రామకృష్ణ స్పష్టం చేశారు.

గవర్నర్ ప్రసంగం అంతా అవాస్తవాలే!

ఆరు నెలలుగా చంద్రబాబు పదేపదే చెబుతున్న మాటల్నే అసెంబ్లీ సమావేశాల ప్రారంభాన్ని పురస్కరించుకుని గవర్నర్ నరసింహన్ మరోసారి ప్రస్తావిస్తూ ప్రసంగించారని రామకృష్ణ ఎద్దేవా చేశారు. మొత్తం 99 అంశాలపై 40 పేజీలతో, దాదాపు గంటసేపు సాగిన గవర్నర్ ప్రసంగంలో కొత్త అంశం ఒక్కటి కూడా కన్పించలేదన్నారు. కేవలం అబద్ధాలు చెప్పించేందుకే గవర్నర్‌ను హైదరాబాద్ నుంచి రప్పించారని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలోని 670 మండలాలలో 347 మండలాలను ప్రభుత్వం కరవు మండలాలుగా ప్రకటించిందన్నారు. తీవ్ర వర్షాభావం వల్ల లక్షలాది ఎకరాల్లో రైతులు అసలు పంటలే వేయలేదన్నారు. లక్షలాది కుటుంబాలు వలసలు వెళ్లిపోయాయన్నారు. తిత్లీ, పెథాయ్ తుపాన్ల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని వివరించారు. గవర్నర్ ప్రసంగంలో మాత్రం వ్యవసాయ వృద్ధిరేటు 11 శాతం నమోదైనట్లు చెప్పడం దారుణమన్నారు. అనంతపురం జిల్లాలో ఏయే మండలాల్లో ఎన్ని కుటుంబాలు వలసలు వెళ్లాయో ప్రభుత్వం వద్ద లెక్కలున్నాయా?, రెయిన్‌గన్ల సాయంతో ఈ జిల్లాలో ఎన్ని లక్షల ఎకరాలను కాపాడారో లెక్క చెప్పగలరా? అని రామకృష్ణ ప్రశ్నించారు. గవర్నర్ తన ప్రసంగంలో ఎక్కడా వలసలు, కరవు గురించి మాట్లాడకపోవడం దారుణమన్నారు. నాలుగేళ్లలో రాష్ట్రంలో 32 లక్షల ఎకరాలను కొత్తగా సాగులోకి తీసుకొచ్చినట్లు చెప్పారని, ఒక విధంగా ఇలా జరిగితే కనుక ఇది దేశంలోనే కాదు ప్రపంచంలోనే రికార్డు కనుక గిన్నిస్‌బుక్‌లోకి ఎక్కడం ఖాయమన్నారు. అవినీతి రహితంగా, పారదర్శకతతో కూడిన పాలన అందిస్తున్నామని చెప్పడం ప్రజలను పూర్తిగా మోసగించడమే అవుతుందని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా అవినీతి రాజ్యమేలుతోందని, ఈ విషయంలో అన్ని ఎల్లలూ చంద్రబాబు ప్రభుత్వం దాటిపోయిందన్నారు. రాష్ట్రంలో అధికారులు డబ్బు సంపాదనే పనిగా పనిచేస్తున్నారని, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఏకసూత్ర కార్యక్రమంగా డబ్బు సంపాదనలో మునిగితేలుతున్నారని రామకృష్ణ విమర్శించారు.

హోదా రాకుంటే..

ఏపీకి 'రాహుల్' రారు..

- ఎన్నికల కోసమే 'చంద్రబాబు' అఖిలపక్షం
- పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి
- ఆంధ్రరత్నభవన్‌లో గాంధీజీకి నివాళి



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుంటే ఆంధ్రాకు రాహుల్‌గాంధీ రాబోరని పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి ప్రకటించారు. విజయవాడ పీసీసీ కార్యాలయంలో గాంధీజీ వర్థంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి ఆయన పూలమాలలేసి నివాళులర్పించారు. ఏపీకి హోదా ఇవ్వకుంటే ఆంధ్రాకు రాబోనని రాహుల్ చెప్పారని, ఈయన బాటలోనే నా సొంత గ్రామంలోకి అడుగుపెట్టబోనన్నారు. విభజన హామీల అమలుకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని స్పష్టంచేశారు. సీఎం చంద్రబాబు కొత్త పథకాలతో ప్రజల్ని ఆకర్షించేందుకు రూ.20వేల కోట్ల అప్పుచేస్తున్నారని, విభజన హామీల అమలు బీజేపీ వల్ల సాధ్యంకాదని తేలిపోయిందన్నారు. ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే సీఎం చంద్రబాబు హడావుడిగా అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారని విమర్శించారు.

రమణీకుమారి బాధ్యతల స్వీకరణ

రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షులుగా పేడాడ రమణీకుమారి విజయవాడ పీసీసీ కార్యాలయంలో బుధవారం పదవీబాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు రఘువీరారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి , మాట్లాడులూ కాంగ్రెస్‌లో పోటీ చేయాలనే ఆసక్తితో ఉన్న మహిళలకు 25 స్థానాలు కల్పిస్తామని వెల్లడించారు. ప్రియాంక గాంధీ రాకతో మహిళలు ఉత్సాహంగా పనిచేస్తున్నారన్నారు. పేడాడ రమణీకుమారి మాట్లాడుతూ మహిళలను గుర్తించేది..ఒక్క కాంగ్రెస్ పార్టీనేనన్నారు. ఏఐసీసీ కార్యదర్శులు మయ్యప్పన్, క్రిష్టోఫర్ తిలక్, మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం, గంగా భవాని, మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, రాష్ట్ర మహిళా ఇన్‌ఛార్జ్ సుధ, విజయవాడ సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు వి.గుర్నాథం, కృష్ణాజిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ధనేకుల మురళి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన కాంగ్రెస్ లీగల్‌సెల్ సమావేశంలో రఘువీరారెడ్డి మాట్లాడుతూ.. న్యాయవాదులంతా రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు.

4న రాజకీయ పార్టీల సదస్సు

ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ దామోదరరావు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్‌ఆర్టీసీ) ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం ఫిబ్రవరి 6వ తేదీ నుంచి నిర్వహించ తలపెట్టిన సమ్మెకు మద్దతు కోరుతూ 4వ తేదీన విజయవాడలో అన్ని రాజకీయపార్టీలతో సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ పలిశెట్టి దామోదరరావు, కో-కన్వీనర్లు సీహెచ్.సుందరయ్య, వి.వరహాలనాయుడు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ప్రకటన చేశారు. సంస్థ పరిరక్షణ, మెరుగైన వేతన సవరణ సహా పలు సమస్యలను పరిష్కరించాలని యాజమాన్యాన్ని కోరుతున్నప్పటికీ పే కమిటీ సమావేశాల పేరుతో కాలయాపన చేస్తోందన్నారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో 6వ తేదీ నుంచి సమ్మె చేయాలని నిర్ణయించామని, ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె నిర్వాహక ధర్నాలు, నిరాహారదీక్షలు చేపట్టినట్లు ఆయన వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రీజనల్ మేనేజర్ కార్యాలయాల వద్ద బుధవారం జరిగిన ధర్నా కార్యక్రమాల్లో 6వేల మంది ఉద్యోగులు హాజరైనట్లు చెప్పారు. కృష్ణా,గుంటూరు జిల్లాలు మినహా మిగిలిన 11 జిల్లాల్లోని అన్ని రాజకీయపార్టీలు, కార్మిక సంఘాల నాయకుల మద్దతు కోరుతూ రౌండ్‌టేబుల్ సమావేశాలు కూడా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కృష్ణా,గుంటూరు జిల్లాల్లో మాత్రం కార్మిక సంఘాలతో మాత్రమే రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహిస్తున్నామని నాయకులు తెలిపారు.

బంద్‌కు వ్యవసాయ, రైతు సంఘాల మద్దతు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ప్రత్యేకహోదా, విభజన హామీల సాధన సమితి పిలుపులో భాగంగా ఫిబ్రవరి 1వ తేదీన తలపెట్టిన ఏపీ బంద్‌కు ఏపీ వ్యవసాయ, రైతు సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ మేరకు బుధవారం అఖిల భారత కిసాన్‌సభ జాతీయ ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రామచంద్రయ్య, కేవీవీ ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జల్లి విల్సన్, ఆవుల శేఖర్ వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి రాగానే రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇస్తామని మోడీ ప్రకటించారని రైతు సంఘం నేతలు గుర్తుచేశారు. ఇచ్చిన హామీని అమలు చేయకుండా ఏపీకి తీరని ద్రోహం చేశారని దుయ్యబట్టారు. రైతులకు స్వామినాథన్ కమిషన్ ప్రకారం మద్దతు ధరలు కల్పిస్తామని, ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తామన్న వాగ్దానాలు అమలు చేయకపోవడం దుర్మార్గచర్యని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలను, రైతాంగాన్ని మోసగించిన మోడీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. హోదా 5 కోట్ల ఆంధ్రుల హక్కు అని స్పష్టం చేశారు. బంద్‌కు వ్యవసాయ కార్మికసంఘం సంపూర్ణ మద్దతిస్తుందని జల్లి విల్సన్, ఆవుల శేఖర్ తెలిపారు. ఈ బంద్‌లో వ్యవసాయ కూలీలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్తామని, బీజేపీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

విద్యార్థి, యువజన సంఘాల మద్దతు : పోస్టరు ఆవిష్కరణ

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధన కోసం ఫిబ్రవరి 1వ తేదీన జరుపతలపెట్టిన రాష్ట్ర బంద్‌కు విద్యార్థి, యువజన సంఘాలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. విజయవాడ దాసరిభవన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో బంద్‌కు సంబంధించిన పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రంగన్న, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అఫ్సర్ మాట్లాడుతూ పార్లమెంటు చివరి బడ్జెట్ సమావేశాలలో ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించి, విభజన హామీలను అమలు చేయాలని డిమాండు చేశారు. గత ఎన్నికల్లో ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని వాగ్దానం చేసిన బీజేపీ, టీడీపీ తీరా అధికారం చేపట్టాక మొండి చెయ్యి చూపి ప్రజలను మోసం చేశాయన్నారు. రాష్ట్రానికి హోదా వస్తేనే పరిశ్రమలు, విద్యాసంస్థలు వస్తాయని, తద్వారా నిరుద్యోగ సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఆఖరి పోరాటంగా ఫిబ్రవరి 1న చేపట్టే బంద్‌లో విద్యార్థి సంఘాలతోపాటు ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు. బంద్ సందర్భంగా విద్యా సంస్థల యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి చరణ్‌సాయి, ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి రాజా, పీడీఎస్‌యూ నగర కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ మద్దతు

విశాలాంధ్ర- అనంతపురం అర్బన్ : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం ఫిబ్రవరి1న నిర్వహించనున్న రాష్ట్ర బంద్‌కు ఏఐఎస్ఎఫ్ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం. సుబ్బారావు తెలిపారు. బుధవారం స్థానిక నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రత్యేక హోదా ఇస్తామని, విభజన హామీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కిన బీజేపీ, టీడీపీలు అధికారంలోకి వచ్చి నాలుగున్నర ఏళ్లు గడుస్తున్నా వాటిని అమలు చేయకుండా ఏపీకి తీరని అన్యాయం చేశాయన్నారు. మరలా ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రజలకు కొత్త హామీలు గుప్పిస్తూ మరోసారి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. ఫిబ్రవరి 1న నిర్వహించే బంద్‌లో అన్ని జిల్లాల్లో ఏఐఎస్ఎఫ్ శ్రేణులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. హోదా సాధన కోసం ఫిబ్రవరి 18న 'చలో పార్లమెంట్' కూడా నిర్వహిస్తునామన్నారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.జాన్సన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తులసి, మనోహర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కుళ్లాయిస్వామి, జిల్లా సహాయ కార్యదర్శులు రమణ, ఈరు, కోట్రేష్, చిరంజీవి, జిల్లా ఉపాధ్యక్షులు రాజేంద్ర, హనుమంతు, పేన్నోబిలేసు, చంద్రశేఖర్‌రెడ్డి,





సంపాదకీయం

లోక్‌పాల్‌పై మళ్లీ అన్నా దీక్ష

'అవినీతి అంతానికి కట్టుబడి ఉన్నట్లు అంత చెబుతున్నారు... వాస్తవంలో ఎవరూ ఏమీ చేయలేకపోతున్నారు.'-గతంలో దేశ అత్యున్నత న్యాయస్థానం చేసిన వ్యాఖ్య అది. నడుస్తున్న చరిత్రను గమనిస్తే అదెంత నిష్ఠుర సత్యమో బోధపడుతుంది. ఉన్న వ్యవస్థలనే నిర్వీర్యం చేస్తున్న మోడీ సర్కారు లోక్‌పాల్‌ను నియమించేందుకు ఎందుకు పూనుకుంటుంది? లోక్‌పాల్‌ను నియమించాలంటే పాలకులకు చాలా నైతికస్థైర్యం ఉండాలి. తమను ప్రశ్నించేవారినీ, నిలదీసే వారిని సహించలేని స్థాయికి బీజేపీ సర్కారు అప్రజా స్వామిక ధోరణులు పెరిగిపోయాయి. కాబట్టి తమ నిర్ణయాలను సమీక్షించ వారినీ, తీర్పరులను తమకు తాముగా సృష్టించడానికి మోడీ ప్రభుత్వం ఎందుకు సాహిస్తుంది? లోక్‌పాల్ కోసం అన్నాహజరే ఒక ప్రజా ఉద్యమాన్ని సృష్టించినప్పుడు అందరి కంటే ఎక్కువగా గొంతు చించుకున్నవారే కొద్దినెలల్లో ఐదేళ్ల పాలన పూర్తిచేసుకుంటూ కూడా లోక్‌పాల్ నియామకానికి పూనుకోలేదు. దీంతో మూడోసారి అన్నాహజరే బుధవారం తన స్వగ్రామమైన రాలేగాన్‌సిద్ధిలో నిరశన దీక్ష చేపట్టారు. భారత తొలి ప్రధాని పండిత నెహ్రూ నోట అవినీతికి అంకుశంలా లోక్‌పాల్ ప్రస్తావన వచ్చిన ఐదు దశాబ్దాలకు 2014 తొలి రేకువలో సంబంధిత బిల్లుపై రాష్ట్రపతి ఆమోదముద్ర పడింది. చట్టం వచ్చిందే తప్ప, దాని కోసం జనం ఎదురుచూపుల్లోనే యాభై ఏడు నెలలు కరిగిపోయాయి. అయితే ప్రశాంత భూషణ్ సుప్రీం తలుపుతట్టడం, సర్వోన్నత న్యాయపాలిక కూడా ప్రభుత్వం వెంటపడుతుండడంతో నత్త నడక కదలికైనా ఉంది. కొన్నాళ్లు విపక్ష నేత హోదా అడ్డంకిగా చూపిన మోడీ సర్కారు, కమిటీ సభ్యుడు సీనియర్ న్యాయవాది పీపీ రావు కన్నుమూతతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేయకపోవడాన్ని సాకుగా చూపింది. అంతకుముందు, లోక్‌పాల్‌ను అటకెక్కించేందుకు కేంద్రప్రభుత్వం నాన్చుడు ధోరణి కనబరుస్తోందంటూ 'కామన్‌కాజ్' అనే స్వచ్ఛంద సంస్థ దాఖలుచేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం సందర్భంగా 'సుప్రీం' వ్యాఖ్యలు- రాజ్యాంగ స్ఫూర్తికి పట్టంకట్టాయి. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, అత్యవసరాదేశం (ఆర్డినెన్స్) ద్వారానైనా లోక్‌పాల్ నియామక ప్రక్రియను పరుగులు పెట్టించగల వీలుందన్నట్లుగా 2017 మేలో సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. 2018 మార్చి నుంచి సర్వోన్నత న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వానికి అనేక అవకాశాలు ఇచ్చింది. అయినా సంకుచిత రాజకీయాలతో కాలయాపన చేయడం ప్రభుత్వ ప్రతిష్ఠనే పలుచబరుస్తోంది!

యూపీఏ పాలనలో అన్నాహజారే ఉద్యమం కాంగ్రెస్‌ను అవినీతిపుట్టగా ప్రజల మనస్సుల్లో ప్రతిష్ఠించడానికి ఎంతగా ఉపకరించిందో తెలిసిందే. ఆ ఉద్యమం కారణంగా బీజేపీ రాజకీయంగా ఎంతో లబ్ధిపొందింది.. మోడీ అధికారంలోకి రావడానికి వీలుపడింది. అవినీతిని దునుమాడుతాననీ, దేశానికి కాపలాదారుగా ఉంటానని హామీ ఇచ్చిన మోడీ తాను అధికారం లోకి వచ్చిన వెంటనే లోక్‌పాల్ నియామకాన్ని పూర్తిచేస్తానని కూడా ప్రజలకు ప్రమాణం చేశారు. కానీ, ఇప్పుడు అదే అన్నాహజారే తిరిగి నిరశన దీక్షకు దిగే అవకాశం మోడీనే కల్పించారు. పలు కుంభకోణాలు తెరమీదకు వచ్చి, బ్యాంకులను ముంచిన మాల్యాలు, నీరవ్‌లు విదేశాలకు చెక్కేసిన, రాఫెల్ కుంభకోణంలో స్వయంగా మోడీనే చిక్కుకున్న నేపథ్యంలో హజారే దీక్ష దేశవ్యాప్తంగా బీజేపీ అవినీతి పాలనను బోనులో నిలబెట్టే అవకాశం ఉంది.

వాస్తవానికి లోక్‌పాల్ అన్నది ఏ ప్రభుత్వాల దయాధర్మమూ కాదు. ఐదున్నర దశాబ్దాల కిందటే వెలుగుచూసిన లోక్‌పాల్ ప్రతిపాదన ఏకంగా ఎనిమిదిసార్లు పార్లమెంటులో బిల్లుగానే మురిగిపోవడానికి సర్వభ్రష్ట రాజకీయమే పుణ్యం కట్టుకొందనడంలో సందేహం లేదు. ప్రజాప్రతినిధులు, ప్రజాసేవకుల అవినీతిని అరికట్టేందుకు లోక్‌పాల్‌ను నియమించాలంటూ 1960లలో మొదలైన ఈ ఉద్యమం 2010లో ఊపందుకున్నది. అరుణారాయ్ నాయకత్వంలో ప్రజల హక్కుల కోసం జాతీయ ఉద్యమం(నేషనల్ కేంపేన్ ఫర్ పీపుల్స్ రైట్స్- ఎన్సీపీ ఆర్ఐ) జనలోక్‌పాల్ బిల్లు తయారీకి అరవింద్ కేజ్రీవాల్, ప్రశాంత్ భూషణ్, శేఖర్‌సింగ్‌లతో ఒక కమిటీని వేసింది. ఈ కమిటీ ఒక ముసాయిదా బిల్లును రూపొందించింది. దీని ఆధారంగానే 2011 జనవరిలో ఢిల్లీలోని రాంలీలా మైదానంలో పెద్ద బహిరంగ సభ జరిపారు. ఆ తర్వాత 2011 ఏప్రిల్‌లో అన్నాహజారే.. జంతర్‌మంతర్ వద్ద లోక్‌పాల్ చట్టం కోసం నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ఆయన దీక్షను విరమింపచేయడానికి లోక్‌పాల్ ఏర్పాటుపై పార్లమెంటులో హడావుడిగా తీర్మానం చేశారు. నాటకీయ పరిణామాల నేపథ్యంలో తన పరిశీలనకు వచ్చిన లోక్‌పాల్ బిల్లుకు పార్లమెంటరీ సెలక్ట్ కమిటీ 2012 డిసెంబరులో 16 సవరణలు ప్రతిపాదించింది. వాటిలో 14 సూచనలకు మన్మోహన్ సర్కారు తలొగ్గడంతో, చివరకు బీజేపీ సమ్మతించడంతో స్థూలంగా ఏకాభిప్రాయం సాధ్యపడింది. చివరికి 2013 డిసెంబరులో పార్లమెంటు ఆమోదించిన బిల్లులో రెండు అంశాలపై కొందరికి నిరాశ కలిగింది. లోక్‌పాల్ పరిధిలోకి సీబీఐ రాదని తేల్చారు. సెలక్షన్ కమిటీలో ప్రధాని, లోక్‌సభ స్పీకర్, ప్రధాన న్యాయమూర్తి, ప్రతిపక్ష నాయకుడూ, ఒక న్యాయకోవిదుడూ ఉంటారు. 2014 జనవరి ఒకటో తేదీన జీవో వచ్చింది. సార్వత్రిక ఎన్నికలకు ముందు నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్, సభాపతి మీరాకుమార్, ప్రతిపక్ష నేత సుష్మాస్వరాజ్, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దత్తు, న్యాయకోవిదుడు పిపి రావులు రెండు విడతలు సమావేశమైనారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత లోక్‌పాల్ ఊసే లేదు. సెలక్షన్ కమిటీ సమావేశమే జరగలేదు. కామన్‌కాజ్ అనే ఎన్జీవో తరపున ప్రశాంత్‌భూషణ్ సుప్రీం గడప తొక్కడంతో 2018 మార్చి ఒకటి నుంచి ఇంతవరకు ఆరుసార్లు జరిగాయి. పీపీరావు స్థానంలో ముకుల్ రోహట్గీని న్యాయకోవిదుడుగా కమిటీలోకి తీసుకున్నారు. ఈ క్రమంలో లోక్‌పాల్‌ను ఎంపిక చేసేందుకు సెలక్షన్ కమిటీకి ఫిబ్రవరి ఆఖరులోగా పేర్ల జాబితా సమర్పించాలని సెర్చ్ కమిటీ అధ్యక్షుడు జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్‌ని సుప్రీంకోర్టు గురువారంనాడు ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం ఉదాసీనత కారణంగా లోక్‌పాల్ చట్టం ఐదేళ్లుగా నిష్ఫలంగా ఉండడం విషాదం. మోడీ ఎన్నికల ప్రచారంలో చేసిన బాసలు కపట రాజకీయంలో భాగమే అని తేలిపోయింది. గుజరాత్ ముఖ్యమంత్రిగా పని చేసిన 12 సంవత్సరాలలో కూడా మోడీ లోకాయుక్తను నియమించలేదు. అవినీతిని అరికట్టే ఆలోచనే లేని ప్రధాని లోక్‌పాల్ వ్యవస్థకు ప్రాణప్రతిష్ఠ చేయకుండా కుంటిసాకులతో రోజులు నెట్టుకురావడం ఆశ్చర్యం ఏముంది!?

చురక

ప్రజాకర్ష పథకాలతో
పార్టీల ఓట్ల వల
గెలిచినంక తెలుస్తుంది
కార్యదీక్షలేని కళ

గతహామీలమలు లేక
గాడి తప్పే ప్రభుత్వం
నీటి బుడగలాగ మిగిలే
నిజాయితీ నికరత్వం

- వేల్పుల నారాయణ

విశ్లేషణ

బ్రెగ్జిట్‌తో భారత్‌కు అవకాశాల వెల్లువ

సుబ్రతా మజుందార్

బ్రెగ్జిట్ అనేది బ్రిటన్‌కు పెద్దసవాల్ అని భారతదేశానికి సదవకాశమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. యూరోపియన్ దేశాలన్నింటి ప్రమేయం లేకుండా రెండు దేశాల మధ్య ఆర్థిక ఒప్పందాలకు మార్గం సుగమమవుతుందని, తద్వారా బ్రిటన్‌తో భారతదేశ ఆర్థిక సంబంధాలలో క్రియాశీలత ఏర్పడుతుందని విశ్లేషకులు అంటున్నారు. అసలు బ్రెగ్జిట్ అంటే ఏమిటి? యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి బ్రిటన్ నిష్క్రమణే బ్రెగ్జిట్ (బ్రిటన్ ఎగ్జిట్). బ్రెగ్జిట్ ఆమోదం పొందితే పొరుగు యూరోపియన్ దేశాల నుంచి బ్రిటన్‌లోకి వలసలు తగ్గుతాయి. ఈ నేపథ్యంలో బ్రెగ్జిట్‌పై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. రెండేళ్ల తర్జనభర్జన తర్వాత మార్చి 29న బెగ్జిట్‌కు తెరపడే అవకాశముంది. అదే జరిగితే బ్రిటన్ సార్వభౌమత్వానికి కొత్త ఆరంభం లభిస్తుంది. భారత్, బ్రిటన్ ఆర్థిక సంబంధాల్లో క్రియాశీలత కనిపిస్తుంది. బ్రిటన్ నూతన సింగిల్ మార్కెట్‌గా ఆవిర్భవిస్తుంది. కొత్త ఆర్థిక భాగస్వామిగా భారత్‌ను పరిగణించే అవకాశముంటుంది.

ఈయూలో ఉన్నప్పుడే భారత్-ఈయూ సంబంధాలలో బ్రిటన్ కీలక పాత్రను పోషించింది. ఆర్థిక సంబంధాన్ని మెరుగుపర్చేందుకు ప్రధాన కార్యాచరణ భాగస్వామిగా వ్యవహ రించింది. ఉదాహరణకు, సభ్యదేశాల్లో భారత్‌కు అతిపెద్ద ఎగుమతి గమ్యంగా బ్రిటన్ ఉంది. ఈయూ, యూకేతో అనుకూలమైన వాణిజ్య సమతుల్యతను భారత్ కలిగి ఉంది. ఈ క్రమంలో యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ నిష్క్రమణ ప్రభావం భారత్-యూకే సంబంధాలు, భారత్- ఈయూ సంబంధాలపై తప్పక ఉంటుంది.

భారత్-యూరోపియన్ యూనియన్ సంబంధాల్లో బ్రిటన్ కీలక పాత్రను పోషించిన విషయాన్ని అటుంచితే 'బ్రెగ్జిట్' పర్యవసనాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవ ుతున్నాయి. కొత్త ఆర్థిక భాగస్వాములకు బ్రిటన్ అవకాశమిస్తుందని ఓ వర్గం వాదించగా సింగిల్ మార్కెట్ ఆవిర్భవించే క్రమంలో చిక్కులు తప్పబోవని మరో వర్గం అభిప్రాయపడుతోంది. ఈ నేపథ్యంలో భారత్-ఈయూ వాణిజ్య సంబంధాలకు నష్టం వాటిల్లుతుందని, భారతదేశ మొత్తం ఎగుమతుల్లో యూకేతో సహా ఈయూకు జరుగుతున్న 1/5వ వంతు ఎగుమతులపై దీని ప్రభావం పడుతుందని పలువురు జోస్యం చెబుతున్నారు. అయితే స్వతంత్ర బ్రిటన్ దౌత్యపరంగా భారత్‌తో వాణిజ్య సంబంధాలను పటిష్ఠవంతం చేసుకుంటుందని, దాంతో ఎగుమతులు పుంజుకుంటాయని ఆశావాదులు చెబుతున్నారు. ఈయూ ఎగుమతిదారులకు టారిఫ్ ప్రయోజనాలు తగ్గే క్రమం లో భారత్‌కు భారీగా అవకాశాలు లభిస్తాయని అంటున్నారు.

దాదాపు ఒకటిన్నర దశాబ్దంగా బ్రిటన్-ఈయూ సంబంధాలు ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నాయి. బ్రెగ్జిట్‌తో భారత్‌కు కలిసివస్తుందన్న వాదన బలపడుతోంది. బ్రిటన్‌లో అత్యధిక శాతం ఎగుమతులు, దిగుమతులలో ఈయూ వాటాయే ఎక్కువ. కాని ఇప్పుడు సంబంధాలు క్షీణించాయి. 2002లో బ్రిటన్‌కు 55శాతం ఎగుమతులు, 58శాతం దిగుమతులు ఈయూ వాటాగా ఉండగా, 2014లో 51శాతానికి, 2016లో 43శాతానికి పడిపోయాయి.

బ్రెగ్జిట్ కారణంగా వాణిజ్యపరంగా ప్రత్యామ్నాయ మార్కెట్‌గా భారత్‌ను బ్రిటన్ ఎంచుకునే అవకాశముంది. ప్రపంచంలో ఆర్థిక సంక్షోభం, చైనా ఆంక్షలతో బ్రిటన్‌కు పెద్దమార్కెట్‌గా భారత్ ఉండనుంది. బ్రిటన్-భారత్ మధ్య కొంత ప్రతికూలత ఉన్నప్పటికీ బ్రెగ్జిట్ నేపథ్యంలో భారత్‌లో వాణిజ్యపరంగా కొత్త అవకాశాలకు బ్రిటన్ ద్వారాలు తెరవనుంది.

ఫార్మాస్యూటికల్ ఎగుమతులు ఇక్కడ కీలకం. ఈయూ నుంచి బ్రిటన్‌కు జరిగే రెండో అతిపెద్ద సరుకు ఎగుమతి ఔషధాలు. 2017లో బ్రిటన్‌కు జరిగిన మొత్తం ఎగుమతుల్లో దీని వాటా 7.9శాతంగా ఉంది. 26 బిలియన్ డాలర్ల (2,600కోట్ల డాలర్లు) విలువచేసే మందుల ఎగుమతి జరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. వార్షిక ఎగుమతులు 532 మిలియన్ డాలర్లుగా ఉంది. టారిఫ్ ఆంక్షల కారణంగా ఈయూ నుంచి దిగుమతి చేసుకోవడం మరింత ప్రియం కానుండటంతో భారతీయ ఎగుమతిదారులకు బ్రెగ్జిట్ అవకాశాలు ఇవ్వనుంది.

విదేశీ పెట్టుబడులకు కీలకగమ్యంగా బ్రిటన్ ఉంది. విదేశీ పెట్టుబడులను ఆకర్షించే ప్రపంచంలోనే మూడవ దేశంగా 2017లో బ్రిటన్ నిలవగా, ఆ దేశంలో పెట్టుబడులు పెట్టే జాబితాలో భారత్ టాప్ 3లో ఉంది. బ్రిటన్‌లో 800 భారతీయ కంపెనీలు ఉన్నాయి. మిగతా 27 ఈయూ సభ్య దేశాలతో పోల్చి చూస్తే బ్రిటన్‌లోనే భారతీయ కంపెనీలు ఎక్కువగా ఉన్నాయి. ఈయూ నుంచి బ్రిటన్ నిష్క్రమణ నేపథ్యంలో ఈయూ మార్కెట్‌పై ఆంక్షలు కఠినతరమవ్వనుండటం భారత పెట్టుబడులకు కొంత నష్టం జరగవచ్చునన్న అంచనాలూ ఉన్నాయి.

బ్రెగ్జిట్ కారణంగా బ్రిటన్‌కు వెళ్లే భారతీయుల సంఖ్య పెరిగే అవకాశముంది. ఈయూ నిబంధనల ప్రకారం ఈయూ యేతరులకన్నా ఈయూ ఉద్యోగులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. అయితే ఈయూ నుంచి బ్రిటన్ బయటకు వచ్చేస్తే ఆయా నిబంధనలు వర్తించవు. తద్వారా భారత్ నుంచి బ్రిటన్‌కు వెళ్లే వారి సంఖ్య పెరుగుతుంది. ఈయూ దేశాల్లో నిపుణుల కొరత ఉంటేనే ఇతర దేశాలకు చెందిన వారికి అవకాశమివ్వాలన్న నిబంధనలు ఈయూలో ఉన్నాయి. ఈ నిబంధన కారణంగా బ్రిటన్‌లో వైద్యులు, నర్సులు, ఐటీ ఉద్యోగులు, పరిశోధకుల కొరత ఏర్పడినప్పుడు భారత్ నుంచి ఆయా వృత్తిదారులు అక్కడకు వెళ్లే అవకాశాలు లేకపోయాయి. బ్రెగ్జిట్ వల్ల ఆ నిబంధనల నుంచి బ్రిటన్‌కు విముక్తి లభిస్తుంది. తద్వారా భారత్‌కు లబ్ధి చేకూరుతుంది. అంతేకాకుండా భారత్, బ్రిటన్ దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యానికి మార్గం సుగమమవుతుంది. దీర్ఘకాలంగా జరుగుతున్న చర్చలకు తెరదించి భారత్-యూకే ఎఫ్‌టీఏ ముందుకు సాగుతుంది.

ఇప్పటివరకు వాణిజ్యం కోసం ఈయూపై దాదాపుగా ఆధారపడిన బ్రిటన్.. 'బ్రెగ్జిట్'తో వాణిజ్యపరంగా పెనుసవాల్‌ను ఎదుర్కొవాల్సి ఉంటుంది. యూకే ఎగుమతుల్లో సగానికిపైగా ఈయూ నేపథ్యంలోనే సాగుతున్నాయి. 2017లో యూకే సరకు రవాణాలో 48శాతం, సర్వీస్ ఎగుమతుల్లో 40శాతం ఈయూ పరిధిలోనే జరిగాయి. అదే విధంగా యూకే దిగుమతుల్లోనూ ఈయూది కీలక పాత్ర. 2017లో యూకేకు 54 శాతం సరకులు, 49 శాతం సర్వీసుల దిగుమతులు ఈయూ పరిధిలో జరిగాయి.

యూకే నుంచి ఈయూకు 1/3వ వంతు ఉన్న మోటార్ వాహనాలు, పెట్రోలియం ఉత్పత్తులు, ఫార్మాస్యూటికల్స్ ఉత్పత్తుల ఎగుమతుల విషయంలో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈయూ నుంచి నిష్క్రమణ తర్వాత ఆయా పరిశ్రమలు మనుగడ కోసం పెను సవాళ్లను ఎదుర్కోక తప్పదు. నష్టాలను భర్తీ చేసే విధంగా ప్రత్యామ్నాయ మార్కెట్లు తెరపైకి వచ్చేంత వరకు సంక్షోభం తప్పబోదు. ఆయా పరిశ్రమలకు ఎఫ్‌టీఏ ప్రధానంగా ఉపకరించవచ్చు.

బ్రెగ్జిట్ కారణంగా ఆటోమొబైల్ రంగంపై తీవ్ర ప్రభావం ఏర్పడే అవకాశముంది. 2017లో ఈ రంగంలో 18శాతం ఎగుమతులు ఈయూ దేశాలకు జరిగాయి. అదే క్రమంలో బహుళజాతి కంపెనీలు (ఎంఎన్‌సీ) కూడా చిక్కుల్లో పడటం ఖాయం. వేర్వేరు ఆంక్షలు, నిబంధనలు అమల్లోకి వస్తాయి. వలసలకు సంబంధించిన నిబంధనల ప్రకారం అంతర్గతంగా సిబ్బంది బదిలీలు జరగవచ్చు.

ఈ నేపథ్యంలో బ్రెగ్జిట్ అనేది ఆశ.. నిరాశ మధ్య ఊగిసలాడుతుంది. వ్యూహాత్మక ఆర్థిక భాగస్వామ్యం ఏర్పాటు చేసుకోవడం ద్వారా బ్రిటన్‌ను సంక్షోభంలో నుంచి బయటకు తీసుకురావడంలో భారత్ కీలక పాత్ర పోషించనుంది. ఇరు దేశాల మధ్య చారిత్రక సంబంధాలు, వృద్ధిలో భారత్ దూకుడు ఇందుకు దోహదపడతాయి.

రైతును నట్టేట ముంచిన భూసేకరణ చట్ట సవరణలు



రావుల వెంకయ్య

ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం రైతుల్ని, వ్యవసాయ కూలీలను నట్టేట ముంచడానికి 2013 భూసేకరణ చట్టానికి సవరణలు తెస్తూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించింది. దీనివలన రైతు లకు, కౌలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు, గ్రామీణ చేతివృత్తి దారులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఏర్పడింది. అలాగే ఆహార భద్రతకు పెనుముప్పు ఏర్పడుతుంది. బలవంతపు భూసేకరణకి నాందీవాచకం పలుకుతుంది. అసెంబ్లీలో ఏకపక్షంగా బిల్లు ఆమోదింప జేసుకుంది. తెలుగుదేశం, భార తీయ జనతాపార్టీ సభ్యులు ఎలాగూ బలపరుస్తారు. వైసీపీ నుండి ప్లేటు ఫిరాయించిన శాసనసభ్యులు కూడా జైకొట్టారు. వైఎస్ఆర్ పార్టీ అసెంబ్లీని బహిష్కరించి పలాయనం చిత్తగించింది. నిలదీయాల్సిన ప్రధాన ప్రతిపక్షం బాధ్యతా రహితంగా వ్యవహరించింది. ఎందుకంటే వారు కూడా బలవంతపు భూసేకరణకు అనుకూలం కాబట్టి. రాజ శేఖరరెడ్డి ప్రభుత్వంలో వేలాది ఎకరాలు అత్తసొమ్ము అల్లుడికి దానం చేసినట్టు పారిశ్రామికవేత్తలకు ఫలహారంగా పంచిపెట్టడం జరిగింది. జగన్మోహన్‌రెడ్డి కూడా రేపు అధికారంలోకి వస్తే అదే బాటను పడతారు. కాబట్టి పరోక్షంగా ఈ బిల్లుకి వైఎస్ఆర్ పార్టీ కూడా మద్దతు పలికినట్లే. దురదృష్టం రైతు కూలీల పక్షాన నిఖార్సుగా నిలబడి పోరాడే వామపక్షాలకు శాసనసభలో ప్రాతినిధ్యం లేకుండా పోవటం దురదృష్టం.

భూసేకరణ చట్టం బ్రిటీష్‌వారి కాలంలో వారి అవసరాల కోసం 1894లో తీసుకురాబడింది. నాటినుండి ఈ చట్టం 120 సంవత్సరాలు కొనసాగింది. బ్రిటీష్ వాళ్లకాలంలోనే కాకుండా స్వతంత్ర భారతదేశంలో అనేక సంవత్సరాలు కొనసాగించబడింది. దానిమీద అనేక రైతుసంఘాలు ఉద్యమాలు చేసిన పిదప నాటి యుపిఏ ప్రభుత్వం 2013లో కొన్ని మంచి సవరణలతో చట్టం తీసుకువచ్చింది. దాన్ని అన్ని పార్టీలు, రైతు సంఘాలు బలపర్చాయి. నేటి అధికార పార్టీ నాడు ప్రతిపక్షంలో వుండి మేం కూడా బలపరుస్తామని మద్దతు తెలియజేశారు. అప్పుడు ఈ బిల్లు ఏకగ్రీవంగా పార్లమెంటులో ఆమోదం పొందింది. దాని ఫలితంగా పారిశ్రామికవేత్తలు గగ్గోలు పెట్టడం మొదలుపెట్టారు.

ఆ చట్టంలో బహుళపంటలు పండే సారవంతమైన భూములు తీసుకోరాదని ఒకవేళ అనివార్యంగా తీసుకోవలసివస్తే అదే స్థాయిలో వేరే భూమిని అభివృద్ధిచేసి ఆహార భద్రతకు భంగం కలగకుండా చూడాలని షరతు విధించడం జరిగింది. అలాగే ప్రభుత్వ అవసరాలకు 70 శాతం, ప్రైవేటు అవసరాలకు 80 శాతం రైతుల ఆమోదంతో మాత్రమే భూములు తీసుకోవాలని నిర్ణయించడమైంది. నష్టపరిహారం మార్కెట్ విలువకు 4 రెట్లు ఉండాలని తీర్మానించారు. సకాలంలో చెల్లించకపోతే వడ్డీతో సహా ఇవ్వాలని నిర్ణయిం చారు. ఏ అవసరాలకోసమైతే భూమిని రైతుల వద్ద తీసుకుం టున్నారో ఆ భూమిని 5 సంవత్సరాల్లో ఉపయోగంలోకి తీసుకురాకపోతే రైతుకే తిరిగి భూమి ఇవ్వాలనే షరతు విధించారు. గ్రామసభలో సామాజిక సర్వేని అమలు జరపాలని కోరారు. భూమిమీద ఆధారపడిన కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ చేతివృత్తిదారులు, చిన్న వ్యాపారస్తులకు కూడా నష్టపరిహారం చెల్లించి ఉపాధి కల్పించాలని నిర్ధారించారు.

2013 చట్టాన్ని నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన వెంటనే పారిశ్రామికవేత్తల సలహాలననుసరించి ఈ చట్టానికి సవరణలు చేస్తూ 2014లో ఆర్డినెన్స్ జారీ చేశారు. రాజ్యసభలో తగినంత మెజార్టీ అధికారపార్టీకి లేనందువలన ఈ ఆర్డినెన్స్‌ను రాష్ట్రపతి ఆమోదానికి పంపారు. ఈ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా దేశవ్యాపితంగా రైతు సంఘాలు పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించాయి. 21 రాజకీయ పార్టీలు ఈ పోరాటాలకు మద్దతు పలికాయి. దాని ఫలితంగా రాష్ట్రపతి ఆమోదానికి 3 సార్లు పంపారు. ఈ ఆర్డినెన్స్‌కు ఆమోదముద్ర వేయకుండా తిరస్కరించడం జరిగింది. ఈ సవరణ ఆర్డినెన్స్‌కి 29 రాష్ట్రాల్లో మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందువరుసలో అనుకూలంగా ఉన్నారు. విధిలేని పరిస్థితుల్లో ప్రధాని నరేంద్ర మోడీ కేంద్రంలో చట్టసవరణలకు వీలులేకుండా పోయింది కాబట్టి ఎవరికిష్టమైన పద్ధతుల్లో వారు రాష్ట్రాల్లో చట్టాలు చేసుకోమని సూచనలు, సలహాలు ఇచ్చారు. దాన్ననుసరించి బీజేపీ పాలిత రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్‌లు కొత్త చట్టాలు తీసుకువచ్చాయి. అలాగే ఉభయ తెలుగురాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కూడా ఆ బాటలోనే ప్రయాణించాయి. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఆగ మేఘాలమీద 'ఆంధ్రప్రదేశ్ భూసేకరణ బిల్లు' తీసుకొచ్చింది. అంతకుముందు 2013 భూసేకరణ చట్టం ప్రకారం కొంత భూమిని భూసమీకరణ పేరుతో రాజధాని, గన్నవరం, మచిలీపట్నం పోర్టులకు భూములు తీసుకొన్నారు. 13 జిల్లాల్లో 15 లక్షల ఎకరాలు 'భూబ్యాంకుల' పేరుతో భూమిని సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే 8 లక్షల ఎకరాల భూమి తీసుకొన్నారు. ఇంకా 7 లక్షల ఎకరాలకు రంగం సిద్ధం చేశారు. ఈరకంగా తీసుకున్న భూమిని విదేశీ కంపెనీలకు, పారిశ్రామికవేత్తలకి కట్టబెట్టడానికి సన్నాహాలు, చర్చలు పూర్తిచేశారు. ఒక్కమాటలో చెప్పాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ అధినేతగా కాకుండా రియల్ ఎస్టేట్ ఏజెంట్ పాత్రని నిర్వహిస్తున్నారు. ఈ చట్టం ప్రకారం 2013 భూసేకరణ చట్టంలోని అన్ని విషయాలను గాలికి వదిలివేశారు. తనకు ఇష్టంవస్తే ఎక్కడైనా, ఎవరిదైనా బలవంతంగా భూమిని తీసుకోవటానికి చట్టంలో గ్యారంటీ ఏర్పడింది. మధ్యవర్తిగా జిల్లా కలెక్టర్లకి సర్వాధికారాలు కట్టబెట్టారు. గ్రామ సభలు అవసరం లేదు. బహుళపంటలు పండే భూమి అనే షరతు రద్దుచేయబడింది. సామాజిక సర్వే ప్రకారం తీసుకోవలసిన అవసరం లేదు. రైతులతో నేరుగా మాట్లాడి కలెక్టర్ ముగ్గురు మధ్యవర్తుల కమిటీతో ఒప్పందం చేసుకుంటారు. దానిమీద అవార్డు జారీ చేయబడుతుంది. ఆ ఒప్పందంమీద ఒకసారి అంగీకరిస్తూ రైతు కూలీలు సంతకం పెడితే కోర్టుకి వెళ్లే హక్కు కూడా ఉండదు. దీనిమీద గత నవంబర్ 13వ తేదీన జి.ఒ.నెం.562 జారీ చేశారు. ఇంత దుర్మార్గమైన చట్టం చేయడం ద్వారా రైతులవద్ద బలవంతపు భూసేకరణకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇది రైతులపాలిటీ నష్టదాయకమైనది. ఒకప్పుడు భూమికోసం, భుక్తికోసం దున్నేవాడికే భూమి కావాలనే పోరాటాలు చేసిన వామపక్షాలు, రైతు కూలీ సంఘాలు మరోసారి భూమిని కాపాడుకోవడానికి సమరశీల పోరాటాలకు సిద్ధం కావలసిన అవసరం ఎంతైనా ఉంది.

వ్యాస రచయిత : ఏఐకేఎస్ ఉపాధ్యక్షులు

సంస్మరణ

ఆదర్శ కార్మిక నేత కామ్రేడ్ సుబ్బన్న

పులి కృష్ణమూర్తి

కార్మిక ఉద్యమ నిర్మాత కామ్రేడ్ కె.సుబ్బన్న మృతి చెంది నేటికి 12 సంవత్సరాలు. 1930లో జన్మించిన కామ్రేడ్ కె.సుబ్బన్న కమ్యూనిస్టు ఉద్యమంలో కామ్రేడ్స్ పంజం నరసింహ్మారెడ్డి, వైవీ కృష్ణారావు, గజ్జల మల్లారెడ్డి, ఎన్.శివరామిరెడ్డి, కె.వెంకట్రామిరెడ్డి, టి.లక్ష్మినారాయణ, జి.ఓబులేసు మున్నగు జిల్లా కార్యదర్శుల సహచర, నూతన నాయకత్వంతో పనిచేశారు. గాలేరు నగరి ప్రాజెక్టు అంత ర్భాగంలోని గండికోట ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయకపోతే తన సహచర నాయకత్వంతో కలిసి కడప కలెక్టరేట్ కార్యాలయం ఎదుట వయస్సు పైబడిన, అనారోగ్యంతో ఉన్న కామ్రేడ్ కె.సుబ్బన్న కూడా ఆమరణ దీక్షలో పాల్గొంటానని ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చిన బృందంలో వున్నారు. కామ్రేడ్ కె.సుబ్బన్న సొంత జిల్లా నెల్లూరు. జీవనోపాధి కోసం ఆ జిల్లా నుంచి కడప జిల్లాకు వలస వచ్చి ఆలం ఖాన్‌పల్లిలో స్థిర నివాసం ఏర్పాటు చేసు కున్నారు. చిన్న వయస్సులో తల్లిదండ్రులతో వలస వచ్చిన కామ్రేడ్ కె.సుబ్బన్న స్థానిక గ్రామంలో కామ్రేడ్ నంద్యాల వరదారెడ్డి, నంద్యాల నాగిరెడ్డి, చెంచు రామయ్యల ద్వారా పార్టీ పట్ల ఆకర్షితులయ్యారు. 13 సంవత్సరాల వయస్సులోనే 7వ తరగతి పరీక్షలు రాసి 1945లో పుల్లంపేట మండలం లోని రామక్క పల్లిలో జరిగిన పార్టీ రాజకీయ పాఠశాలకు హాజరయ్యారు. అక్కడ బోధించేందుకు వచ్చిన రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ నిర్మాతలైన పుచ్చలపల్లి సుందరయ్య, ముక్కామల నాగభూషణంలను చూసే అవకాశం ఆ వయస్సులోనే ఆయనకు దక్కింది.



కామ్రేడ్ కేవీస్ 1955-60 వరకు కడప తాలూక పార్టీ కార్యదర్శిగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. వెట్టిచాకిరి, రెండు గ్లాసుల అంటరాని తనానికి వ్యతిరేకంగా, ఇళ్ళ స్థలాలకు, సాగుభూములకై అనేక పోరాటాలు చేశారు. చింతకొమ్మదిన్నెలో ఉండే ఆయన అక్క కూతురు శాంతమ్మను పెళ్లి చేసుకున్నాడు. ఆమె కూడా పార్టీ సభ్యురాలై భర్త అడుగు జాడల్లోనే నడిచింది. ఆ దంపతులకు కుమారుడు కె.భరత్, ఆపై కుమార్తె కె.సమత, రెండవ కుమారుడు కె.అజయ్‌లు జన్మించారు. పిల్లలు కూడా పార్టీ, ప్రజా సంఘాల సభలకు, సమావేశాలకు, ఊరేగింపులకు వెళ్లేవారు.

కామ్రేడ్ కె.సుబ్బన్న కడప జిల్లా ఎఐటీయుసి బాధ్యతలు తీసుకుని పనిచేసే ముందు కడప నగరంలో జట్కాబండ్ల సంఘం, మోటారు వర్కర్స్ వంటి సంఘాలను కామ్రేడ్ జె.వెంకట్రామి రెడ్డి, డి.బాలిరెడ్డి వంటి ఇతర కామ్రేడ్‌లతో పాటు పర్యవేక్షించే వారు. కామ్రేడ్ కెవిస్ ఆర్‌టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కడప రీజనల్ ఛైర్మెన్‌గా సుదీర్ఘ కాలం పాటు పనిచేశారు. కడపలో రిక్షా వర్కర్స్, టైలర్స్, జ్యోతికెమికల్స్, లంకా కేబుల్, అరాక్ (సారా) బాట్లింగ్ వర్కర్స్, చిన్న వ్యాపారస్తుల సంఘం, జిల్లా మైనింగ్ వర్కర్స్ వంటి వాటికి గౌరవాధ్యక్షులుగా, అధ్యక్షులుగా ఉండి పనిచేశారు. 1994లో చెన్నూరు షుగర్ ఫ్యాక్టరీలో షుగర్ అండ్ స్టాఫ్ వర్కర్ యూనియన్ ఏర్పాటు చేయించి తాను గౌరవాధ్యక్షులుగా ఉండి కామ్రేడ్ నరసింహ్మారెడ్డి, పెంచల్ రెడ్డి, రాజేంద్ర ప్రసాద్‌ల వంటి వారితో కలిసి కార్మికుల వేజ్‌బోర్డ్, అరియర్స్ లాంటి డిమాండ్లపై పోరాటాలు చేశారు. కడపలో ప్రైవేటు బస్సు ఆపరేటర్స్‌కు వ్యతిరేకంగా ఎఐటియుసి ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమంలో ఆనాటి బ్రేక్ ఇన్‌స్పెక్టర్ బస్సు ఆపరేటర్లకు అండగా నిలబడి ఉద్యమాన్ని నీరుగార్చడానికి ప్రయ త్నించినప్పుడు, రివాల్వర్‌తో కాల్పులు జరుపుతానని బెదిరించిన సందర్భంలో దానిని అడ్డుకుని ఆ పోరాటంలో ఆయన రివాల్వ ర్‌ను లాక్కున్నారు. పోలీసులు కామ్రేడ్స్‌ను రివాల్వర్ కోసం వేధించగా కామ్రేడ్ కేవిస్ నేరుగా ఎస్పీ వద్దకు వెళ్లి రివాల్వర్ నా దగ్గర ఉంది, రెండు రోజుల్లో నేను తెచ్చి ఇస్తాను, మా కామ్రేడ్స్ ను ఇబ్బంది పెట్టవద్దని గట్టిగా చెప్పిరావడంతో పోలీసుల ఒత్తిడి తగ్గింది. కడప తరువాత ప్రొద్దుటూరులో బలమైన ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని కామ్రేడ్ కేవిస్ నిర్మించారు. మంగంపేట బెరైటీస్‌లో ఏపీయండీసీ ఎంప్లాయిస్‌లో, స్థానికంగా ఉన్న సోప్ ఫ్యాక్టరీలోనూ, ఫ్రూట్ నర్సరీలో పనిచేసే వర్కర్స్‌కు యూనియన్‌లను ఏర్పాటు చేసి కామ్రేడ్ కేవిస్ గౌరవాధ్యక్షులుగా పనిచేశారు. ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులుగానూ విశేష సేవలందించారు. 1955లో జరిగిన ఎన్నికలలో ఉమ్మడి నియోజకవర్గంగా ఉన్న రాజంపేటకు ఎమ్మెల్యేగా పోటీ చేయమని కామ్రేడ్ కేవిస్‌ను ఎన్నికల బరిలో జిల్లా పార్టీ నిలబెట్టింది. 1983లో రైల్వే కోడూరు ఎమ్మెల్యే స్థానానికి, కడప మండలాధ్యక్ష పదవికి, ఆలంఖాన్‌పల్లె సర్పంచ్ పదవికి వివిధ సందర్భాలలో పోటీ చేసి ఓటమిని ఎదుర్కొన్నారు. ఓటమిని చిరునవ్వుతో స్వీకరించే గొప్ప మనస్తత్వం ఆయన సొంతమని చెప్పొచ్చు. సోవియట్ యూనియన్‌లో కమ్యూనిస్టు పార్టీ అధికారంలో ఉన్న నేపథ్యంలో ఆరు నెలల పాటు పర్యటించారు. అక్కడ నుంచి వచ్చాక జిల్లాలో జరిగే పార్టీ ప్రజా సంఘాల తరగతులలో కామ్రేడ్ కేవిస్ పెట్టుబడిదారీ విధానం, సోషలిస్టు విధానం గురించి బోధించారు. ఆయన చిన్న కుమారుడు కామ్రేడ్ అజయ్ కుమార్‌ను (ఎఐఎస్ఎఫ్‌లో పనిచేస్తున్న) ఉన్నత విద్యను అభ్యసించేందుకు మాస్కోకు జిల్లా పార్టీ పంపించింది. ప్రజానాట్య మండలిలో పనిచేస్తున్న ప్రొద్దుటూరుకు చెందిన కామ్రేడ్ నిజాం తన కుమార్తె సమతను ప్రేమిస్తున్న విషయాన్ని తెలుసుకున్న కేవిస్ కులాలకు అతీతంగా వారిరువురికీ వివాహం చేశారు. 1964లో పార్టీలో చీలిక వచ్చిన సందర్భంలో కామ్రేడ్ కేవిస్ సీపీఐలోనే గట్టిగా నిలబడి కొనసాగారు.

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులుగా, జిల్లా కార్యవర్గ సభ్యులుగా అనేక సంవత్సరాలు కామ్రేడ్ కేవిస్ పనిచేశారు. ఎన్నో ఆటు పోట్లు వచ్చినా వారి కుటుంబం ఆయనకు అండగా నిలబడేది. వివిధ సందర్భాలలో పార్టీ జిల్లా కమిటీతో పాటు ఆయన పనిచేసిన పలు ప్రాంతాల కార్మిక యూనియన్‌లు, వాటికున్న శక్తి మేరకు సహకారం అందించి కామ్రేడ్ కేవిస్‌కు అండగా నిలిచారు. ఆప్యాయతకు, అనురాగానికి మారుపేరుగా నిలబడి తుది శ్వాసవరకు ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపిన నిరాడంబరుడైన కామ్రేడ్ కేవిస్ లక్ష్య సాధన కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించి ఉరకలెత్తే ఉత్సాహంతో పోరాటాలు నిర్వహించినప్పుడే ఆ అమరుడికి మనమందించే నిజమైన నివాళి.

వ్యాస రచయిత : సీపీఐ కడప జిల్లా మాజీ కార్యదర్శి

ఈ-మెయిల్

సప్రమాణత, విశ్వసనీయత లేని డీఎస్సీ పరీక్షలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆన్‌లైన్లో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ నియామక (డీఎస్సీ) పరీక్షలు నిరుద్యోగులకు తీవ్ర నిరాశను కలిగిస్తున్నాయి . దాదాపు సంవత్సర కాలంగా నిరుద్యోగులను ఊరించిన డీఎస్సీ ప్రకటన అభ్యర్థులకు ఆశలు కల్పించింది . అయితే ఈ నెల 18 నుండి ప్రారంభమైన డీఎస్సీ (ఎస్జీటీ) ఆన్ లైన్ పరీక్షలు ఉపాధ్యాయ అభ్యర్థులకు చుక్కలు చూపిస్తు న్నాయి. ఇప్పటి వరకూ జరిగిన ఎస్జీటీ పరీక్షల్లో ప్రశ్నాపత్రాలు రోజుకో రకంగా ఉన్నాయి. విశ్వస నీయత, సప్రమాణత పాటించకుండా రూపొందించిన ప్రశ్నాపత్రాలతో జరుపుతున్న ఈ డీఎస్సీ పరీక్షలు అభ్యర్థుల తలరాతలను మార్చేస్తున్నాయి. సులభంగా ప్రశ్నాపత్రం ఇచ్చిన రోజుల్లో పరీక్షలు రాసిన అభ్యర్థులేమో ఎక్కువ మార్కులు పొందుతుంటే, ప్రశ్నాపత్రం కఠినంగా ఇచ్చిన రోజుల్లో పరీక్షలు రాసిన నిరుద్యోగులు అత్తెసరు మార్కులు పొందుతున్నారు. దీంతో అభ్యర్థులంతా ఇవేం డీఎస్సీ పరీక్షలంటూ తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారు. ముఖ్యంగా నెల్లూరు, చిత్తూ రు, కడప తదితర జిల్లాలలో 40 లోపే ఎస్జీటీ నియామకాలు చేపడుతుండటంతో కొన్ని కులాల వారికి రిజర్వేషన్ కేటగిరీలో ఒక్క పోస్టు కూడా లేకుండా పోయింది. ఓపెన్ కేటగిరీలో ఉన్న పదిలోపు ఉద్యోగాలనూ ప్రశ్నాపత్రం సులభంగా ఉన్న రోజుల్లో పరీక్ష రాసిన వారు మాత్రమే ఉద్యో గాలు సాధించనున్నారు. దీంతో సంవత్సరంపాటు వ్యయప్రయాసల కోర్చి కోచింగ్‌లు తీసుకుని అహరహం శ్రమించిన లక్షలాది మంది తెలివైన అభ్యర్థులకు అన్యాయం జరుగుతోంది. ఒకవైపు తక్కువ పోస్టులు.. మరోవైపు ఆన్ లైన్ విధానం.. వెరసి నిరుద్యోగుల పరిస్థితి 'మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టైం'ది. దీనికంతటికీ ప్రధానకారణం ఆన్ లైన్ పరీక్ష విధానమే! ఒకవేళ ఈ ప్రభుత్వానికి ఆన్ లైన్ విధానం పై అంత మోజే ఉంటే డీఎస్సీ అనేది ఉద్యోగ నియామక పరీక్ష కాబట్టి ఒక జిల్లా అభ్యర్థులందరికీ ఒకే రోజు పరీక్ష పెట్టాలన్న ఇంగిత జ్ఞానం ఈ ప్రభుత్వానికి కానీ అధికారులకు కానీ లేదా? అని అభ్యర్థులు ఆవేదన చెందుతున్నారు. గతంలో కూడా 'టెట్' పరీక్షను రెండు సార్లు ఆన్ లైన్ లో జరిపి అభాసుపాలైన విద్యాశాఖ, డీఎస్సీ పరీక్షలనూ ఆన్ లైన్ లో నిర్వహిస్తూ తప్పు మీద తప్పు చేస్తోంది. డీఎస్సీ పరీక్షలు ఆన్ లైన్ లో జరుప వద్దని లక్షలాది మంది నిరుద్యోగులు ఎంత మొరపెట్టుకున్నా ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. వారి జీవితాలతో ఆడుకుంటోంది. అసలు ఈ ప్రభుత్వానికి నిరుద్యోగులకు అందరూ మెచ్చే పద్ధతిలో ఉద్యోగాలు ఇవ్వడం ఇష్టం లేదా? అని కంటతడి పెడుతున్నారు. కాగితం మీద (ఆఫ్ లైన్ లో) పరీక్షలు నిర్వహించే సత్తా ఈ ప్రభుత్వానికి లేదా? అని ప్రశ్నిస్తున్నారు. నిరుద్యోగుల మనోభీష్టాలకు వ్యతిరేకంగా వ్యవహరించడమే ఈ ప్రభుత్వ కర్తవ్యమా? అని వాపోతున్నారు. మన పొరుగు రాష్ట్రం తెలంగాణ సైతం ఆఫ్ లైన్ లోనే డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తోంది కదా. అలాంటప్పుడు మన ప్రభుత్వం ఎందుకు కాగితంపై డీఎస్సీ పరీక్షలు నిర్వహించలేక పోతుందో అన్నది వేయి డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది.

- బట్టా రామకృష్ణ దేవాంగ, సౌత్ మోపూరు, నెల్లూరుజిల్లా

విశాలాంధ్ర
బతుకు
The Life
గురువారం
31 జనవరి 2019

ప్లకార్డ్స్‌తో భగత్ సింగ్



ఈ చిత్రాన్ని కొంచెం జాగ్రత్తగా గమినిస్తే ఇందులో మనకొక స్వతంత్ర సమరయోధుడు, గొప్ప విప్లవకారుడైన భగత్‌సింగ్ ఫొటో కనబడుతుంది. ఇదేదో పెయిటింగ్ అనుకోకండి. రిపబ్లిక్ డే సందర్భంగా పూనె విద్యార్థులు ప్లకార్డులతో భగత్ సింగ్ చిత్రాన్ని ప్రదర్శించారు.

అనుబంధాలను తెంచేస్తున్న సీరియల్స్

ఒకప్పుడు ఆడవాళ్ళు ఇద్దరు, ముగ్గురు కూడితే చాలు ఇరుగు పొరుగు వారి గురించి తెగా ఆరాతీస్తుండేవారు. కానీ నేడు ట్రెండ్ మారింది. ఇరుగు పొరుగు వారి స్థానంలోకి సీరియల్స్ వచ్చాయి. ఏ ఫంక్షన్‌నైనా, పార్టీలోనైనా సీరియల్ ముచ్చట్లే. 'అక్కా ఆ సీరియల్‌లో అలాగా.. చెల్లీ ఈ సీరియల్‌లో ఇలాగా.. సీరియల్‌లో తర్వాత ఏం జరగబోతోందో?' అనే అదుర్దాతో పలకరించుకుంటున్నారే తప్ప అప్యాయంగా ఎలా ఉన్నావని అడగడం కూడా మర్చిపోతున్నారు. అంతలా సీరియల్స్‌లో మునిగిపోతున్నారు.



ఉదయం లేచిన దగ్గర నుంచి సాయంత్రం ఎప్పుడవుతుందా.. సీరియల్‌లో ఏం జరుగుతుందో చూడాలన్న వారి ఆసక్తి రోజు రోజుకూ పెరిగిపోతోంది. ఇక సాయంత్రం ఐదుగంటల నుంచి మొదలవుతుంది ఈ సీరియల్స్ గోల. ఏ అర్థరాత్రికో గానీ వీటికి అడ్డుకట్టపడదు. రోజంతా ఇంట్లో ఉండే గృహిణులు వీటికి అడిక్ట్ అయిపోయారనే చెప్పుకోవాలి. కారణం సీరియల్స్ మొదలయ్యే సమయానికి పనంతా పక్కనబెట్టి మరి టీవీకి అతుక్కుపోతుంటారు. ఒకవేళ ఏదైనా ముఖ్యమైన పని ఉండి సీరియల్ మిస్ అయినా వారి కోసం టీవీ ఛానల్స్ పగటి పూట ప్రత్యేకమైన ఎపిసోడ్స్ అని, మెగా ఎపిసోడ్స్ అని పున:ప్రసారాలు చేస్తూనే ఉంటాయి. న్యూస్ ఛానల్స్ మినహాయిస్తే మిగిలిన అన్ని తెలుగు, హిందీ ఛానల్స్‌లోనూ ఇదే తంతు.

సాయంత్రం అయిందంటే చాలు టీవీ రిమోట్ మహిళల చేతిలోకి చేరిపోతుంది. సీరియల్ వెనుక మరొక సీరియల్ అన్నట్లుగా ప్రతీ అరగంటకొక సీరియల్ వేస్తుంటారు. వీరు చూస్తూనే ఉంటారు. సీరియల్ మిస్ అయిన రోజున ఏదో కోల్పోయినట్లు బాధపడుతూ ఇంట్లో వారిపై చిరాకు పడుతుంటారు. సీరియల్ వచ్చే సమయంలో కనీసం భర్తకు, పిల్లలకు అన్నం పెట్టడానికి కూడా లేవరు. అంటే సీరియల్స్ వారిని ఎంతలా కట్టిపడేస్తున్నాయో ఊహించుకోవచ్చు.

సీరియల్స్ వారు రేటింగ్ కోసం ఇంటర్నెట్‌లోకి కూడా ప్రవేశించారు. టీవీలో ఏదైనా మిస్ అయితే లేదంటే ముందుగా సీరియల్‌ను చూడాలంటే వారి కోసం హాట్ స్టార్, డిట్టో టీవీ వంటి యాప్‌లు కూడా అందుబాటులోకి వచ్చాయి. నేడు ప్రతి ఇంట్లోనూ మనిషికొక స్మార్ట్ ఫోన్ ఉంది. దీని ద్వారా వారు ముందుగా సీరియల్‌ను చూడటానికి ఆ యాప్‌లో లాగ్ ఇన్ అయి సీరియల్ ఎపిసోడ్ పెట్టే వరకూ ఫోన్‌ను పట్టుకొని కూర్చునే పరిస్థితి వచ్చింది.

సీరియల్స్ వారు పీఆర్‌పీ రేటింగ్ కోసం ప్రతి ఎపిసోడ్‌లోనూ ఏదో కొంపలు మునిగిపోయే రీతిలో ముగింపిస్తూ మరుసటి రోజున ఎపిసోడ్ మిస్ కాకుండా చూడాలనిపించే విధంగా మహిళలన్ని కట్టిపడేస్తున్నారు. దీంతో సీరియల్స్‌కి బానిసలైపోతున్నారు. ఓ వార్తలు లేవు, ఓ విజ్ఞానమూ లేదు. ఏ సీరియల్ చూసినా పగలు, ప్రతీకారాలు, కుట్రలు, కుతంత్రాలు, అనుమానాలు, వివాహేతర సంబంధాలు, హత్యలు, అపహరణలు, ఇతర జుగుప్సకర సన్నివేశాలే. ఇలాంటివి జీవితంపై విరక్తి కల్గిస్తాయంటే అతిశయోక్తి కాదు. నిజ జీవితానికి ఏ మాత్రం పొసగని రీతిలో వీటిని చిత్రీకరిస్తున్నారు. వందల కొద్దీ ఎపిసోడ్స్‌తో సాగదీస్తున్నారు.

మహిళలు విలన్‌గా ఉండడమనేది వాస్తవ జీవితంలో చాలా అరుదు. అయితే సీరియల్‌లో మాత్రం ఆడవిలన్ పాత్ర కచ్చితంగా ఉంటుంది. సీరియల్స్‌లో ఆడవిలన్ పాత్రలు చేసే ఆకృత్యాలు అన్ని ఇన్ని కావు. ఇవి చూసి కొంత మంది వారిలా ప్రవర్తిస్తున్నారు. వీటి ప్రభావం వల్ల చాలా మంది జీవితాలు నాశనమవుతున్నాయి.

జీవితాలపై సీరియల్స్ ప్రభావం

డైలీ సీరియల్స్ నట్టింట నరకాన్ని చూపుతున్నాయి. పచ్చని సంసారాల్లో నిప్పులు పోస్తున్నాయి. నిత్యం వివిధ టీవీ ఛానెల్స్‌లో ప్రసారమయ్యే సీరియల్స్ ఆడవారికి ఆడవారినే శత్రువులగా సిద్ధాంతీకరిస్తున్నాయి. ఆస్తి తగాదాలు, ఒక పురుషుడి కోసం ఇద్దరు లేదా ముగ్గురు స్త్రీలు కొట్టుకోవడాలు, తోటి కోడళ్లు, అక్కాచెల్లెలు, అన్నదమ్ములు మధ్య అధిపత్య పోరు, చివరికి తల్లి కూతుళ్ళు, తండ్రి కూతుళ్ళ మధ్య గొడవలు ఏ ఒక్క బంధాన్ని కూడ వదలకుండా చిత్రవధ చేస్తున్నారు.

కుటుంబ సభ్యులను ఎలా విడగొట్టాలో, ఆస్తులు దక్కించుకునేందుకు పావులు ఎలా కదపాలో, భర్తను ఎలా లొంగదీసుకోవాలో, భార్యను ఎలా చిత్రహింసలకు గురిచేయాలో తెలియని వారికి కూడా ఈ సీరియల్స్ ద్వారా నేర్పుతున్నారు. ఇవన్నీ ప్రేక్షకుల ప్రవర్తనలో అనూహ్యమైన మార్పులను తీసుకువస్తున్నాయి. వీటిని తదేకంగా చూడటం వల్ల వారి వైవాహిక జీవితాలు చిన్నాభిన్నమవుతున్నాయని మానసిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రతీ ఇంట్లో భార్య భర్త, అత్తాకోడళ్ళ మధ్య భేదాభిప్రాయాలు ఉంటాయి. కానీ వాటిని అర్థం చేసుకుని, పరిష్కరించుకుని ముందుకు పోవాలి. ఈ వాస్తవాలను అర్థం చేసుకోకుండా అంతరంగాల్లో దాగి ఉన్న కోపాన్ని కసిని ప్రదర్శించడమెలాగో ఈ సీరియల్స్ పోటీ పడి మరి చూపుతున్నాయి.

గంటల తరబడి టీవీలకు అతుక్కుపోవడం వల్ల ఆరోగ్యం కూడా దెబ్బతింటున్నది. ధారావాహికలు చూసుకుంటూ అతిగా తినడం, అస్సలు తినకపోవడం వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. టీవీలో ఉత్కంఠ రేపే సన్నివేశాల వల్ల ఆందోళనతో బీపీ వంటి దీర్ఘకాలిక రోగాల బారినపడుతున్నారు. దీని వల్ల గుండెపోటు వచ్చే సూచనలున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

- రెడ్డిపల్లి రాము, రాంబిల్లి

ఆకర్షణీయమైన టైటిల్స్‌తో గాలం

ప్రేక్షకులను ఆకట్టుకునే విధానం సినిమా వారికంటే ఎక్కువగా సీరియల్ వారికే తెలుసు అని చెప్పకోవాలి. కారణం వారు సీరియల్‌కి పెట్టే పేర్లే. ముందుగా పేర్లతోనే ఆకట్టుకుంటారు, సీరియల్ చూడాల్సిందే అనిపించేలా చేస్తారు. దీని కోసం హిట్టు అయిన సినిమా పేర్లను వినియోగిస్తుంటారు. ఉయ్యాల జంపాల, మల్లీశ్వరి, అష్టా-చెమ్మా, అత్తారింటికి దారేది, కోడలా కోడలా కొడుకు పెళ్ళామా, ఆరాధన, శశిరేఖా పరిణయం, నువ్వేకావాలి. నిన్నే పెళ్ళాడతా వంటివి కొన్ని సీరియల్ పేర్లు ఇందుకు ఉదాహరణగా చెప్పకోవచ్చు. కేవలం పేర్లతోనే మహిళలకు సీరియల్ చూడాలనే ఆసక్తి మరింత పెరిపోతున్నది.



బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్‌ల మోత

సీరియల్ కోసం ప్రత్యేకించి ఒక పాటను రాయిస్తారు. దాన్ని సీరియల్ మొదలయ్యే సమయంలో చూపిస్తారు. దీన్ని అవసరానికి తగ్గట్టుగా ప్లే చేస్తారు. ఇది కాక ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి సన్నివేశానికి తగ్గట్టుగా బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్‌ను ప్లే చేస్తున్నారు. ఈ మ్యూజిక్‌ను కూడా సినిమాల నుంచే తీసుకుంటున్నారు. దీంతో తెరమరుగైన పాటలకు కూడా ప్రత్యేక ఆదరణ లభిస్తున్నది. ఇది మాత్రం మంచి పరిణామమే. మిగతా సందర్భాలను పరిశీలిస్తే.. సరదా ఉన్నప్పుడు ఒకటి, ఏడుపు సమయంలో మరొకటి.. ఇలా భయంకరమైన మ్యూజిక్‌లతో ప్రేక్షకుల గుండెల్ని పిండేస్తున్నారు.



కుటుంబాలు చిన్నాభిన్నం



సీరియల్స్‌కి బానిసల్లా మారుతున్న మహిళలు మానసిక రుగ్మతలతో సతమతమవుతున్నారు. పిల్లలు స్కూల్ నుంచి ఇంటికి వచ్చినా... భర్తలు ఆఫీసు నుంచి వచ్చినా... వారి బాగోగులు కూడా చూసుకోలేనంత బిజీగా సీరియల్స్ చూడటంలో మునిగిపోతున్నారు. పిల్లలకు ఆరోజు స్కూల్‌లో ఎలా గడిచింది. ఏం నేర్చుకున్నారు, అసలు వాళ్ళేం చదువుతున్నారనే విషయాలను పట్టించుకోవడమే లేదు. తల్లులు పట్టించుకోకపోవడంతో పిల్లలు స్మార్ట్ ఫోన్స్‌తో కాలక్షేపం చేస్తున్నారు. దీంతో వాళ్ళ చదువులు అటకెక్కుతున్నాయి. చాలా మంది ఇంటిపని, వంటపని కూడా మమ అనిపిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. దీంతో భార్యభర్తల మధ్య మనస్పర్థలు వస్తున్నాయి. పాత్రల ప్రభావంతో పలువురు మహిళలు భర్తలను అనుమానించడం, అత్తలు కోడళ్ళను, కోడళ్ళు అత్తలను సాధించడం వంటి వాటితో సజావుగా సాగిపోయే జీవితాల్లో కల్లోలాలు సృష్టిస్తున్నాయి.

బ్రేక్‌ఫాస్ట్‌తో...ఆరోగ్యం



బిజీబిజీ జీవితంలో బ్రేక్‌ఫాస్ట్‌ను తీసుకోకుండా వారి వారి పనుల్లో నిమగ్నమైపోతున్నారు. ఇంతకుముందు బ్రేక్‌ఫాస్ట్‌ను భారీగా తీసుకునేవారు. ఈ భారీ బ్రేక్‌ఫాస్ట్ పూర్తి క్యాలరీలతో నిండి ఉండేది. అందువల్ల వారికి రోజంతా పనిచేయగలిగే శక్తి ఉండేది. ప్రస్తుతం ఇంటి పనులు చేయడానికి ఎలక్ట్రానిక్ పరికరాలు అందుబాటులో ఉన్నాయి. కానీ ఇప్పటిలాగా అప్పుడు ఎటువంటి పరికరాలు లేవు. దీంతో వారే స్వయంగా ఇంటి పనులు చేసుకునేవారు.

లివింగ్ రూమ్, కిచెన్ సౌకర్యాలు నేటి మహిళల జీవన విధానాన్ని మార్చేశాయి. దీంతో బ్రేక్‌ఫాస్ట్ ప్రాధాన్యం తగ్గిపోయింది. దీనికి తోడు క్యాలరీలు తక్కువగా ఉన్న ఆహారాన్ని ఎంచుకోవడం కొంత ఫ్యాషన్‌గా మారిపోయింది. ఉదయం లేటుగా లేవడం టైం పోతుందని హడావిడి పడిపోతూ బ్రేక్‌ఫాస్ట్ చేయకుండా వెళ్ళిపోతున్నారు.



నిజానికి రోజు ప్రారంభంలోని ఈ బ్రేక్‌ఫాస్ట్ చాలా కీలకమైనది. ఇది కేవలం జీవక్రియకు అవసరమని గుర్తించాలి. ప్రతిరోజూ క్రమం తప్పకుండా బ్రేక్‌ఫాస్ట్ తీసుకునేవారి జీవక్రియ తిననివారితో పోల్చితే చక్కగా ఉంటుంది. పైగా బ్రేక్‌ఫాస్ట్ సరిగా చేయనప్పుడు ఏదోఒక చిరుతిండ్ల వైపునకు మనస్సు లాగేస్తుంటుంది. ఇలాంటివి తీసుకోవడం వల్ల ఊబకాయం వస్తుంది. దీంతో శక్తి సన్నగిల్లి రోజువారి పనులను కూడా చేసుకోలేరు.

బ్రేక్‌ఫాస్ట్ ఎంత మోతాదులో తినాలనే ప్రశ్న అందరికీ ఉంటుంది. బ్రేక్ ఫాస్ట్‌ని అందరూ ఒకేలా తీసుకోరు. ఒక్కొక్కరికి ఒక్కో విధానం ఉంటుంది. ఉదయం వేళ ఎంత ఆకలిగా ఉంటాం, రాత్రి భోజనం ఎంత భారీగా చేశాం, రెండిటి నడుమ ఎంత విరామం ఉంది అనే అంశాలపై బేరీజు వేసుకొని మరీ బ్రేక్‌ఫాస్ట్‌ను సరిపడా తీసుకోవాలి.

బ్రేక్‌ఫాస్ట్‌లో గుడ్లు, దుంపలు, టోస్ట్, సెరల్, పండ్లు, ఇడ్లీ, దోసె, చపాతీ, పూరి, ఉప్మా, పోహా వంటివి ఏవయినా తినొచ్చు. ఒక బౌల్ ఓట్స్ లేదా గ్లాసు మిల్క్‌షేక్ తాగినా మంచిదే.

నిద్ర లేవగానే ఆకలి వేయలేదంటే, జీవక్రియ పనితీరు పూర్తిస్థాయిలో లేదని అర్థం. ఆకలి వేయకపోయినా బ్రేక్‌ఫాస్ట్ తప్పనిసరిగా తినాలి. ఇలా చేస్తే మీరు పూర్తి ఆరోగ్యంగా ఉంటారని నిపుణులు సూచిస్తున్నారు.

చుండ్రును నివారించండిలా...!

పెరుగుతున్న కాలుష్యం రకరకాల సమస్యలను తెచ్చిపెడుతుంది. దీనిలో చుండ్రు కూడా ఒకటి. దీని వల్ల తల అస్తమానం దురదలు పెడుతుంది. అంతేకాక భుజాలపై రాలిపడుతుంది. దీంతో మీరు బయటకి వెళ్ళాలన్నా ఆలోచించాల్సిన పరిస్థితి వస్తుంది. ఇలాంటి పరిస్థితి నుంచి బయటపడాలంటే ఏం చేయాలో తెలుసుకుందామా..!

పెరుగు, నల్లమిరియాలు

రెండు టేబుల్ స్పూన్‌ల నల్ల మిరియాలను తీసుకొని పొడిలా చేయండి. ఈ పొడిని ఒక కప్పు పెరుగులో కలపండి. ఈ మిశ్రమాన్ని మాడుకు బాగా పట్టించండి. వెంట్రుకలకు అవసరం లేదు. ఒక గంట తర్వాత తలస్నానం చేయండి.

నిమ్మ రసం, కొబ్బరి నూనె

ఐదు స్పూన్‌ల కొబ్బరి నూనె, ఒక స్పూన్ నిమ్మరసం తీసుకోండి. ఈ రెండిటిని కలిపి తలకు బాగా మసాజ్ చేయండి. ఇలా చేస్తే చుండ్రు తగ్గుతుంది.



బేకింగ్ సోడా

బేకింగ్ సోడా చుండ్రును కలగజేసే బ్యాక్టీరియాను నాశనం చేస్తుంది. మీరు ఉపయోగించే షాంపులో ఒక స్పూన్ బేకింగ్ సోడాను కూడా కలిపి ఉపయోగిస్తే చుండ్రు తగ్గుతుంది.

బాడీ క్లాక్



నేటి యువతకు అర్ధరాత్రి వరకూ మెలకువగా ఉండి ఎంజాయ్ చేయడం సర్వసాధారణమైపోయింది. ఎంజాయ్‌మెంట్లు బాగానే ఉంటాయి కానీ అర్ధరాత్రి వరకూ మెలకువగా ఉండడం ఆరోగ్యాని మంచిదికాదంటున్నారు నిపుణులు. బరువు తగ్గాలనుకునేవారికి ఇది అస్సలు మంచిదికాదంటున్నారు.


సరైన సమయానికి నిద్రపోవకపోవడం వల్ల తీసుకున్న ఆహారం జీర్ణం కాక బాడీ క్లాక్ దెబ్బతింటుంది. ఫలితంగా బరువు పెరుగుతారు. ఆలస్యంగా నిద్రపోయినా, భోజనం చేయకపోయినా లేదా ఒక్కోసారి ఒక్కొక్క సమయంలో ఆహారం తీసుకోవడం వల్ల జీవక్రియను నియంత్రించే హార్మోన్లు, జీన్స్‌ను ప్రభావితం చేస్తాయి.

ఫలితంగా శరీరంలో ఫ్యాట్ బర్నింగ్ మోడ్ కంటే ఫ్యాట్ స్టోరేజి ఎక్కువగా ఉంటుంది. కాబట్టి బాడీక్లాక్ సక్రమంగా పనిచేయాలంటే నిద్రపోవడం, లేవడం, తినడం వంటి పనులకు కచ్చితమైన సమయాన్ని పాటించండి.

క్రేజీ కమ్మలు

చెవికి బుట్టలతో అలంకరించడం అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ ఫ్యాషనే. వీటికి పెరుగుతున్న క్రేజ్‌లాగే కొత్త కొత్త మోడల్స్ వస్తున్నాయి. అలా వచ్చిన వాటిల్లో ఇవి ఒకటి. చెవి మొత్తాన్ని అలంకరించే ఈ కమ్మలు మహిళల్ని విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.




నేను - సుడిగుండం (నవల) 31

పి.చంద్రశేఖర అజాద్
సెల్: 92465 73575

నిన్నటి సంచిక తరువాయి

"నాకు కూడా పట్టుదల వుంది మావయ్యా... ఎవరికీ బాకీ వుండటం నాకు ఇష్టం లేదు. మా నాన్న జబ్బుపడ్డప్పటి నుంచి ఇప్పటిదాకా మీరు ఖర్చుపెట్టిందంతా లెక్క చూడాలి. ఆ అరెకరం మీరే వుంచుకోండి. నేను మీకు ఇంకా ఇవ్వాలి. అదంతా మెల్లగా ఇస్తాను" అన్నాను.

మాట్లాడలేకపోయాడు.

"అంతేకాదు. అది నా భార్య భూమి. అది నేను వెన్నెలకి కొనిస్తాను"

వెన్నెల కన్నీళ్లు పెట్టుకుంటోంది.

"నాకు ఇష్టం లేకపోయినా ఒప్పుకుంటున్నా. నాకు నువ్వు బాకీ లేవు. అరెకరం మాత్రం మేమిద్దరం పోయాక నా పెద్ద కూతురికి చెందుతుంది" అని ఇంకో మాట కోసం చూడకుండా గదిలోకి వెళ్లాడు.

అర్చనకి ఈ విషయం చెప్పాను.

"మేం అనుకున్నది వేరు బావా... నలుగురి మంచి కోసం పని చేయాలనుకున్నాం. అయినా అమ్మా - నాన్నలు మాకు కావాలి. మా పెళ్లికి రావాలంటే నాన్న షరతు అదే అయితే, అలానే చేయమనండి" అంది..

"ఇంకో విషయం బావా... మా చదువు ఇంకో ఆరునెలల్లో అయిపోతుంది. ఆ తర్వాతే మేం పెళ్లి చేసుకుంటాం"

****

అమ్మ వెళ్లిపోయింది

అర్చన పెళ్లి విషయంలో అమ్మ ఏమీ మాట్లాడలేదు.

"ఇప్పటికన్నా మా దగ్గరకు రా, నీ మనవరాలు వుంది. నీదాకి నీ ప్రేమ కావాలి. కాదనకు" అనీ బతిమాలాను.

"ఇన్ని సంవత్సరాలు నుండి ఇప్పుడు రావటం ఎందుకు? ముందు చిన్నదాని పెళ్లి అవనీ" అంది.

అర్చన పెళ్లి జరిగిపోయింది.

అమ్మ మాట్లాడటం లేదు. నేను వెన్నెల్ని, నిదాని పంపించి బలవంతంగా తీసుకు రమ్మన్నాను. అప్పుడు తెలిసింది అమ్మ జబ్బు పడి మంచం మీద వుందని, ముందు వాళ్లు వెళ్లారు. నాలుగు రోజుల తర్వాత నేను వెళ్లాను.

భారంగా మాట్లాడింది.

"భగవంతుడు నన్ను ఎందుకు పుట్టించాడో తెలియదు. నేను అందరికీ సమస్య అయ్యాను. నాకు నువ్వు పుట్టకపోయి వున్నా ఈ బతుకు ఇంకోలా వుండేది"

"నీకేం కాదమ్మా... హైదరాబాద్ వెళ్దాం. నిన్ను మంచి హాస్పటల్లో చేర్పిస్తాను. నిదా పెళ్లి నువ్వు చూడాలి. చూస్తావు"

"లేదురా. నాకు తెలుస్తూనే వుంది. నేను యిక్కడే రాలిపోతాను. మా అన్నయ్యని చూస్తుంటేనే దిగులుగా వుంది. రేపు నేను లేకపోతే తట్టుకోలేడు. అంతకుమించి నాకు బాధ లేదు" అంటుంటే నోరు మూసేసాను.

బలవంతంగానే చేతిని నెట్టివేసి...

"నేను పోయాక మీ మావయ్యలకు కబురు చేయవద్దు. వాళ్లు నా శవాన్ని చూడటానికి వస్తే నాకు అవమానం" అంది.

నాకు తెలియకుండానే దుఃఖం విరుచుకుపడింది.

"మనుషులు మారిపోతున్నారు రాముడూ. ఇది మంచి కొస్తందో, చెడుకి వస్తందో తెలియదు. ముందు ముందు అరాచకమే అనిపిస్తోంది. మంచో, చెడో నేను చూడకుండా ఎల్లిపోతున్నందుకు నాకు సంతోషంగా వుంది. నాకు ఇంకో జన్మంటూ వద్దు. నువ్వు నా మాట తీర్చావు. నేను నీ దగ్గరికి వస్తానన్న మాట తీర్చలేకపోతున్నా" అంది.

అదే చివరిసారి అంతగా మాట్లాడటం.

నేను దగ్గర్లో వున్న హాస్పిటల్లో చూపించాను.

"కేన్సర్. అడ్వాన్స్‌డ్ స్టేజ్. కొన్ని గంటలు. ట్రీటిమెంట్ చేయించటం అనవసరం" అన్నారు.

అయినా నేను అమ్మని విశాఖ తీసుకు వెళ్దామనుకున్నాను. ఆ ప్రయత్నంలో వుండగానే అమ్మ చనిపోయింది.

ఒకప్పుడు అమ్మ చనిపోతే నేనూ చనిపోవాలనుకున్నాను. అమ్మ నా కళ్లముందు కనిపిస్తుంటే ఈ ప్రపంచంలో నాకు ఇంకెవరూ లేరనిపించింది. భార్య, కూతురు, మావయ్య, అత్తయ్యా ఎవరూ గుర్తు రాలేదు.

ఇప్పుడు అమ్మా-నాన్నా లేని వాడిని. నాలో శక్తి అంతా అదృశ్యం అయినట్లు అనిపించింది.



ఇంతకుముందు మావయ్య బాధ పడిన సందర్భాలు తెలుసు. మొదటిసారి వెక్కి వెక్కి ఏడవటం చూసాను. అది చూస్తుంటే ఎవరికీ దుఃఖం ఆగటం లేదు.

"బుల్లమ్మాయ్.... బుల్లమ్మాయ్... ఇలా చేసావేంటి. ఇలాంటి రోగం నీకు రావటం ఏంటి? నాకు నా భార్యా, నా చెల్లి తోడుంటారని అనుకున్నా... నేను ముందుగా పోతే నువ్వు దగ్గరుంటావనుకున్నా, నీ వదినకి నువ్వు తోడుగా వుంటావనుకున్నా. ఇలా వెళ్లిపోయావా" అంటూ గుండెలు బాదుకుంటూ ఏడ్చాడు.

నిదా ఇంకా చిన్నపిల్ల. మృత్యువు గురించి తనకు తెలియదు. అయినా ఏడుస్తోంది. నాయనమ్మతో పెద్దగా బంధం లేదు. అప్పుడప్పుడు చూడటానికి అమ్మతో వెళ్లేది.

అమ్మకు దహన సంస్కారం చేయటానికి వెళ్తుంటే ఊర్లో వారు చాలామంది వచ్చారు. అన్నతో మన ఊరు వచ్చింది. నిప్పులా బతికింది. ఒకరికి సాయం చేసింది. తప్ప ఎవరి ముందూ చెయ్యి చాచలేదు. ఈ కాలంలో నరసయ్యలాంటి అన్నయ్యనీ, బుల్లెమ్మగారి లాంటి చెల్లెల్ని చూడలేం అనుకున్నారు.

నా జీవితంలో అమ్మది ముఖ్యమైన భాగం. నేను నా ఆత్మకథను ఎప్పటికయినా ప్రచురిస్తాను. నేను అంత గొప్పవాడిని కాదని నాకు తెలుసు.

అయినా ఎవరి జీవితం వారికి గొప్పది. అది ఎవరన్నా చదువుతారా అనేది నాకు అనవసరం!

****



నాలుగో అధ్యాయం

నేను ఓ హాలీవుడ్ నటుడ్ని ఇంటర్వ్యూ చేయాల్సి వచ్చింది. మామూలుగా ఇలాంటి వాటిని ఆంగ్ల పత్రికల సౌజన్యంతో ప్రకటిస్తారు. మా మేనేజ్‌మెంట్ ఎప్పటికప్పుడు కొత్త పుంతలు తొక్కుతుంది. వారు ఈ ఇంటర్వ్యూని ఏర్పాటు చేయగలిగారు.

ఇది వరకటిలా ప్రత్యేక ప్రతినిధి అనో మరో పేరుతోనో ఆర్టికల్స్ రావటం లేదు. ప్రభాత్' అని ప్రచురిస్తున్నారు. నా ఫొటో కూడా ప్రచురిస్తున్నారు. నేను ఫ్లయిట్‌లో ముంబయ్ బయలుదేరాల్సి వచ్చింది. అప్పుడు నాకు 'రమాకాంత్' కలిసారు. అతనికి రియలెస్టేట్, ఐ.టీ.కి చెందిన వ్యాపారాలు వున్నాయి. అంతకుముందు ఒకటి రెండు సందర్భాల్లో కలిసాను.

"నేను విజువల్ మీడియాలోకి రావాలనుకుంటున్నాను. ముందు ముందు భవిష్యత్ అంతా విజువల్ మీడియాదే. ప్రింట్ మీడియాలో వార్తలు రాస్తారు. ఇక్కడ చూస్తారు. అందుకు చదువుకోవాల్సిన అవసరం లేదు" అన్నాడు.

అప్పటికి ఎంటర్‌టైన్ మెంట్ ఛానల్స్ వున్నాయి. న్యూస్ ఛానల్స్ లేవు. ముందు మనం న్యూస్ ఛానల్ స్టార్ట్ చేద్దాం. తర్వాత ఎక్స్‌పాండ్ చేద్దాం. ఎప్పటినుంచో నిన్ను పరిశీలిస్తున్నాను. నువ్వు నాతో వుంటే బాగుంటుంది అన్నాడు.

"ఇది నాకు కొత్త" అన్నాను.

"పత్రికల్లోకి వచ్చినప్పుడు కొత్త అనిపించలేదా?" బిత్తరపోయాను.

"ఏదయినా మనం కొత్తగా నేర్చుకోవాల్సిందే. ఈ విషయం రహస్యంగా వుంచు. ఎంతోకాలం దాగదు. ఈ మీడియా మజా తెలిస్తే ముందు ముందు డజన్ల కొద్దీ వస్తాయి. అయినా ముందు మనం స్టార్ట్ చేస్తున్నాం అనేది కావాలి. ఆలోచించు. నువ్వు నీ జాబ్ కి రిజైన్ చెయ్యి" అన్నాడు.

నేను మాట్లాడక పోయేసరికి....

"నువ్వు వారం రోజుల్లో బెంగళూర్ కి రా. మన ఫామ్‌హౌస్‌లో మాట్లాడుకుందాం. నేను ఫ్లయిట్ టికెట్స్ పంపిస్తాను" అన్నాడు.

నాకు థ్రిల్లింగ్‌గా అనిపించింది. అయితే నేను ఉద్యోగానికి రాజీనామా ఇవ్వటానికి సిద్ధంగా లేను.

****

విజువల్ మీడియాలో నేను!

నేను బెంగళూరు వెళ్లటానికి ముందు అనేక రకాలుగా ఆలోచించాను. రమాకాంత్ చెప్పింది నిజం. దేశంలో వున్నవి ఉదయం వచ్చే దినపత్రికలు. మళ్లీ పేపర్ చదవాలంటే ఇరవై నాలుగు గంటలు కావాలి..

దేశంలోనూ, ప్రపంచంలోనూ ప్రతి నిముషం ఎక్కడో ఓ చోట సంచలనం కలిగించే సంఘటనలు జరుగుతుంటాయి. అవన్నీ ఎప్పటికప్పుడు అందించాలి. అప్పుడే ఏం చేయాలో నాలో ఆలోచనలు రూపుదిద్దుకుంటున్నాయి.

బెంగళూరు వెళ్లాను.

ఈ వారం రోజుల్లో రమాకాంత్ చాలా పనులు చేసాడు. లైసెన్స్ కోసం అప్లై చేసాడు. కెమెరాలు, ఎడిటింగ్ పరికరాలు, ట్రాన్స్‌పోర్ట్ ఏర్పాట్లు అన్నీ జరుగుతున్నాయి. అత్యంత ఆధునికమైన సామగ్రికి ఆర్డర్స్ వెళ్లాయి.

"మనకి కావల్సింది పవర్. అది స్త్రీ- పురుషుల నుండి మనం తీసుకుందాం. అదంతా నువ్వు చూసుకోవాలి. మనకి కంటెంట్ ముఖ్యం. ఇప్పటిదాకా నువ్వు జెమ్స్‌ని చూసావు. అలాంటి వారిని మన ఛానల్ కి తీసుకురా. అయితే నా సలహా ఒకటే. వార్తలు - వ్యాఖ్యానం - దృశ్యం - ఏదీ చప్పగా వుండకూడదు"

ఆయన చెప్పేది మౌనంగా వింటున్నాను.

"ముందు అవసరం అయిన మేరకు మాత్రమే తీసుకుందాం. వారికి మనం ఎడిటింగ్ దగ్గర్నుండి రిపోర్టింగ్ వరకు శిక్షణ యిప్పిద్దాం. నువ్వు స్టింగ్ ఆపరేషన్స్ చేయిస్తావో, ఇల్లీగల్ కాంటాక్ట్‌ని బయట పెడతావో, ఏం చేస్తావో ప్లాన్ చేసుకో. వాళ్లు ముఖ్యమంత్రులైనా, ప్రధానమంత్రులయినా ఫర్వాలేదు. నీ వెనకాల నేను వుంటాను. మన మీడియా హౌస్ సి.యీ, ఓగా నిన్ను అపాయింట్ చేస్తాను" అన్నాడు.

"నువ్వు ఎవరిని అపాయింట్ చేసుకుంటావనేది నేను అడగను. నీకు నెలకు ఒన్‌లాక్ శాలరీ. కారు ప్లస్ హౌస్ రెంట్ అలవెన్స్. అంతేకాదు ప్రాఫిట్‌లో ఫిఫ్టీన్ పర్సెంట్. అన్నీ ఎగ్రిమెంట్‌లో వుంటాయి"

నాకు ఇదంతా కలలా వుంది.

"ఇదంతా వర్కవుట్ అవుతుందా?"

"అవదు. మనం బ్రేకీవెన్ కి రావటానికి మూడు సంవత్సరాలు పట్టవచ్చు. అప్పటిదాకా ఇన్వెస్ట్ చేస్తాను. స్టాఫ్ శాలరీస్‌ని డిజైన్ చేద్దాం. ముందయితే పత్రికల కంటే ఎక్కువ ఇవ్వాలి. చెప్పాను కదా... అందరికీ ఇలాంటివి వుండవు. టాలెంట్‌ని బట్టి జీతాలుంటాయి. నేర్చుకునేవారికి తక్కువ వుంటాయి. అవన్నీ డిసైడ్ చేద్దాం"

"మన దగ్గరికి వచ్చేవారితో కొన్ని బలహీనతలు వస్తాయి. మరీ ట్రాఫిక్ కానిస్టేబుల్లా బండి ఆపితే ఎంతో కొంత పీక్కుందామన్నట్లు వుండకూడదు. (ఇంకా ఉంది)

కచ్చితత్వం, విషయ పరిజ్ఞానం ముఖ్యం

ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు కొన్ని సూచనలు

విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియెట్ అతి ముఖ్యమైన దశ. ఈ దశలో రాణించి తమకు ఇష్టమైన కోర్సుల్లో సీటు సంపాదించుకోవాలన్నది వారి ఆశ, ఆశయం. ఇందుకోసం వారు ఇంటర్‌లో పడే కష్టం చాలా ఎక్కువగా ఉంటుంది. మంచి మార్కులు సాధించాలన్నది ప్రతి ఒక్కరి కోరికగా ఉంటుంది. ప్రస్తుతం వారు సిలబస్ రివిజన్ దశలో ఉన్నారు.

అందరికీ అదే సిలబస్.. అంతే సమయం.. అయినా కొందరికే మంచి మార్కులు. కారణం చదవడంలో తేడాలే. ఏది ముఖ్యం.. దేన్ని వదిలేయాలి.. తెలుసుకొని ప్రిపేర్ కావడమే విజయసూత్రం. అతిస్వల్ప సమాధాన ప్రశ్నలేగా అని అదమరిస్తే.. అత్యున్నత స్థానం అందకుండా పోతుంది. చేతిరాతను పట్టించుకోకపోతే తలరాత మారిపోతుంది. ఇలాంటి ఇబ్బందులు తొలగాలంటే ఇప్పటి నుంచైనా శ్రద్ధపెట్టాలి. ఇంటర్మీడియట్ పరీక్షలు ఫిబ్రవరి చివర్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో సమగ్ర ప్రిపరేషన్‌కు సాయపడే సలహాలు, సూచనలను నిపుణులు అందిస్తున్నారు.

భౌతికశాస్త్రం (ఫిజిక్స్)

ఇంటర్మీడియట్ భౌతికశాస్త్రంలో విద్యార్థులకు కావాల్సింది- కచ్చితత్వం, విషయ పరిజ్ఞానం. అడిగిన ప్రశ్నకు సమాధానాన్ని సూటిగా, కూలంకషంగా తప్పుల్లేకుండా రాయగలగాలి.

పటాలు సరిగా వేయాలి. దృశా పరికరాలకు సంబంధించిన కిరణ పటాలు (రే డయాగ్రమ్స్) బాగా సాధన చేయాలి. ఎక్కడా ఏకాగ్రతను కోల్పోకూడదు. చాప్టర్ల వెనకనున్న సమస్యలు చేయాలి. ప్రమాణాలు (యూనిట్లు) వేయడం మరిచిపోకూడదు.

సమాధానాలను వీలైనన్ని ఎక్కువసార్లు పునశ్చరణ చేసి, జ్ఞాపకం ఉంచుకుంటే గరిష్ఠ మార్కులు సాధించవచ్చు. 'ఎలాగైనా పాస్ అవ్వాలి' అనుకునేవారు దీర్ఘ సమాధాన ప్రశ్నలపై ఎక్కువ శ్రద్ధపెట్టాలి. వారికి ఇక్కడే 16 మార్కులను పొందే వీలుంటుంది. వీటిని వీలైనన్ని ఎక్కువసార్లు నేర్చుకోవడం, చూడకుండా రాయడం చేయాలి. వీళ్లు ఎలాగూ తక్కువ ప్రశ్నలు (ఎంపిక చేసుకున్నవే) నేర్చుకుంటారు. కాబట్టి, వాటిని పక్కాగా నేర్చుకోవాలి. ఎక్కడా తప్పులు దొర్లకూడదు. పరీక్షలో ఏ ప్రశ్ననీ వదిలేయకుండా ప్రతి ప్రశ్నకూ సంబంధిత సమాధానాన్ని కొంతైనా రాయాలి. వీలైనచోట్ల పటాలను గీయాలి. కొన్ని ఎంపిక చేసుకున్న చాప్టర్ల నుంచి స్వల్ప సమాధాన ప్రశ్నలను కూడా బాగా నేర్చుకోవాలి.

చేయాల్సినవి

సన్నద్ధమయ్యేటపుడు..

- తప్పనిసరిగా చూడకుండా రాయడం (ముఖ్యంగా సమీకరణాలు ఉత్పాదించడం వంటివి) - పటాలను వీలైనన్ని ఎక్కువసార్లు గీయడం - ప్రశ్నల పట్టిక తయారు చేసుకుని, నేర్చుకున్నవి టిక్ చేసుకుంటూ చదవడం
- అతిస్వల్ప సమాధాన ప్రశ్నలకు జవాబులు బాగా కంఠస్థం చేయడం
- మార్కుల ప్రాధాన్యాన్నిబట్టి (వెయిటేజీ) నేర్చుకోవడం చేయాలి.

పరీక్ష రాసేటపుడు..

- మొత్తం అతిస్వల్ప సమాధాన ప్రశ్నలను వరుసగా ఒకచోట రాయడం
- సమాధానంలోని ముఖ్య భాగాలను అండర్‌లైన్ చేయడం
- దీర్ఘ సమాధాన ప్రశ్నలతో సమాధానాలు మొదలుపెట్టడం
- బాగా తెలిసిన సమాధానాలను ముందుగా రాయడం
- ప్రశ్న సంఖ్య తప్పనిసరిగా వేయడం
- రాసిన ప్రశ్నలను ప్రశ్నపత్రంలో టిక్ పెట్టుకోవడం
- గడియారంలో ఎప్పటికప్పుడు సమయం చూసుకోవడం, తద్వారా మిగతా ప్రశ్నలను ప్లాన్ చేసుకోవడం
- పెన్సిల్/ స్కెచ్‌పెన్‌తో మార్జిన్ వేయడం, సమాధానాల మధ్య గీతలు గీయడం
- పటాల కోసం కావాల్సిన సామగ్రి (పెన్సిల్, మర, రబ్బరు) తీసుకెళ్లడం
- వీలైనంతవరకు విడివిడిగా, పొందికగా స్పష్టంగా రాయడం
- చివరి కనీసం పావుగంట సమయం మిగిలేలా చూసుకోవడం (ఈ సమయంలో అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాశారో లేదో నిర్ధారించుకోవచ్చు) చేయాలి.

చేయకూడనివి

సన్నద్ధమయ్యేటపుడు..

- సమాధానాలను సంపూర్ణంగా కాకుండా సగం చదివి వదిలేయడం, తరువాత నేర్చుకుంటానంటూ వాయిదా వేయడం
- సమాధానంలో మొదటి రెండు, మూడు లైన్లు చూసి మిగతాది వచ్చేసింది అనుకోవడం
- పటాలను ఫ్లాష్ మెమరీలా గుర్తు పెట్టుకోవడం
- ఒక పద్ధతిలో కాకుండా ఇష్టం వచ్చిన రీతిలో చదవడం, నేర్చుకోవడం చేయరాదు.

పరీక్ష రాసేటపుడు..

- ఏవైనా చిహ్నాలు వేయడం
- కొట్టివేతలు చేయడం



- ప్రశ్నలను తొందరపాటుతో అపసవ్యంగా చదవటం
- ఎవరికైనా ఉద్దేశించి ఏదైనా రాయడం (ప్రశ్నపత్రంలో) వంటివి చేయొద్దు.

ఇంటర్ జంతుశాస్త్రంలో అత్యధిక మార్కులు తెచ్చుకోవాలంటే ముఖ్యమైన అంశాలపై ఎక్కువ దృష్టి పెట్టటంతో పాటు కొన్ని మెలకువలు పాటించాలి. మొదటి ఏడాదిలో 6, 8 యూనిట్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. కనీసం 30 మార్కులు రావాలంటే గత మూడేళ్ల ప్రశ్నపత్రాల్లోని 2, 4 మార్కుల ప్రశ్నలపై శ్రద్ధ పెట్టడం, ప్రొటోజోవా గమనం- ప్రత్యుత్పత్తి, 6, 7 యూనిట్లను, కొన్ని అంశాలను 8వ యూనిట్ నుంచి చదవాలి. 60కి 60 మార్కులు సాధించాలనుకునేవారు 1, 3, 4 యూనిట్లలో ముఖ్యమైనవి, మిగతా యూనిట్లలో అన్ని 2, 4 మార్కుల ప్రశ్నలను చదువుకోవాలి. రెండో సంవత్సరంలో జంతుశాస్త్ర పాఠ్యాంశాలు కొద్దిగా ఎక్కువ. కాబట్టి, సరైన ప్రణాళికతో సిద్ధం కావాలి.

చేయాల్సినవి

- మొదటి సంవత్సరంలో నూరు శాతం మార్కులు రావాలంటే విభాగం-ఎకు సంబంధించి పాఠ్యపుస్తకం వెనుక ఇచ్చిన ప్రశ్నలన్నీ చూసుకోవాలి.
- ముఖ్యమైన పదాలను ప్రత్యేకంగా కింద గీత గీయడం ద్వారా సూచించాలి.
- 8, 4 మార్కుల ప్రశ్నలకు చిత్రపటాన్ని గీయాలి.
- పటం గీయమని వచ్చిన ప్రశ్నలకు ప్రత్యేకంగా శ్రద్ధవహించాలి.
- విభాగం-ఎలోని ప్రశ్నలకు క్లుప్తంగా, ముఖ్యమైన అంశాన్ని వదలకుండా రాయాలి.
- విభాగం-సి రాసేటపుడు సమయపాలన విషయంలో శ్రద్ధ వహించాలి.
- పరాన్న జీవుల జీవిత చరిత్రలు నాలుగూ వదలకుండా చదవాలి.
- పర్యావరణ శాస్త్రంలోని ప్రశ్నలకు రాసే సమాధానాలకు హెడ్డింగులు ముఖ్యం.
- రెండో సంవత్సరంలో 60కి 60 మార్కులు సాధించాలంటే అన్ని యూనిట్లనూ చదవాలి. 2 మార్కుల ప్రశ్నలకు పాఠ్యపుస్తకంలోని అన్ని ప్రశ్నలూ చదవాలి.
- దంతం నిలువుకోత, నాడీ దండం అడ్డుకోత పటాలను సాధన చేయాలి.
- జన్యుశాస్త్రం, ప్రత్యుత్పత్తి వ్యవస్థ యూనిట్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. సాధారణంగా 24 మార్కుల వరకు వీటి నుంచి వస్తాయి.
- కనీసం 30 మార్కులు తెచ్చుకోవాలనుకునేవారు పై రెండు యూనిట్లూ, నిర్మాణ సామ్య అవయవాలు, క్రియాసామ్య అవయవాలు, ఉత్పరివర్తన సిద్ధాంతం వంటి ముఖ్యమైన 4 మార్కుల ప్రశ్నలు సాధన చేయాలి. ఇలాంటివారు 8వ యూనిట్లలో కొన్ని ముఖ్యమైనవి.. కాన్సర్, ఎలిసా వంటివి చూసుకుంటే సరిపోతుంది.
- ప్రతి సమాధానం తరువాత గీత గీయాలి.
- ప్రశ్నల సంఖ్యను గీతకు లోపలే స్పష్టంగా రాయాలి.
- సైనోవియల్ కీలు పటం కూడా సాధన చేయాలి.

చేయకూడనివి

- ఒక విభాగంలో కొన్ని ప్రశ్నలు, మరో విభాగంలోవి కొన్ని.. ఇలా చేసుకుంటూ వెళ్లకూడదు.
- ప్రశ్న సంఖ్య స్పష్టంగా గీత గీసి, దాని లోపల రాయాలి. లేదంటే మూల్యాంకనం చేయరు.
- కొట్టివేతలు లేకుండా జాగ్రత్తపడాలి.
- ఒకే సమాధానానికి ఎక్కువ సమయం కేటాయించకూడదు.
- 8 మార్కుల ప్రశ్నలకు పటాలను అశ్రద్ధ చేయకూడదు. కనీసం 2 మార్కులు దానికే ఉంటాయి.
- పటంలో భాగాలు గుర్తించేటపుడు అన్నివైపులా రాసి, చదవడానికి ఇబ్బందిపడేలా ఉండకూడదు.
- 8 మార్కుల ప్రశ్నలు కేవలం 3, 4 చదివి వెళ్లడం ప్రమాదకరం.
- 8 మార్కుల ప్రశ్నలకు సమాధానం రాసేటపుడు ముందుగా సరిగారాని ప్రశ్నలను రాయకూడదు.
- అకశేరుకాలు, సకశేరుకాలు (3, 4 యూనిట్లు) చదివేటపుడు మరీ ఎక్కువ సమయం కేటాయించడం అనవసరం.
- రెండో సంవత్సరంలో జన్యుశాస్త్రంలో 8 మార్కుల ప్రశ్నలకు సమాధానాల్లోనూ పట సాయంతో రాయడం మర్చిపోకూడదు. ఏ యూనిట్‌నూ వదిలేయకూడదు.

ఇంటర్మీడియట్‌లో ఆప్షనల్ సబ్జెక్టుల్లో మార్కులకు పోటీ పరీక్షల్లో వెయిటేజి ఉంది కాబట్టి, అత్యధిక మార్కులను సాధించడం అవసరం. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం వృక్ష శాస్త్ర సబ్జెక్టులో అత్యధిక మార్కులను సాధించడానికి కొన్ని మెలకువలు పాటించాలి. సాధారణ స్థాయి విద్యార్థి కూడా దీనివల్ల అదనంగా మార్కులను పొందగలుగుతాడు.

మొదటి సంవత్సరంలో 1) పుష్పించే మొక్కల స్వరూపశాస్త్రం 2) మొక్కల ప్రత్యుత్పత్తి 3) మొక్కల అంతర్నిర్మాణ శాస్త్రాల నుంచి దీర్ఘ సమాధాన ప్రశ్నలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది.

జీవ ప్రపంచంలో వైవిధ్యం, ఆవృత బీజాల వర్గీకరణ శాస్త్రం, కణ నిర్మాణం, విధులు వృక్ష ఆవరణ శాస్త్రాల నుంచి స్వల్ప సమాధాన ప్రశ్నలు ఎక్కువగా రావొచ్చు. అతి స్వల్ప సమాధానాల ప్రశ్నల కోసం అన్ని అధ్యాయాలూ చదవాల్సిందే.

చేయాల్సినవి..

- ప్రశ్నపత్రంలోని దీర్ఘ సమాధాన/స్వల్ప సమాధాన/అతిస్వల్ప సమాధాన ప్రశ్నలను మొదట ఒకసారి చదవాలి. వాటిలో బాగా రాయగలమని భావించే ప్రశ్నలను మార్క్ చేసుకోవాలి.
- అతిస్వల్ప సమాధాన ప్రశ్నలు (10) ఒకే దగ్గర రాయాల్సి ఉంటుంది, వాటిని మొదటే రాయాలనేం లేదు.
- అతిస్వల్ప సమాధాన ప్రశ్నలకు జవాబులను క్లుప్తంగా రాసి, వాటిలోని ముఖ్యపదాల కింద గీత గీయాలి.
- స్వల్ప సమాధాన ప్రశ్నలకు జవాబును సాధ్యమైనంతవరకు, అవసరాన్ని బట్టి పటం ద్వారా వివరించండి.
- పటాలను పేజీలో మధ్యస్థంగా వేయాలి, వాటి భాగాలను సరైన క్రమంలో కుడివైపు మాత్రమే సూచించాలి.
- దీర్ఘ సమాధానాల జవాబులకు కచ్చితంగా పటాలను వేయాలి. సమాధానాలను పాయింట్లుగా రాయాలి. పేరాగ్రాఫ్‌గా రాయకూడదు.
- 60 మార్కులను సాధించడానికి అతిస్వల్ప సమాధాన ప్రశ్నలను జాగ్రత్తగా, పూర్తిగా చదివి, సమాధానం రాయాలి.
- శాస్త్రీయ నామాలను వేర్వేరుగా కింద గీత గీస్తూ రాయాలి.
- ప్రథమ సంవత్సరంలో ఒక అతిస్వల్ప సమాధాన ప్రశ్న క్రోమోసోమ్‌ల సంఖ్య లేదా ప్లాయిడీ లేదా కణవిభజనకు సంబంధించి వస్తుంది.
- అంతర్నిర్మాణ శాస్త్రానికి సంబంధించిన పటాలను కలర్ పెన్సిళ్లు వాడి. వివిధ భాగాలను వేర్వేరుగా గుర్తించాలి.
- ద్వితీయ సంవత్సరంలోని దీర్ఘ సమాధాన ప్రశ్నల్లో, క్రెబ్స్ వలయం. కాల్విన్ వలయాల్లోని చర్యలను విడిగా, ఎంజైమ్ పేర్లతో సహా రాయాలి.
- అన్ని సమాధానాల్లో ముఖ్య పదాలను గీత ద్వారా సూచించాలి.
- అకాడమీ పుస్తకాలను శ్రద్ధగా చదివి, వాటి సమాధానాలను క్రమపద్ధతిలో రాయాలి.

చేయకూడనివి

- అతిస్వల్ప సమాధాన ప్రశ్నలను 1 నుంచి 10 వరకు వేర్వేరు స్థానాల్లో రాయకూడదు.
- ప్రశ్నను పూర్తిగా చదవకుండా, సమాధానాన్ని ప్రారంభించకూడదు.
- సమాధానాలను రాసేటప్పుడు ఆ ప్రశ్నను తిరిగి రాయాల్సిన అవసరం లేదు. ప్రశ్న సంఖ్య సూచిస్తే సరిపోతుంది.
- దీర్ఘ సమాధానాలను పేరాగ్రాఫ్ రూపంలో రాయొద్దు.
- బుక్‌లెట్‌లో 24 పేజీలు ఉంటాయి, కాబట్టి సమాధానాలను వరుస క్రమంలో పేజీలు మధ్యలో వదలకుండా రాయండి.
- స్వల్ప సమాధాన ప్రశ్నల సమాధానాలు, పటాలు వేర్వేరు స్థానాల్లో వేయొద్దు.
- బ్లూ లేదా బ్లాక్ పెన్‌ను మాత్రమే సమాధానాలకు ఉపయోగించాలి.
- ఆన్సర్ బుక్‌లెట్‌లో ఎక్కడ కూడా హాల్‌టికెట్ నంబరు, పేరు రాయకూడదు.
- సమాధానాలను విడతలవారీగా రాయొద్దు.
- పటాలను పెన్సిల్ లేదా కలర్ పెన్సిల్‌లతో మాత్రమే వేయాలి. స్కెచ్‌పెన్‌తో వేయకూడదు.

కనీసం 30 మార్కులు సాధించడానికి :

దీర్ఘ సమాధాన ప్రశ్నలను పుష్పించే మొక్కల స్వరూపశాస్త్రం, పుష్పించే మొక్కల్లో లైంగిక ప్రత్యుత్పత్తి- చదివితే సరిపోతుంది. స్వల్ప, అతిస్వల్ప సమాధాన ప్రశ్నల కోసం ముఖ్యమైనవి- ఆవృత బీజాల వర్గీకరణ శాస్త్రం, కణచక్రం, కణ విభజన, వృక్ష ఆవరణ శాస్త్రం.

ద్వితీయ సంవత్సరంలో 1) మొక్కల్లో కిరణజన్య సంయోగక్రియ 2) మొక్కల్లో శ్వాసక్రియ 3) జీవ సాంకేతిక శాస్త్రం, సూత్రాలు- ప్రక్రియలు 4) ఆహారోత్పత్తి అధికం చేసే వ్యూహాల నుంచి దీర్ఘ సమాధాన ప్రశ్నలు రావొచ్చు.

వృక్ష శరీరధర్మ శాస్త్రం, సూక్ష్మజీవ శాస్త్రం, జన్యు శాస్త్రం, అణుజీవ శాస్త్రం, జీవ సాంకేతిక శాస్త్రాల నుంచి స్వల్ప సమాధాన ప్రశ్నలు ఎక్కువగా రావొచ్చు. అతి స్వల్ప సమాధాన ప్రశ్నల కోసం అన్ని యూనిట్లూ తప్పనిసరిగా చదవాల్సి ఉంటుంది.

కనీసం 30 మార్కులు సాధించడానికి వృక్ష శరీరధర్మ శాస్త్రంలోని స్వల్ప, అతిస్వల్ప, దీర్ఘ సమాధాన ప్రశ్నలు, సూక్ష్మ జీవశాస్త్రంలో స్వల్ప, అతిస్వల్ప సమాధాన ప్రశ్నలు, జన్యు శాస్త్రంలో స్వల్ప, అతిస్వల్ప సమాధాన ప్రశ్నలు తప్పనిసరిగా చదవాలి.



ఉద్యోగావకాశాలు



నేషనల్ సీడ్స్ కార్పొరేషన్‌లో 260 ఉద్యోగాలు

న్యూఢిల్లీలోని నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 260 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాల వారీ ఖాళీలు: డిప్యూటీ జనరల్ మేనేజర్ (విజిలెన్స్)-1, అసిస్టెంట్ (లీగల్) గ్రేడ్ 1-4, మేనేజ్‌మెంట్ ట్రైనీ-18, సీనియర్ ట్రైనీ-85, డిప్లొమా ట్రైనీ (ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్)-2, ట్రైనీ-132, ట్రైనీ మేట్ (అగ్రికల్చర్)-18.

అర్హత : పోస్టులను బట్టి సంబంధిత విభాగంలో ఇంటర్, ఐటీఐ, ఇంజనీరింగ్, బీఎస్సీ, పీజీ, ప్రొఫెషనల్ డిగ్రీ (లా), ఎంబీఏ ఉత్తీర్ణత. కంప్యూటర్ పరిజ్ఞానం, పని అనుభవం ఉండాలి.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో.

దరఖాస్తుకు చివరితేదీ : ఫిబ్రవరి 9, 2019.

వెబ్‌సైట్ : www.indiaseeds.com

సౌత్ వెస్ట్రన్ రైల్వేలో 81 ఉద్యోగాలు



హుబ్లీ ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న సౌత్ వెస్ట్రన్ రైల్వే ఒప్పంద ప్రాతిపదికన 81 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు...

1. సీనియర్ టెక్నికల్ అసోసియేట్ (ఎస్‌టీఏ) : 33

అర్హత : సంబంధిత విభాగంలో నాలుగేళ్ల బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణత.

2. జూనియర్ టెక్నికల్ అసోసియేట్ (జేటీఏ) : 48

అర్హత : సంబంధిత విభాగంలో డిప్లొమా/ బీఎస్సీ ఉత్తీర్ణత.

వయసు : ఎస్‌టీఏ పోస్టులకు 20-33 ఏళ్లు, జేటీఏ పోస్టులకు 18- 33 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక : ఎస్‌టీఏ పోస్టులకు గేట్ స్కోర్, జేటీఏ పోస్టులకు విద్యార్హతలో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు ఫీజు : రూ.100.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ : ఫిబ్రవరి 1, 2019

వెబ్‌సైట్ : www.rrchubli.in

ఆర్మీ-ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్

ఇండియన్ ఆర్మీ ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ 46వ కోర్సు ద్వారా షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు : 55 (ఎన్‌సీసీ పురుషులు-50, మహిళలు-5).

అర్హత : కనీసం 50% మార్కులతో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత. చివరి ఏడాది చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్‌సీసీ-సీ సర్టిఫికెట్‌తో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలుండాలి.

వయసు : 2019, జూలై 1 నాటికి 19-25 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక : స్టేజ్ 1, 2 పరీక్షలు, ఎస్‌ఎస్‌బీ ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో.

దరఖాస్తుకు చివరితేదీ : ఫిబ్రవరి 7, 2019.

వెబ్‌సైట్: www.joinindianarmy.nic.in

విశాలాంధ్ర బిజినెస్

-1.25 ▼ సెన్సెక్స్ 35,591.25	-0.40 ▼ నిఫ్టీ 10,651.80	400 ▲ బంగారం (విజయవాడ) 31,400 22 క్యారెట్లు, 10 గ్రాములు	బంగారం (విశాఖపట్నం) 31,680 ప్రొద్దుటూరు 31,680 22 క్యారెట్లు, 10 గ్రాములు	1,050 ▲ వెండి (విజయవాడ) 41,250 కిలో (రూపాయల్లో)	వెండి (విశాఖపట్నం) 41,400 ప్రొద్దుటూరు 42,241 కిలో (రూపాయల్లో)	డాలరు Vs రూపాయి 71.12

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
ఐసీఐసీఐ బ్యాంక్	365.90	5.49
టాటాస్టీల్	467.45	5.33
యాక్సిస్ బ్యాంక్	690.95	4.57
బజాజ్ ఫైనాన్స్	2,623.70	3.18
హిండాల్కో	206.25	3.13

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
ఇండియాబుల్స్	672.90	-3.68
అదానీపోర్ట్స్	338.15	-3.18
బజాజ్ ఆటో	2,499.70	-2.65
భారతీ ఇన్‌ఫ్రాటెల్	299.60	-2.37
కోటక్ మహీంద్ర	1,255.50	-2.33

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	71.11	71.12
యూరో	81.30	81.37
పౌండ్	93.69	93.20
ఆస్ట్రేలియా డాలర్	50.90	51.19
సింగపూర్ డాలర్	52.58	52.66

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	31,680	33,882
చెన్నై	31,680	33,882
బెంగళూరు	31,150	33,882
ముంబై	32,140	34,374
విజయవాడ	-	34,150
విశాఖపట్నం	31,680	33,800
ప్రొద్దుటూరు	31,680	33,260
ముడి చమురు	61.32	


ఫ్లాట్‌గా మార్కెట్లు

లాభపడ్డ బ్యాంకింగ్ కంపెనీలు



ముంబై: లాభనష్టాల మధ్య తీవ్ర ఊగిసలాటకు గురైన స్టాక్‌మార్కెట్లు చివరకు ఫ్లాట్‌గా ముగిశాయి. సెన్సెక్స్ నామమాత్రంగా 1.25 పాయింట్ల నష్టంతో 35,591.25 వద్ద, నిఫ్టీ 0.40 నష్టంతో 10,651.80 వద్ద స్థిర పడింది. అయితే ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ లాభాల డబుల్ సెంచరీ చేసి 35,850 వరకూ ఎగసింది. ఒక దశలో 35,490 స్థాయికి క్షీణించింది. రానున్న కేంద్ర బడ్జెట్, గురువారం ఎఫ్‌అండ్‌వో ముగింపు కారణంగా ట్రేడర్లు అప్రమత్తంగా వ్యవహరించినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. మెటల్, మీడియా, బ్యాంకుల షేర్లు లాభపడగా, ఎఫ్ఎంసీజీ, రియల్టీ, ఫార్మా 1 నుంచి 0.25 శాతం మధ్య బలహీనపడ్డాయి. ఐసీఐసీఐ, టాటా స్టీల్, యాక్సిస్ 6 నుంచి 5 శాతం మధ్య లాభపడగా.. హిందాల్కో, హెచ్‌సీఎల్ టెక్, జీ, ఎస్‌బీఐ, బజాజ్ ఫైనాన్స్, యూపీఎల్, ఎల్‌అండ్‌టీ వంటి షేర్లు 3 నుంచి 1 శాతం మధ్య లాభపడ్డాయి. అయితే ఐబీ హౌసింగ్ 5 శాతం పతనమైంది. ఇండియా బుల్స్, అదానీ పోర్ట్స్, బజాజ్ ఆటో, కొటక్ బ్యాంక్, ఇన్‌ఫ్రాటెల్, ఐవోసీ, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌పీసీఎల్, యస్ బ్యాంక్, టెక్ మహీంద్రా , సన్ ఫార్మ నష్టపోయాయి.

పెరిగిన బంగారం ధర



న్యూఢిల్లీ : బంగారం ధరల్లో పెరుగుదల కొనసాగుతోంది. బుధవారం 10 గ్రాముల బంగారం రూ.320 పెరిగి 34 వేల మార్కును దాటింది. వెండి కూడా బంగారంతో పోటీ పడతూ కేజీ ధర 41వేల మార్కును అందుకుంది. అమెరికా చైనా మధ్య వాణిజ్య చర్చలు కొలిక్కి రాకపోవడం. చైనా టెలికాం దిగ్గజం హువావేపై అమెరికి కేస్లు నేపథ్యంలో అంతర్జాతీయి మార్కెట్లలో ఇన్వెస్టర్లు ఆచి తూచి వ్యవహరిస్తూ బంగారం కొనుగోలుకు మొగ్గు చూపడంతో దేశీయంగా బంగారం ధరలు పెరిగినట్లు విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. దేశ రాజధానిలో 24 క్యారెట్ల బంగారు ధర 10 గ్రాములకు రూ.34,598 గా నమోదైంది

ప్లేగేమ్స్ 24/7 నుంచి మై11 సర్కిల్

విశాలాంధ్ర -విజయవాడ : ప్లేగేమ్స్ 24/7 తన కొత్త ఫ్యాంటసీ క్రీడల వేదిక మై 11 సర్కిల్‌ను ఆవిష్కరించింది. పూర్తిగా కొత్త తరహాలో ఫ్యాంటసీ క్రికెట్ ఆడేందుకు వీలు కల్పిస్తుంది. ఈ సరికొత్త క్రీడల యాప్‌ను ఫిబ్రవరి 1 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఒక మ్యాచ్‌లో రెండు జట్లను క్రీడాకారులను ఎంపిక చేసుకుని సొంతగా ఓ ఫ్యాంటసీ జట్టును సృష్టించుకోవచ్చు. ఇలా ఎంపిక చేసిన జట్టులోని క్రికెటర్ల ప్రదర్శన ఆధారంగా యజమానికి అద్భుత బహుమతులు లభిస్తాయి.

పేటెంట్ ఔషధాల

ధరలకు కళ్లెం



లైసెన్స్‌తో స్థానిక కంపెనీల్లో ఉత్పత్తి

న్యూఢిల్లీ: కేన్సర్‌తో సహా అరుదైన వ్యాధుల చికిత్సతో ఉపయోగించే పేటెంట్ ఔషధాల ధరలకు సంబంధించి ప్రభుత్వం నియమించిన ఉన్నతాధికారుల కమిటీ కీలక సిఫారసులు చేసింది. బహుళ జాతి (ఎంఎన్‌సీ) కంపెనీలు ఎక్కువగా ఉత్పత్తి చేసే ఈ ఔషధాల ధరలకు కళ్లెం వేయడంతోపాటు, దేశీయంగా వీటిని ఉత్పత్తి చేసేందుకు స్థానిక కంపెనీలకు 'తప్పని సరి లైసెన్స్'లు జారీ చేయాలని కోరింది. లేకపోతే ఈ వ్యాధులతో బాధపడే వారికి అందుబాటు ధరల్లో ఔషధాలు అందించడం కష్టమవుతుందని పేర్కొంది. గత సంవత్సరం మార్చిలోనే వివిధ మంత్రిత్వ శాఖలకు చెందిన జాయింట్ సెక్రటరీలతో కూడిన ఈ కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. మన దేశంలో ఈ ఔషధాల ధరలు నియంత్రించేందుకు కొనుగోలు శక్తి (పీపీపీ) ఆధారంగా పశ్చిమ దేశాల్లో అనుసరిస్తున్న విధానాన్ని అనుసరించాలని సూచించింది. ఆయా ఔష ధాలకు ఏ దేశంలో తక్కువ ధర ఉంటే దాన్ని ప్రామాణి కంగా తీసుకుని మన దేశంలోనూ వాటి ధరలను ఆ స్థాయిలో కట్టడి చేయాలని కోరింది. దేశంలో మార్కెట్ చేసే పేటెంట్ ఔషధాలను ఐదేళ్ల పాటు ఔషధ ధరల నియంత్రణ చట్టం నుంచి మినహాయిస్తూ ఈ నెల 3న కేంద్ర ఔషధాల శాఖ (డీఓపీ) ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు వెలువడిన కొద్ది రోజులకే ఈ కమిటీ నివేదిక విషయాలు బయటికి రావడం విశేషం.

చరిత్ర పరిశీలిద్దాం..

బహుళ జాతి ఔషధ కంపెనీలు మేధో సంపత్తి హక్కుల(ఐపీఆర్) పేరుతో భారత్‌లో తమ పేటెంట్ ఔషధాల ధరలపై నియంత్రణను వ్యతిరేకిస్తున్నాయి. అలాగే మరో స్థానిక కంపెనీ జనరిక్ వెర్షన్‌లో ఆ ఔషధాలు ఉత్పత్తి చేసేందుకు 'తప్పనిసరి లైసెన్స్' జారీ చేయడాన్ని తీవ్రంగా ఆక్షేపిస్తున్నాయి. ప్రభుత్వం తమ మాట వినకపోతే భారత్‌లో ఆ ఔష ధాల అమ్మకాలను ఆపేస్తామని హెచ్చరిస్తున్నాయి. అమెరికా, యూరోపియన్ కంపెలైతే ఇందుకోసం తమ ప్రభుత్వాల ద్వారానూ ఒత్తిడి తెస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ కమిటీ సిఫారసులను అమలు చేస్తుందా? లేదా? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

నియంత్రణ ఎందుకు?

ఏదైనా ఒక ఔషధానికి పేటెంట్ జారీ చేస్తే భారత పేటెంట్ చట్టం ప్రకారం ఆ పేటెంట్ 20 సంవత్సరాల పాటు చెల్లుబాటవుతుంది. ఈ కాలంలో మరే కంపెనీ ఆ ఔషధాన్ని ఉత్పత్తి చేసేందుకు చట్ట ప్రకారం అవకాశం ఉండదు. దీంతో ఆ ఔషధానికి కంపెనీ ఎంత ధర నిర్ణయిస్తే అంత ధర చెల్లించాల్సిందే. అయితే ప్రభుత్వం ఏదైనా దేశీయ కంపెనీకి, పేటెంట్ ఔషధానికి జనరిక్ వెర్షన్‌ను తయారు చేసేందుకు 'తప్పనిసరి లైసెన్స్' జారీ చేయవచ్చు. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) ట్రిప్స్ ఒప్పందం కూడా ఇందుకు వెసులుబాటు కల్పించింది. 2012లో నాట్కో ఫార్మాకు ఇలానే బేయర్ కంపెనీ ఉత్పత్తి చేసే 'సొరాఫినిబ్ టొసిలేట్' అనే క్యాన్సర్ ఔషధం జెనరిక్ వెర్షన్ తయారీకి లైసెన్స్ ఇచ్చింది. లివర్, కిడ్నీ కేన్సర్ల ట్రీట్‌మెంట్ కోసం వాడే ఈ ఔషధాన్ని అప్పట్లో బేయర్ కంపెనీ ఉత్పత్తి చేసి మార్కెట్ చేసేది. అందుకు కేన్సర్ రోగులు నెలకు రూ.2.8 లక్షల వరకు ఖర్చు పెట్టాల్సి వచ్చేది. నాట్కో ఫార్మా అదే మందును జనరిక్ వెర్షన్‌లో రూ.8,880కు తయారు చేసి సరఫరా చేసింది.

అందుకే ఐఫోన్ అమ్మకాలు తగ్గాయి : కుక్



శాన్‌ఫ్రాన్సిస్కో: కొంతకాలంగా భారత్‌లో ఐఫోన్ విక్రయాలు క్రమంగా తగ్గుతున్నాయి. ఇందుకు కారణం లేక పోలేదని యాపిల్ సీఈవో టీమ్ కుక్ చెప్పారు. భారత్ పేరును నేరుగా ప్రస్తావించకుండానే డాలర్ విలువ, బ్యాటరీ రీప్లేస్‌మెంట్ ప్రోగ్రామ్ తదితర అనేక కారణాల వల్ల అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఐఫోన్ విక్రయాలు పెరగట్లేదని కుక్ అభిప్రాయపడ్డారు. కంపెనీ ఆదాయ వ్యయాలపై కుక్ మార్కెట్ విశ్లేషకులతో మాట్లాడారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఐఫోన్ ఆదాయం 15శాతం తగ్గిందని, దీనికి అనేక కారణాలున్నాయని కుక్ చెప్పారు. అందులో ఒకటి.. అమెరికా డాలర్ విలువ బలపడుతుండటం. అంతర్జాతీయ మార్కెట్లలో డాలర్ విలువ పెరగడంతో తమ ఉత్పత్తుల ధర పెరుగుతోంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ధరల మోత ఎక్కువగా ఉంటోంది. దీంతో కస్టమర్లు ఐఫోన్లు కొనేందుకు ఆసక్తి చూపించటం లేదని కుక్ వాదించారు. ఇక తమ కంపెనీ అందిస్తున్న బ్యాటరీ రీప్లేస్‌మెంట్ ప్రోగ్రామ్ కూడా విక్రయాలు తగ్గడానికి మరో కారణమని ఆయన అన్నారు. లక్షల మంది కస్టమర్లకు తాము బ్యాటరీలను ఉచితంగా రీప్లేస్ చేస్తున్నామని, దీంతో కస్టమర్లు తమ పాత ఐఫోన్లను ఎక్కువ కాలం వాడుతున్నారని కుక్ వివరించారు. విక్రయాలు పెంచేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టామని కుక్ తెలిపారు. చైనాలో ఐఫోన్ ధరలు తగ్గించామని, భారత్‌లోనూ ధరలు తగ్గించే యోచనలో ఉన్నట్లు వెల్లడించారు.



బ్యాంకులో స్పైడర్ మ్యాన్

సావోపోలో : బ్యాంకు ఉద్యోగులు పని ఒత్తిడితో, విధులకు అంకితమై కనిపించడం సహజం. అయితే ఓ ఉద్యోగి వినూత్న దస్తులతో కార్యాలయానికి వచ్చి అందరినీ ఆశ్చర్యపర్చాడు. బ్రెజిల్‌లోని సావోపాలో ప్రాంతంలోని బ్యాంకులో ఉద్యోగం చేస్తోన్న అతను.. ఉద్యోగానికి రాజీనామా చేయడంతో చివరి పనిదినం రోజున సూపర్ హీరో స్పైడర్ మ్యాన్ దుస్తులతో వచ్చాడు. ఉద్యోగులతో కలివిడిగా తిరుగుతూ తన చివరి రోజును హుషారుగా గడిపాడు. దానికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. 51 సెకన్ల పాటు ఉన్న ఆ వీడియోలో ఆ బ్యాంకర్ సహోద్యోగుల వద్దకు వెళుతూ..వారికి ఏదో ఇస్తున్నట్లు కనిపిస్తుంది. ఓ వ్యక్తిని ఆలింగనం చేసుకున్నాడు. అతడు అలా తిరిగేస్తుంటే మిగిలిన ఉద్యోగులు తమ ఫోన్లలో రికార్డు చేస్తూ కనిపించారు.

బజాజ్ ఆటో మెరుగైన ఫలితాలు



ముంబై: దేశీయ ఆటో రంగ దిగ్గజం బజాజ్ ఆటో మెరుగైన ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2018-19) మూడో త్రైమాసికంలో రెండంకెల వృద్ధిని సాధించింది. ఈ ఏడాది క్యూ3 (అక్టోబర్-డిసెంబర్)లో ద్విచక్ర తయారీదారు బజాజ్ ఆటో నికర లాభం 16 శాతం పుంజుకుని రూ. 1102 కోట్లను నమోదు చేసింది. మొత్తం ఆదాయం సైతం 16 శాతం పెరిగి రూ. 7409 కోట్లను తాకింది. గత ఏడాది రెవెన్యూ 6387 కోట్ల రూపాయలుగా ఉంది. నిర్వహణ లాభం రూ. 1246 కోట్లకు చేరగా.. ఇతర ఆదాయం రూ. 209 కోట్ల నుంచి రూ. 470 కోట్లకు ఎగసింది. మార్జిన్లు 19.5 శాతం నుంచి 15.6 శాతానికి బలహీన పడ్డాయి. బజాజ్ తాజా ఫలితాలు విశ్లేషకుల అంచనాలను అందుకున్నప్పటికీ దలాల్ స్ట్రీట్‌ను మెప్పించలేకపోయింది. ఇన్వెస్టర్ల అమ్మకాలతో బజాజ్ ఆటో షేరు దాదాపు 2 శాతం నష్టపోయింది. అయితే మార్జిన్లు క్షీణించడంతో ఈ కౌంటర్లో అమ్మకాలు తలెత్తినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు.

డిజిటల్ చెల్లింపులకు కేవైసీల సమస్య..!



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న డిజిటల్ ఇండియాలో భాగంగా నగద రహిత డిజిటల్ చెల్లింపుల కార్యక్రమానికి కేవైసీల సేకరణ అడ్డుకట్ట వేయనుంది. ప్రభుత్వ కొత్త నియమాల పట్ల ఈ-కామర్స్ సంస్థలు కొంత అసహనం వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు అటువంటి నియమాల వల్లే నోట్ల రద్దు సమయంలో బాగా ప్రాచుర్యంలోకి వచ్చిన ఈ-వ్యాలెట్ల వ్యవస్థ ఫిబ్రవరి నెలాఖరకు ఖాళీ కానుంది. ఆర్‌బీఐ నియమాల ప్రకారం వినియోగదారుడు నుంచి కేవైసీ తప్పనిసరి చేయడంతో, కేవైసీ ఫారాలను సేకరించేందుకు కంపెనీలు తలలు పట్టుకుంటున్నాయి. ఆధార్ తప్పని సరికాదని సుప్రీం కోర్టు చెప్పడంతో కంపెనీలకు కేవైసీ సేకరణ కష్టమవుతోంది. ఇప్పటి వరకూ నామమాత్ర కేవైసీ ద్వారా వినియోగదారుడికి చెల్లింపుల సమయంలో సంస్థలు ఓటీపీ అందించేవి. కానీ రిజర్వు బ్యాంకు నిర్ణయంతో పూర్తి కేవైసీ సేకరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పేటియం, అమెజాన్ పే వంటి ఈ వ్యాలెట్లు తీవ్రంగా నష్టపోనున్నాయి. ఫిబ్రవరి నెలాఖరు గడువు పెంచేందుకు బ్యాంకర్లతో చర్చలు జరుపుతున్నా ఫలితం కనిపించడం లేదు. ఇటీవల కాలంలో యూపీఐ యాప్‌లను వినియోగదారులు ఎక్కువగా వాడుతున్నారు. వీటి ద్వారా నేరుగా అకౌంటు నుంచి అకౌంటుకు డబ్బులు చెల్లించవచ్చు. దీంతో భారీ ఈ-వ్యాలెట్ సంస్థల వ్యాపారం చిన్నబోతోంది. ఇంకా కేవైసీ ఇవ్వాల్సిన వినియోగదారులు 80 శాతం మేర ఉండడంతో అమెజాన్ వంటి సంస్థలు అవసరమైన డాక్యుమెంట్లు సమకూర్చుకోవడానికి వినియోగదారుడి ఇంటికి స్వయంగా వెలుతున్నాయి.

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌ల్లో

మైక్రోసాఫ్ట్ సర్ఫేస్ ల్యాప్‌టాప్‌లు

విశాలాంధ్ర - విజయవాడ : మైక్రోసాఫ్ట్ సర్ఫేస్ ప్రో 6, ల్యాప్‌టాప్‌లు ఇప్పుడు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు మైక్రోసాఫ్ట్ ఇండియా జనరల్ మేనేజర్ ప్రియదర్శి మహాపాత్రో తెలిపారు. క్రోమా, రిలయన్స్, విజయ సేల్స్ ఇతర రిటైల్ అవుట్‌లెట్స్‌లలో కూడా లభిస్తాయి. సర్ఫేస్ పవర్ విండోస్, ఆఫీస్‌లు క్లౌడ్ ద్వారా అనుసంధానం చేశారు. నచ్చిన యాప్స్ ద్వారా వివిధ సీరియళ్లను వీక్షించవచ్చు. ఆఫీస్ 365లో కృత్రిమమైన మేధస్సును అందించడానికి కావాల్సిన ఏర్పాట్లు ఉన్నాయి. విండో 10 మీద పాస్‌వర్డ్ ఫ్రీ, విండో హెలో నైన్ ఇన్ తదితర ఫీచర్లు ఉన్నాయి. 770 గ్రాముల బరువు, 165 డిగ్రీల కిక్ స్టాండ్‌తో ఉన్న ఈ పరికరం ఏ ప్రదేశంలోనైనా వాడటానికి అనువుగా ఉంటుంది. సర్ఫేస్ ప్రో రూ.83,999ల వేల 999 రూపాయల్లో లభిస్తుంది. సర్ఫేస్ ప్రో 6 ధర లక్షా పదివేలు రూపాయలు కాగా...అనేక మోడళ్లు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ అందుబాటులో ఉన్నాయి.

గుడ్ ఫ్రే ఫిలిప్స్‌కు ప్రతిభా పురస్కారం

విశాలాంధ్ర - విజయవాడ : ప్రకాశం జిల్లా ఏడుగుండ్లపాడును ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దిన గుడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా ప్రతినిధులకు ప్రకాశం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినయ్ చంద్ ప్రతిభా పురస్కారం ప్రదానం చేశారు. కమ్యూనిటీ అభివృద్ధి కార్యక్రమం కింద గుడ్ ఫ్రే ఫిలిప్స్ సంస్థ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిధిలో 65పైగా గ్రామాల్లో రెండు లక్షల మందికి లబ్ధి చేకూరిందని ప్రశంసించారు. గుడ్ ఫ్రే ఫిలిప్స్ కార్పొరేట్ వ్యవహారాల ఉపాధ్యక్షుడు హర్మంజిత్ సింగ్ మాట్లాడుతూ, 'ప్రభుత్వ గుర్తింపు తమ హృదయాలను తాకిందని, అన్ని రంగాల్లో సామాజిక వర్గాల సంక్షేమానికి చర్యలు తీసుకున్నామని, సుస్థిర ప్రగతి లక్ష్యాల సాధనలో ఏడుగుండ్లపాడు ఆదర్శ గ్రామంగా నిలిచింది' అని పేర్కొన్నారు.

సర్వీస్‌నౌ అకడమిక్ ప్రోగ్రాం ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: సర్వీస్ నౌ, తెలంగాణ అకడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్)ల మధ్య కుదిరిన ఒప్పందంతో సర్వీస్‌నౌ అకడమిక్ ప్రోగ్రామ్ ప్రారంభమైంది. విద్యాసంస్థలు, ప్రముఖ ఐటీ కంపెనీలతో కలిసి కొత్త గ్రాడ్యుయేట్లు పరిశ్రమ డిమాండుకు తగిన రీతిలో నైపుణ్యాలు సంతరించుకోవడానికి, ఇంజనీరింగ్ విద్యార్థులకు కచ్చితమైన ఉద్యోగావకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో సర్వీస్ నౌ అకడమిక్ ప్రోగ్రామ్‌ను రూపొందించినట్లు సర్వీస్ నౌ ఇంజినీరింగ్ విభాగం ఉపాధ్యక్షులు రావు సూరపనేని, టాస్క్ సీఈఓ సుజీప్ నాయర్‌లు తెలిపారు. ఇంటర్నేషనల్ డాటా కార్పొరేషన్ (ఐడీసీ), సిస్కో చేసిన సంయుక్త సర్వే ప్రకారం 2027 నాటికి ఐటీ పరిశ్రమలో మరో 1.4 మిలియన్ల ఉద్యోగాల కల్పన జరగనుందనే అధ్యయనం వెలువడిన తరుణంలో సర్వీస్ నౌ అకడమిక్ ప్రోగ్రామ్ ప్రవేశపెట్టామన్నారు.

ఎస్ఎంఈల కోసం

టాటా టెలీ పరిష్కారాలు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: దేశ అగ్రగామి ఎంటర్‌ప్రైజ్ కనెక్టివిటీ సొల్యూషన్ ప్రొవైడర్ అయిన టాటా టెలీ బిజినెస్ సర్వీసెస్ (టీటీబీఎస్) తాజాగా ఎస్ఎంఈల కోసం మెరుగుపర్చిన సెక్యూరిటీ సర్వీసెస్, ప్రైవసీ శక్తి సామర్థ్యాలతో స్మార్ట్ వీపీఎస్ పరిష్కారాలను ప్రవేశపెట్టింది. విశ్వసనీయతతో, భద్రతతో అనుసంధానం కావడాన్ని ఇది ఆయా సంస్థలకు మరింత సులభం చేస్తుంది. స్మార్ట్ వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్ (విపిఎన్) అనేది ఒక పబ్లిక్ క్లౌడ్ నెట్‌వర్క్‌ను ప్రైవేటైజ్ చేస్తుంది. ప్రైవేట్ నెట్‌వర్క్ సెక్యూరిటీని దానికి అందిస్తుంది.

రిలయన్స్ జ్యువెల్స్ ప్రదర్శన నేడు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: అత్యంత విశ్వసనీయమైన ఆభరణాల బ్రాండ్లలో ఒకటైన రిలయన్స్ జ్యువెల్స్ తమ ఎలైట్ గోల్డ్, డైమండ్ ఆభరణాల కలెక్షన్స్‌ను గోదావరిఖనిలో గురువారం ప్రదర్శించనుంది. ఈ ప్రదర్శనలో ప్రత్యేక డిజైన్లతో కూడిన విస్తృతశ్రేణి నెక్లెస్‌లు, చెవి రింగులు, గాజులు, యాంటిక్ గోల్డ్‌లో రింగులు, కుందన్, క్లాసిక్‌ఎల్లో గోల్డ్ డిజైన్స్, ఫిలిగ్రీ, సున్నితమైన వజ్రాల శ్రేణి, అసాధారణ పనితనం కలిగిన మరెన్నో ఆభరణాలు ఉన్నట్లు సంస్థ బుధవారం ప్రకటనలో తెలిపింది. ఆభరణాల ప్రేమికుల కోసం ఒన్ స్టాప్‌షాప్‌గా ఈ బ్రాండ్ తమ అభిమానులకు సంప్రదాయపరంగా తీర్చిదిద్దిన 100 శాతం ప్యూర్ గోల్డ్ జ్యువెలరీని, అంతర్జాతీయ సర్టిఫైడ్ డైమండ్ జ్యువెలరీ డిజైన్స్‌ను అందిస్తుంది.

భారత్‌కు విదేశీ కరెన్సీ స్మగ్లింగ్

పాక్ సింగర్‌కు ఈడీ నోటీసులు



ఇస్లామాబాద్: ప్రముఖ పాకిస్థానీ గాయకుడు రహత్ ఫతే అలీ ఖాన్‌కు ఈడీ నోటీసులు జారీ చేసింది. మూడేళ్లుగా విదేశీ కరెన్సీని భారత్‌కు స్మగ్లింగ్ చేస్తున్నారంటూ ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఎఫ్ఈఎంఏ (ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్) కింద ఆయనకు బుధవారం నోటీసులు జారీ అయ్యాయి. ఈ అక్రమాల ద్వారా ఆయనకు రూ.2.42 కోట్లు ముట్టాయని, వాటి నుంచి రూ.1.6 కోట్లు స్మగ్లింగ్ చేశారని ఓ మీడియా వెల్లడించింది. ఈ కేసుపై ఈడీ దర్యాప్తు కొనసాగుతోంది. ఒకవేళ ఈ నోటీసులకు ఖాన్ స్పందించకపోతే ఈడీ ఆయనకు జరిమానా విధిస్తుంది. జరిమానా చెల్లించకపోతే ఆయనపై లుకౌట్ నోటీసులు జారీ అవుతాయి. దాంతో ఆయన భారత్‌లో ఎక్కడా ప్రదర్శనలు ఇవ్వడానికి అవకాశం లేదు. ఖాన్‌పై ఇలాంటి ఆరోపణలు రావడం ఇది మొదటిసారి కాదు. 2011లో భారత్‌కు వస్తుండగా ఢిల్లీ విమానాశ్రయంలో ఆయన వద్ద రూ.89.1 లక్షలు లెక్కలోకి రాని నగదు ఉన్నట్లు తెలిసింది. దాంతో ఎయిర్‌పోర్ట్ అధికారులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. పాకిస్థాన్‌లోని ఫైసలాబాద్‌కు చెందిన రహత్ ఫతే అలీ ఖాన్ తన గాత్రంతో భారత్‌లోనూ గుర్తింపు తెచ్చుకున్నారు.

3 కొత్త అసుస్ ల్యాప్‌టాప్‌లు



ముంబై : అసుస్ కంపెనీ జెన్‌బుక్ సిరీస్‌లో కొత్త ల్యాప్‌టాప్‌లను భారత మార్కెట్‌లో బుధవారం విడుదల చేసింది. జెన్‌బుక్ 13, 14, 15 మోడల్స్‌లో ఈ ల్యాప్‌టాప్‌లు విడుదలయ్యాయి. వీటిల్లో ఇంటెల్ కోర్ ఐ5/ఐ7 8వ జనరేషన్ ప్రాసెసర్, ఎన్‌వీడియా జీటీఎక్స్ 1050 మ్యాక్స్-క్యూ గ్రాఫిక్స్, 8/16 జీబీ ర్యామ్, 256/512 జీబీ/1 టీబీ ఎస్ఎస్‌డీ, యూఎస్‌బీ టైప్ సి, డ్యుయల్ బ్యాండ్ వైఫై, 3డీ హెచ్‌డీ వెబ్ కెమెరా, బ్లూటూత్ 5.0, 13 గంటల బ్యాటరీ లైఫ్ తదితర ఫీచర్లను అందిస్తున్నారు. జెన్‌బుక్ 13 ప్రారంభ ధర రూ.71,990 ఉండగా, జెన్‌బుక్ 14 ప్రారంభ ధర రూ.72,990, జెన్‌బుక్ 15 ప్రారంభ ధర రూ.1,39,990 గా ఉంది. ఫ్లిప్‌కార్ట్‌లో ఎక్స్‌క్లూజివ్‌గా ఈ ల్యాప్‌టాప్‌లను విక్రయిస్తున్నారు.

మార్కెట్లోకి రియల్ మి సి1



న్యూఢిల్లీ : ఒప్పోకు చెందిన సబ్‌బ్రాండ్ రియల్ మి నుంచి రియల్ మి సి1 (2019) పేరిట ఓ నూతన స్మార్ట్‌ఫోన్ విడుదలైంది. ఇందులో 6.2 ఇంచుల భారీ డిస్‌ప్లేను ఏర్పాటు చేశారు. వెనుక భాగంలో 13, మెగాపిక్సల్ కెమెరాలు రెండు ఉన్నాయి. ముందు భాగంలో 5 మెగాపిక్సల్ కెమెరాను ఏర్పాటు చేశారు. ఈ ఫోన్‌లో ఫింగర్ ప్రింట్ సెన్సార్ లేదు కానీ ఫేస్ అన్‌లాక్ ఫీచర్‌ను అందిస్తున్నారు. ఈ ఫోన్‌లో డెడికేటెడ్ డ్యుయల్ సిమ్, మైక్రో ఎస్‌డీ స్లాట్లను ఏర్పాటు చేశారు. డ్యుయల్ 4జీ వీవోఎల్‌టీఈ ఫీచర్‌ను ఈ ఫోన్‌లో అందిస్తున్నారు. 4230 ఎంఏహెచ్ భారీ బ్యాటరీని ఈ ఫోన్‌లో ఏర్పాటు చేశారు. రియల్ మి సి1 (2019) ఫోన్ ఓషియన్ బ్లూ, డీప్ బ్లాక్ కలర్ ఆప్షన్లలో విడుదల కాగా ఈ ఫోన్‌కు చెందిన 2జీబీ ర్యామ్ వేరియెం ట్‌ను రూ.7,499 ధరకు, 3జీబీ ర్యామ్ వేరియెంట్‌ను రూ.8499 ధరకు ఫిబ్రవరి 5వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి ఫ్లిప్‌కార్ట్ సైట్‌లో ఎక్స్‌క్లూజివ్‌గా విక్రయించనున్నారు.

91 శాతం నష్టాలతో ఇండియన్ ఆయిల్

క్యూ3 ఫలితాలు ప్రకటన



న్యూఢిల్లీ : భారత పెట్రోలియం కంపెనీ ఇండియన్ ఆయిల్ మూడో త్రైమాసికంలో భారీ నష్టాలపాలైంది. క్యూ3 ఫలితాలను ప్రకటించగా.. నికర లాభాల్లో 91 శాతం నష్టపోయి రూ.716.82 కోట్లు ఆర్జించినట్లు ప్రకటనలో తెలిపింది. అయితే గత ఏడాది క్యూ3లో రూ.7883.22 కోట్ల లాభాలు రాగా ఈ ఏడాది భారీ నష్టాలను చూసింది. అక్టోబర్- డిసెంబర్ మధ్య మొత్తం ఆదాయం 21 శాతం పెరిగి రూ. 1.6 లక్షల కోట్లు వచ్చాయి. ప్రజలపై భారం తగ్గించేందుకు కేంద్రం అక్టోబర్ నుంచి ఆయిల్ ధరలు తగ్గించమని ఒత్తిడి తేవడంతోనే నష్టాలు వచ్చినట్లు కంపెనీ తెలిపింది. కంపెనీ డైరెక్టర్ల సమావేశంలో 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లు ఇచ్చేందుకు అనుమతి తెలిపింది. స్టాక్ మార్కెట్‌లో ఇండియన్ ఆయిల్ షేర్లు 1.38 శాతం తగ్గుదల నమోదుచేశాయి.

యువతపై దుష్ప్రభావం చూపుతున్న ఇన్‌స్టాగ్రామ్



యువతను కట్టిపడేస్తున్న ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ మొదలైన సామాజిక మాధ్యమాలు వారి దైనందిన జీవితంలో భాగమైపోయాయి. ఏమాత్రం ఖాళీ దొరికినా వాటికే వారు సమయాన్ని వినియోగిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. ఒక రోజులో వాటికి ఎంత సమయం కేటాయిస్తున్నారో ఎప్పుడైనా గమనించారా ?

సోషల్ మీడియా వేదికలు వారికి కాలక్షేపం ఇస్తున్నాయి అనేకంటే అవి మద్యం, సిగరెట్ కంటే ఎక్కువగా ప్రమాదకర వ్యసనాలుగా మారిపోతున్నాయి. ముఖ్యంగా వీటి ప్రభావం యుక్తవయస్సు వారిపై ఎక్కువ ప్రభావం చూపుతున్నాయి. వీటితో ఎక్కువసేపు గడపడం వల్ల పిల్లల మానసిక, శారీరక స్థితిలో మార్పులు సంభవిస్తాయని మానసిక నిపుణులు పేర్కొంటున్నారు. వారి ఆలోచనల నిండా 'లైక్', 'షేర్', 'కామెంట్', 'పోస్ట్' అనే పదాలే ఉంటాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మనిషి మానసిక స్థితిని అవి మంచి/ చెడు రూపంలో ఎలా ప్రభావితం చేస్తున్నాయనే దానిపై ఓ విదేశీ సంస్థ తన అధ్యయనంలో విశ్లేషించింది. ఈ క్రమంలో ప్రస్తుతం ఉన్న సోషల్ మీడియా వేదికల్లో 'ఇన్‌స్టాగ్రామ్' అత్యంత ప్రమాదకరమైనదని అ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు.



సర్వే వివరాలు

వివిధ దేశాలకు చెందిన 1479 మంది యువతపై ఈ సర్వే నిర్వహించారు. ఇందులో పాల్గొన్నవారందరూ 14 నుంచి 24 ఏళ్ల మధ్య వయసు గలవారే. ఇందులో భాగంగా మనిషి మానసిక, శారీరక స్థితులను సోషల్ మీడియా ఎలా ప్రభావితం చేస్తుందో తెలుసుకోగలిగారు. ఈ క్రమంలో సోషల్ మీడియా వినియోగం, వాటివల్ల కలిగే ప్రభావాలకు సంబంధించిన 14 అంశాలపై అధ్యయనంలో పాల్గొన్న యువత నుంచి వారు సమాధానాలు సేకరించారు. అవి ఏమిటంటే...

- ఇతరుల ఆరోగ్యస్థితిని ఎంతవరకు అర్థం చేసుకుంటున్నారు.
- ఆరోగ్యానికి సంబంధించిన విషయాలపై ఎంతవరకు అవగాహన ఉంది.
- స్నేహితులు, కుటుంబసభ్యుల నుంచి ఎలాంటి ప్రోత్సాహం లభిస్తోంది.
- బాధ, మానసిక ఒత్తిడి, ఆవేదన మొదలైన అంశాలు.
- డిప్రెషన్. ▸ ఒంటరిగా గడపడం
- నిద్ర (ఎంతసేపు సుఖమైన నిద్ర పోగలుగుతున్నారు)
- స్వీయ వ్యక్తీకరణ (భావాలు, ఆలోచనలు వ్యక్తపరచడం)
- గుర్తింపు కోసం ప్రయత్నించడం
- బాడీ ఇమేజ్ (మీరు ఎలా కనిపిస్తారని మీ అభిప్రాయం)
- ఇతరులతో ఉండే సత్సంబంధాలు (రియల్ వరల్డ్ రిలేషన్‌షిప్)
- మీలా ఆలోచించేవారితో ఎలా ఉంటారు (కమ్యూనిటీ బిల్డింగ్)
- సామాజిక వేదికల్లో మిమ్మల్ని ఎవరైనా దూషిస్తే మీరు ఎలా స్పందిస్తారు ?
- FoMO (Fear of Missing Out) ఎప్పుడూ సోషల్ మీడియాకు కనెక్ట్ అయి ఉండాలి. లేదంటే మన ఉనికిని కోల్పోతామన్న భయం.
- ఇందులో ప్రతి అంశానికీ '-2 (అధ్వానం), 0 (ఎలాంటి ప్రభావం లేదు), +2 (ఎంతో మేలు)'.. ఇలా ర్యాంకులు ఇవ్వాలని కోరారు. ఆయా సామాజిక మాధ్యమాల వినియోగం యువత మానసిక ఆరోగ్యం పైన కల్పించే సానుకూల, వ్యతిరేక ప్రభావాల ఆధారంగా వాటికి రేటింగ్ ఇచ్చారు.



'ఇన్‌స్టాగ్రామ్'తోనే ఎక్కువ ప్రమాదం..

సర్వేలో భాగంగా పరిగణించిన ఐదు సోషల్ మీడియా వేదికల్లో (యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్, స్నాప్‌చాట్) 'ఇన్‌స్టాగ్రామ్' యువతపై ఎక్కువ చెడు ప్రభావం చూపుతోందని తేలింది.

- సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఫొటోలు అందంగా కనిపించేందుకు రకరకాల ఫిల్టర్లు వాడుతుండటం సహజం. ఈ క్రమంలో కొంతమంది తాము సహజంగా దిగిన ఫొటోలను ఎక్కువగా ఎడిటింగ్, ఫొటోషాప్ చేసిన ఫొటోలతో పోలుస్తుంటారు. అవి ఆకర్షణీయంగా కనిపించకపోవడంతో తమ ఫొటోలను కూడా ఫొటోషాప్‌లో ఎడిట్ చేసి, కొత్తరకం ఫిల్టర్లను యాడ్ చేసి అందంగా తీర్చిదిద్దుతారు. తమ ఫొటోలకు సరిపడే ఫిల్టర్ల కోసం తీవ్రంగా ప్రయత్నిస్తారు. ఆ క్రమంలో అసహజమైన అందంతో పోటీపడుతున్నారరే విషయం వాళ్లు మరచిపోతారు. వాటిపై ఎంత సమయం వెచ్చిస్తున్నారో కూడా పట్టించుకోరు.
- పోస్ట్ చేసిన ఫొటోలకు అనుకున్న విధంగా లైకులు, కామెంట్లు రాకపోతే తట్టుకోలేరు. మానసిక ఒత్తిడికి గురవుతుంటారు. తాము ఇతరులకంటే అందంగా, ఆకర్షణీయంగా లేమని కుంగిపోతుంటారు. దీనివల్ల క్రమంగా వారి ఆత్మవిశ్వాసం దెబ్బతింటుంది. ఇది డిప్రెషన్, ఒంటరితనం, నిద్రలేమి వంటి సమస్యలకు దారితీస్తుంది. ముఖ్యంగా అమ్మాయిలపై దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది.
- సర్వేలో భాగంగా తీసుకున్న ఐదు సమాజిక వేదికల్లో 'ఇన్‌స్టాగ్రామ్' వల్ల ఎక్కువ శాతం మంది ఇలాంటి సమస్యలకు లోనవుతున్నట్లు వారు తెలిపారు.

పాజిటివ్ మీడియాగా 'యూట్యూబ్'

- సోషల్ నెట్‌వర్కింగ్‌ల్లో చెడుతోపాటు మంచి చేసే అంశాలు కూడా ఉన్నాయి. తమ ఆలోచనలు, అభిప్రాయాలు ఎక్కువమందితో పంచుకునేందుకు ఇవి ఉపయోగపడతాయి. కొన్ని సందర్భాలలో మనం పోస్ట్ చేసే వ్యాఖ్యలు/ ఫొటోలు/ వీడియోలు ఎదుటివారిని ఆలోచింపజేస్తాయి. వారిలో స్ఫూర్తి నింపుతాయి.
- ఈ క్రమంలో డిప్రెషన్, ఒంటరితనాన్ని దూరం చేసే 'పాజిటివ్ సోషల్ మీడియా'గా 'యూట్యూబ్' ప్రథమ స్థానంలో నిలవడం విశేషం. ఆ తర్వాతి స్థానాల్లో ట్విట్టర్, ఫేస్‌బుక్, స్నాప్‌చాట్, ఇన్‌స్టాగ్రామ్‌లు ఉన్నాయి.
- ఇటాంటి సమస్యలు తగ్గించే దిశగా ప్రయత్నించమని సర్వే నిర్వహించిన సంస్థ వివిధ సోషల్ మీడియా సంస్థలను కోరింది. ఈక్రమంలో ఒక వెబ్‌సైట్/ యాప్‌పై నిర్ణీత సమయం కన్నా ఎక్కువ సమయం కేటాయిస్తే వెం టనే ఒక 'పాప్ అప్' (అలర్ట్ మెసేజ్) వచ్చేలా మార్పులు చేయాలని వారు ప్రతిపాదించారు. దీనికి అధ్యయనంలో పాల్గొన్న 71% మంది మద్దతు పలకడం విశేషం. అంతే కాకుండా డిజిటల్‌గా మార్పులు చేసిన ఫొటోలను సుల భంగా గుర్తించేలా యాప్‌లో మార్పులు చేయాలని వారు కోరారు.

కొన్ని సూచనలు

సోషల్ మీడియాను అమితంగా ఉపయోగించేవారు మీ స్క్రీన్ టైమ్ తగ్గించుకునేందుకు పాటించవలసిన కొన్ని సూచనలు..

- మీ మొబైల్‌లో ఆ యాప్స్‌కి సంబంధించి వచ్చే నోటిఫికేషన్లు రాకుండా ఆపేయండి
- సోషల్ మీడియా యాప్స్‌పై రోజుకు ఎంత సమయం గడుపుతున్నారో గుర్తించండి. దానిని క్రమంగా తగ్గించేందుకు ప్రయత్నించండి.
- వాటిని ఎంతసేపు వాడాలనుకుంటున్నారో అంత సమయానికి టైమ్ రిమైండర్లు పెట్టుకోవడం అలవాటు చేసుకోండి.
- కాలక్షేపం కోసం పెయింటింగ్, మ్యూజిక్, డాన్స్ లాంటి ఇతర రంగాలపై దృష్టి పెట్టండి.
- స్మార్ట్‌ఫోన్‌లో అందుబాటులో ఉన్న టెక్నాలజీని వాడేసి నిజంగా అందంగా లేకపోయినా అందంగా ఉన్నట్లు ఫొటోలు మార్చేసి, వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేసే యువతీయువకులు ఈరోజుల్లో ఎందరో కాబట్టి అలాంటి ఫొటోలు చూసి, 'వాళ్ల అంత అందంగా మేము లేమే' అని బాధపడటం మానేయండి.
- అలాగే మీరు పోస్ట్ చేసిన ఫొటోలకు లైక్స్, కామెంట్ల కోసం వెదుకులాడకండి.
- తెలియని వ్యక్తుల ప్రశంసల కన్నా నేరుగా రోజూ మనని చూసి మనం ఎలా ఉన్నామో చెప్పే కుటుంబసభ్యులు, స్నేహితుల మాటలకే ఎక్కువ విలువనివ్వండి.
- అన్నింటిని మించి 'శారీరకంగా అందంగా, ఆకర్షణీయంగా ఉంటేనే గొప్ప' అన్న భావనను మనసులోంచి వెంటనే తీసేయండి. ఈ ఒక్క ఫీలింగ్ పోతే ఏ ఫేస్‌బుక్కు, ఏ ఇన్‌స్టాగ్రామ్ మన సంతోషాన్ని, మానసిక ప్రశాంతతను దూరం చేయలేదన్నది వాస్తవం.



టాలీవుడ్ తెరపై ఖలీ



'ప్రేమించుకుందాం రా', 'ఈశ్వర్', 'శంకర్ దాదా ఎంబీబీఎస్' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులని అలరించిన ప్రముఖ దర్శకుడు జయంత్ సి పరాన్జీ. ఒకప్పుడు మంచి హిట్ చిత్రాలని తెరకెక్కించిన ఈ దర్శకుడు ప్రస్తుతం మంచి హిట్ కోసం ఎదురు చూస్తున్నాడు. అయితే ప్రస్తుతం తాను నరేంద్ర అనే టైటిల్‌తో మూవీ తెరకెక్కించబోతున్నట్టు చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రంతో ప్రముఖ భారత రెజ్లర్ దలీప్ సింగ్ రాణా (ది గ్రేట్ ఖలీ) టాలీవుడ్‌కి ఎంట్రీ ఇస్తున్నారు. నీలేష్ హీరోగా నటించనుండగా, ఆయన సరసన 'మిస్టర్ మజ్ను' చిత్రంలో నటించిన బ్రెజిలియన్ మోడల్, నటి ఇసబెల్ లీత్ ఇందులో కథానాయికగా నటిస్తున్నారు. రామ్ సంపత్ సంగీతం అందిస్తున్నారు. షూటింగ్ శరవేగంగా జరుగుతున్నట్టు చిత్ర బృందం తెలిపింది. యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా ఈషన్ ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కుతోంది. డబ్ల్యూడబ్ల్యూఈ సూపర్ స్టార్ ద గ్రేట్ ఖలీ కీలక పాత్రలో నటిస్తుండడంతో చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. గంటా రవితేజను హీరోగా పరిచయం చేస్తూ చివరిగా జయదేవ్ అనే చిత్రాన్ని జయంత్ సి పరాన్జీ తెరకెక్కించిన సంగతి తెలిసిందే.

మోడీ బయోపిక్‌లో భారీ తారాగణం..

ఈ ఏడాది బాలీవుడ్‌లో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం పీఎం నరేంద్రమోదీ. భారత ప్రధాని నరేంద్ర మోడీ జీవిత నేపథ్యంలో దర్శకుడు ఒమంగ్ కుమార్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబేరాయ్ ప్రధాన పాత్రలో నటిస్తున్నాడు. ఆ మధ్య చిత్ర ఫస్ట్‌లుక్ విడుదల కాగా, దీనిపై భిన్న స్పందనలు వినిపించాయి. అయితే ఈ చిత్రం సోమవారం సెట్స్ పైకి వెళ్లింది. అహ్మదాబాద్‌లో ప్రారంభమైన ఈ చిత్ర షూటింగ్, గుజరాత్‌లోని పలు ప్రాంతాలలోను చిత్రీకరణ జరుపుకోనుంది. బొమన్ ఇరానీ, దర్శన్ కుమార్ ఇప్పటికే చిత్ర యూనిట్‌తో కలవగా తాజాగా చిత్రంలో పాల్గొనబోయే భారీ తారాగణాన్ని ప్రకటించారు. జరీనా వహబ్, మనోజ్ జోషి, ప్రశాంత్ నారాయణన్, బర్కా బిష్ట్ సేన్‌గుప్తా, అక్షత్ ఆర్ సలుజా, అంజన్ శ్రీవాత్సవ్, రాజేంద్ర గుప్తా, యతిన్ కరేయ్ కర్ ముఖ్య పాత్రలు పోషించనున్నట్టు చిత్ర బృందం తెలిపింది.



మమ్ముట్టి, సన్నీలియోనీ ఫొటోను తీసేసిన నటుడు

ప్రముఖ మలయాళీ నటుడు మమ్ముట్టి, బాలీవుడ్ బ్యూటీ సన్నీ లియోనీ కలిసి దిగిన ఫొటోను మలయాళ నటుడు అజు వర్గీస్ తొలగించారు. మమ్ముట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'మధుర రాజా'. ఇందులో సన్నీ ఓ ప్రత్యేక గీతంలో మమ్ముట్టితో కలిసి ఆడిపాడబోతున్నారు. ఈ నేపథ్యంలో ఓ సోఫాలో మమ్ముట్టి పక్కన సన్నీ కూర్చుని మాట్లాడుతున్న ఫొటోను సినీ నటుడు అజు వర్గీస్ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తూ.. 'అక్క విత్ ఇక్క (అన్నయ్య)' అని క్యాప్షన్ ఇచ్చారు. దాంతో ఈ ఫొటో కాస్త విపరీతంగా వైరల్ అవుతోంది.

పలువురు నెటిజన్లు ఫొటోపై నోటికొచ్చిన కామెంట్లు పెడుతున్నారు. దాంతో వర్గీస్ ఈ ఫొటోను ఫేస్‌బుక్ నుంచి తొలగించాలని నిర్ణయించుకున్నారు. కేవలం ఇన్‌స్టాగ్రామ్, ట్విటర్‌లో మాత్రమే ఉండేలా చర్యలు తీసుకున్నారు. అంతేకాదు ఇప్పటివరకు వచ్చిన కామెంట్లలో అసభ్యకరంగా ఉన్నవాటిని తొలగించేశారు. 'మధుర రాజా' చిత్రాన్ని వైశాఖ్ దర్శకత్వం వహిస్తున్నారు. మరోపక్క సన్నీ 'వీరమాదేవి' చిత్రంతో మలయాళంలోకి అడుగుపెట్టబోతున్నారు.



షూటింగ్‌లో గాయపడ్డ హీరో నాని..!

ప్రతి సినిమాలోను ఎంతో నేచురల్‌గా నటించే నాని కెరీర్‌లో తొలిసారి క్రీడా నేపథ్యం గల చిత్రం చేస్తున్నాడు. మళ్లీ రావా ఫేం గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఏప్రిల్ 19న ప్రేక్షకుల ముందుకు రానుంది . ఇటీవల చిత్రానికి సంబంధించిన టీజర్ కూడా విడుదల కాగా ఇందులో నాని క్రికెటర్‌గా అదరగొట్టాడు. జెర్సీ చిత్రం పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతుంది. అర్జున్ పాత్రలో నాని క్రికెటర్ గా కనిపించనున్నాడు. ఈ సినిమా కోసం క్రికెట్‌లో శిక్షణ తీసుకున్న నాని తన పాత్రకి పక్కా న్యాయం చేయాలని మొదటి నుండి చాలా కష్టపడుతున్నాడు. అయితే తాజాగా చిత్రీకరణ జరుగుతున్న సమయంలో క్రికెట్ బాల్ నాని ముఖానికి తగలటంతో ముక్కుకు, చెంపకు బలమైన గాయమైందట. దీంతో నానికి కొద్ది రోజులు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్టు సమాచారం. జెర్సీ చిత్రంలో నాని సరసన శ్రద్ధా శ్రీనాథ్ కథానాయికగా నటిస్తుండగా, చిత్రానికి అనిరుథ్ సంగీతం అందిస్తున్నాడు. నాని ఈ చిత్రం తర్వాత విక్రమ్ కుమార్ దర్శకత్వంలోను ఓ సినిమా చేయనున్న సంగతి తెలిసిందే.





స్టార్ హీరోల తనయులతో శంకర్ సినిమా..!

తమిళ సూపర్ స్టార్స్ విజయ్, విక్రమ్‌ల తనయులతో దర్శక దిగ్గజం శంకర్ ఓ క్రేజీ ప్రాజెక్ట్ చేయబోతున్నాడనే వార్త కోలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. విజయ్, విక్రమ్‌లతోనే శంకర్ సినిమా తీయాలనుకున్నప్పటికి అది కుదరకపోతుండడంతో వారి పిల్లలతో సినిమా చేయాలని శంకర్ భావించాడట. ఇందుకు స్క్రిప్ట్ కూడా సిద్ధం చేస్తున్నాడట. పక్కా యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం ఉంటుందని అంటున్నారు. విజయ్ తనయుడు జాసన్ సంజయ్ ఇటీవల ఓ షార్ట్ ఫిలింని తెరకెక్కించి అందులో నటించాడు. ఈ లఘు చిత్రానికి ప్రశంసలు లభించాయి. ఇక విక్రమ్ తనయుడు ధృవ్ ప్రస్తుతం అర్జున్ రెడ్డి రీమేక్ వర్మ చిత్రంతో బిజీగా ఉన్నాడు. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఇద్దరు స్టార్ హీరోల తనయులతో శంకర్ సినిమా చేయబోతున్నాడనే వార్త ప్రస్తుతం అంతటా దావానంలా పాకింది. మరి దీనిపై అఫీషియల్ ప్రకటన ఎప్పుడు వస్తుందో చూడాలి.

ఇటీవల 2.0 అనే చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చిన శంకర్ ప్రస్తుతం భారతీయుడు 2 చిత్రంతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే.

చిన్నారిని పరామర్శించిన శ్రద్ధా



అభిమానుల కోరికలని తీర్చేందుకు నేటి నటీ నటులు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటున్నారు. కొందరు స్టార్స్, కష్టాలలో ఉన్న వారికి ఆర్థిక సాయాన్ని అందిస్తే మరి కొందరు వారిని స్వయంగా కలిసి కావలసినంత ధైర్యాన్ని ఇస్తున్నారు. తాజాగా బాలీవుడ్ భామ, సాహో బ్యూటీ శ్రద్ధా కపూర్.. సుమయ్య అనే చిన్నారిని కలిసి ఆమెని సంతోషపరచింది. వివరాలలోకి వెళితే 13 ఏళ్ళ బాలిక సుమయ్య కొంత కాలంగా క్షయ వ్యాధితో బాధపడుతుంది. ఆమె వ్యాధి మూడో దశలో ఉండడంతో కాలేయం కూడా దెబ్బతింది. ఆపరేషన్ చేస్తేనే బతికే అవకాశం ఉందని వైద్యులు చెప్పారు.

సుమయ్య .. కెట్టో అనే ఎన్జీవో ద్వారా వైద్యం పొందుతుండగా, బాలిక మనసులోని కోరికని ప్రముఖ నటి శ్రద్ధాకి ట్విట్టర్ ద్వారా తెలిపింది ఆ సంస్థ. మిమ్మల్ని సుమయ్య కలవాలనుకుంటుంది అని ఆ సంస్థ వారు ట్యాగ్ చేస్తూ ట్విట్టర్‌లో తెలపడంతో వెంటనే స్పందించిన శ్రద్ధా తన అభిమానిని ఎలా కలవాలో చెప్పండంటూ రీ ట్వీట్ చేసింది. అంతేకాదు తన అభిమానిని వ్యక్తిగతంగా కలవాలని భావించిన ఈ అమ్మడు అభిమానులెవరు గుర్తు పట్టకుండా ఉండేందుకు బురా? ధరించి బాలిక చికిత్స పొందుతున్న ఎన్జీవోకు వెళ్లారు. సుమయ్యతో కలిసి పలు ఫోటోలు దిగిన శ్రద్ధా కపూర్ సుమయ్యని కలిసినందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. ఆమె త్వరగా కోలుకోవాలని దేవుడని ప్రార్థిస్తున్నాను. తనకి నేను ఎలా సాయపడాలో చెప్పండి. మీ సంస్థ(కెట్టో)కి సంబంధించిన వారు చాలా గొప్పగా పని చేస్తున్నారు అని ట్వీట్ చేసింది శ్రద్ధా. ఈ అమ్మడు ప్రస్తుతం సాహో చిత్రంతో పాటు సైనా నెహ్వాల్ బయోపిక్ చేస్తున్న సంగతి తెలిసిందే.



రాశీ ఖన్నా ఫుల్ బిజీ

ఊహలు గుసగుసలాడే చిత్రంతో తెలుగు ప్రేక్షకులకి దగ్గరైన రాశీ ఖన్నా చివరిగా శ్రీనివాస కళ్యాణం అనే చిత్రంతో టాలీవుడ్ ప్రేక్షకులని పలకరించింది. ఈ సినిమా డివైడ్ టాక్ రావడంతో ప్రస్తుతం రాశీకి తెలుగులో ఆఫర్స్ కరువయ్యాయి. అయితే తమిళంలో మాత్రం అమ్మడి హవా కొనసాగుతుంది. ఇటీవల ఇమైక్కా నోడిగల్, అదంగ మారు అనే చిత్రాలతో మంచి హిట్స్ కొట్టిన రాశీ ఖన్నా ప్రస్తుతం అయోగ్య, సైతాన్ కా బచ్చా అనే తమిళ చిత్రాలతో బిజీగా ఉంది. ఇప్పుడు ఆమెకి తమిళంలో మరో ఆఫర్ వచ్చినట్టుగా తెలుస్తుంది. వైవిధ్యమైన పాత్రలకి కేరాఫ్ అడ్రెస్ అయిన విజయ్ సేతుపతి సరసన నటించే ఛాన్స్ రాశీ ఖన్నా కొట్టేసినట్టు కోలీవుడ్ టాక్. ఈ చిత్రాన్ని స్కెచ్ ఫేం విజయ్ చందర్ తెరకెక్కించనున్నాడు. వివేక్ శివ మరియు మెర్విన్ జే సోలమాన్ సంయుక్తంగా చిత్రానికి సంగీతం అందించనున్నారు. ఈ అమ్మడి హవా చూస్తుంటే రానున్న రోజులలో తమిళంలోనే వరుస సినిమాలు చేస్తూ అక్కడే స్థిరపడిపోతుందా అనే అనుమానం జనాలలో కలుగుతుంది.

గాంధీజీకి ఘన నివాళి





న్యూఢిల్లీ : జాతిపిత మహాత్మాగాంధీ 71 వర్థంతి సందర్భంగా ఆయనకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని మోడీ, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు నివాళులర్పించారు. గాంధీసమాధి రాజ్‌ఘాట్ వద్ద నిర్వహించిన సర్వమత ప్రార్థనలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, రక్షణ మంత్రి నిర్మలాసీతారామన్, కేంద్ర గృహ, పట్టణాభి వృద్ధిశాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి శ్రద్ధాంజలి ఘటించారు.

బాపూజీని తలచుకోవడంతోపాటు, ఆయన మార్గంలో నడవడానికి, ఆయన విలువలను పాటించడానికి కంకణబద్ధులమై ఉండాలని ప్రధాని మోడీ ట్వీట్ చేశారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వారికి మోడీ నివాళులర్పిస్తూ, దేశం వారి త్యాగాలను విస్మరించబోదని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ 1940, జనవరి 30న హత్యకు గురయ్యారు.

మరో సంస్థ బలి

NSC

- మోడీ, బీజేపీ నిర్లక్ష్యమే కారణం
- ఎన్‌ఎస్సీ పదవులకు ఇద్దరు సభ్యుల రాజీనామా
- కేంద్రప్రభుత్వంపై కాంగ్రెస్ మండిపాటు

న్యూఢిల్లీ : జాతీయ గణాంకాల సంఘం (నేషనల్ స్టాటిస్టికల్ కమిషన్ (ఎన్ఎస్సీ)) నుంచి ఇద్దరు సభ్యులు రాజీనామా చేయడం రాజకీయంగా దుమారాన్ని రేపింది. ఇటీవల గణాంకాల కమిషన్ విడుదల చేసిన ఉద్యోగాల డేటాపై ప్రభుత్వం, కమిషన్ మధ్య విభేదాలు తలెత్తాయి. దీంతో తాత్కాలిక చైర్‌పర్సన్ పీసీ మోహనన్, స్వతంత్ర సభ్యులు జేవీ మీనాక్షి రాజీనామా చేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ ఘాటుగా స్పందించింది. కేంద్రప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మరో సంస్థ నిర్వీర్యమైందంటూ మండిపడింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కేంద్ర ఆర్థికశాఖ మాజీమంత్రి పి.చిదంబరం ట్విట్టర్ వేదికగా మోడీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. 'ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మరో గౌరవప్రదమైన సంస్థ చచ్చిపోయింది. దీనికి కాంగ్రెస్ పార్టీ విచారిస్తోంది. సంతాపాన్ని ప్రకటిస్తోంది. పునఃజన్మ ఎత్తేంత వరకు దాని ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాం. జీడీపీ, ఉద్యోగుల డేటా విషయంలో ఈ సంస్థ నిజాయితీగా చేసిన పోరాటాన్ని మరవలేం' అంటూ చిదంబరం ట్వీట్ చేశారు. మరో సీనియర్ నేత అహ్మద్ పటేల్ కూడా ఘాటుగా స్పందించారు. ఈ రాజీనామాల వెనుక తమ దుష్పరిపాలన గుట్టు రట్టుకాకూడదన్న ప్రభుత్వ ఉద్దేశం కనిపిస్తోందన్నారు. 'ప్రభుత్వం తక్షణమే నిరుద్యోగ నివేదికను విడుదల చేయాలి. ఆ నివేదిక దానిని తయారు చేసే కమిషన్ రెండూ భారతపౌరులకు చెందినవేగానీ రాజకీయ పార్టీ సొత్తుకాదు. తమకు అనుకూలంగా లేనందున సమాచారాన్ని గోప్యంగా ఉంచాలనుకోవడం ప్రభుత్వానికి తగదు' అని పటేల్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. 'ఉద్యోగాల డేటా సిగ్గుపడేలా ఉండటమే ఇందుకు కారణమా లేక ఎన్ఎస్సీపై ప్రభుత్వం ఒత్తిడి తెస్తోందా..' అంటూ పార్టీ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వీ సందేహం వ్యక్తంచేశారు.



'మోడీనామిక్స్ అంతా మోడీ స్టాట్స్ గురించే' అని ఎద్దేవా చేశారు. బీజేపీ, మోడీ విధ్వంసక చర్యలకు మరో జాతీయ సంస్థ బలైందంటూ ఆయన ట్వీట్ చేశారు. ఇప్పటికే ఆర్బీఐ, సీబీఐ, సీవీసీ, సీబీడీటీ, ఈడీ, ఐటీ మోడీ-బీజేపీ చేతుల్లో సర్వనాశనం కాగా తాజాగా ఈ జాబితాలో మరో సంస్థ 'ఎన్ఎస్సీ' చేరింది. ఆత్మగౌరవంగల ఉద్యోగులు ఈ ప్రభుత్వ చర్యలను, ఒత్తిళ్లను సహించలేరు. రాజకీయ కక్షసాధింపు కోసం బలిపశువులు కాలేరు' అని ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. జాతీయ గణాంకాల కమిషన్‌లో స్వతంత్ర సభ్యులుగా ఉన్న జేవీ మీనాక్షి, పీసీ మోహనన్ రాజీనామా చేస్తూ కమిషన్ సమర్థవంతంగా పనిచేయట్లేదని, తమను పట్టించుకోవట్లేదని ఆరోపించారు. ఇదిలావుండగా, ఇద్దరు సభ్యులు రాజీనామా చేయడంతో ఎన్ఎస్సీలో సభ్యుల సంఖ్య ఇద్దరికి తగ్గిపోయింది. గణాంకాల కమిషన్‌లో మొత్తం ఏడుగురు సభ్యులు ఉండాల్సి ఉండగా, మూడు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. దీంతో ప్రస్తుతానికి ప్రధాన గణాంకాల అధికారి ప్రవీణ్ శ్రీవాస్తవ, నీతీ ఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్ కమిషన్ సభ్యులుగా ఉన్నారు.



రాజీనామా చేసిన పీసీ మోహనన్, జేవీ మీనాక్షి

వారెప్పుడూ అభ్యంతరం చెప్పలేదు.. : ఎంఓఎస్‌పీఐ

జాతీయ గణాంకాల కమిషన్ (ఎన్ఎస్సీ) పదవులకు రాజీనామా చేసిన ఇద్దరు సభ్యులు ఇటీవల జరిగిన కమిషన్ సమావేశాల్లో ఎన్నడూ ఎలాంటి అభ్యంతరాన్నిగానీ అసంతృప్తినిగానీ వ్యక్తంచేయలేదని ప్రభుత్వం వెల్లడించింది. ఎన్ఎస్సీ పదవులకు మోహనన్, మీనాక్షి రాజీనామా చేయడంపై స్టాటిస్టిక్స్, ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ శాఖ (ఎంఓఎస్‌పీఐ) బుధవారం వివరణ ఇచ్చింది. 'ఇటీవల జరిగిన సమావేశాల్లో వీరిద్దరూ ఎలాంటి అభ్యంతరాన్ని వ్యక్తంచేయలేదు. ఎన్ఎస్సీ సలహాలు, సూచనలను గౌరవిస్తాం.. వాటికనుగుణంగా చర్యలు తీసుకుంటాం' అని తెలిపింది. ఎంఓఎస్‌పీఐ పరిధిలోకి జాతీయ నమూనా సర్వే కార్యాలయం (ఎన్ఎస్ఎస్ఓ) నిర్వహించిన సర్వే ఆధారంగా ఉద్యోగాల డేటా గురించి ప్రస్తావిస్తూ ' 2017 జూలై నుంచి 2018 డిసెంబరు వరకు త్రైమాసిక డేటాను ఎన్ఎస్ఎస్ఓ పరిశీలిస్తోంది. ఆ ప్రక్రియ పూర్తి అయిన తర్వాత నివేదిక విడుదలవుతుంది' అని పేర్కొంది. అయితే, రాజీనామా సందర్భంగా మోహనన్ మీడియాతో మాట్లాడుతూ 'నేను ఎన్ఎస్సీ పదవికి రాజీనామా చేశాను. కమిషన్ ఈ మధ్య సమర్థవంతంగా పనిచేయట్లేదని మాకనిపించింది. కమిషన్ బాధ్యతలను మేము సక్రమంగా నిర్వర్తించలేకపోతున్నామన్న భావన కలిగింది. కొన్ని నెలలుగా కమిషన్ సభ్యులమైన మమ్మల్ని సంప్రదించకుండా నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మా బాధ్యతలను మేము సరిగ్గా నిర్వర్తించలేకపోతున్నాం. అందుకే రాజీనామా చేశాం' అని అన్నారు. మోహనన్, మీనాక్షి 2017 జూన్‌లో కమిషన్ సభ్యులుగా బాధ్యతలు చేపట్టారు. వీరి పదవీకాలం 2020 జూన్ వరకు ఉంది.

ఎయిర్‌ఫోర్స్‌ను అమ్మేశారు

ప్రధాని మోడీపై రాహుల్ ఫైర్

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ రాఫెల్ డీల్‌పై విమర్శలకు పదును పెట్టారు. స్నేహితుడు, వ్యాపార దిగ్గజం అనిల్ అంబానీకి రూ. 30 వేల కోట్లు లాభం చేకూర్చేందుకు ప్రధాని మోడీ భారత వాయుసేనను అమ్మేశారని రాహుల్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలను అంబానీ, కేంద్ర ప్రభుత్వం ఖండించాయి. యువజన కాంగ్రెస్ సమావేశాల ముగింపు కార్యక్రమంలో రాహుల్ మాట్లాడుతూ యువతను అణగదొక్కడం ఎవరివల్లా కాదని, రాఫెల్ స్కామ్ బట్టబయలు అయితీరుతుందన్నారు. రూ. 30 వేల కోట్లను అనిల్ అంబానీకి అప్పగించడం కోసం యువత అవకాశాలన్నీ మోడీ చిదిమేశారని దేశ ప్రజలకు తెలుసుకున్నారన్నారు. రాఫెల్ విషయంలో నిజాలు దాచడం ఎవరి తరం కాదని, వాటంతటికి అవే బయటికి వస్తాయన్నారు. 'మీరు భారతీయ వాయుసేనను అమ్మారు' అని మోడీని ఉద్దేశించి రాహుల్ అన్నారు. పార్లమెంటులో గంటన్నర మాట్లాడిన ఆయన నిజం చెప్పాల్సి ఉంటుందని కళ్లలోకి చూడకుండా ఎటో చూస్తూ మాట్లాడారన్నారు. నిజాన్ని దాచడానికి ప్రధాని ప్రయత్నిస్తున్నారని రాహుల్ విమర్శించారు. 'మీరు నిద్రపోలేరు.. నిద్రపోతే మీకు అనిల్ అంబానీ, రాఫెల్ జెట్, వాయుసేనల అమరవీరులు గుర్తుకు వస్తారు.. యువతతో మీరు ఆడుకున్నట్లు దేశమంతటికీ తెలిసింది' అని రాహుల్ అన్నారు. పోరాటంలో కాంగ్రెస్ వెనుకడుగు వేయబోదని, మోడీ 2019లో ఈ విషయంపై ప్రజలకు నిజాలు వెల్లడించాలన్నారు. మోడీ దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్నారని, ఈశాన్య రాష్ట్రాల్లో హర్యానా, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళల్లో బీజేపీ విధ్వంసానికి పాల్పడుతోందన్నారు. 2014కు మాకు మానవత్వంతో వ్యవహరించాలని నేర్పిందని, దేశంలోని పేదలందరికీ కనిష్ట ఆదాయం ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, వారి ఎకౌంట్లలో నేరుగా నగదు జమ చేస్తామన్నారు. కాంగ్రెస్ పారిశ్రామిక వేత్తలకు వ్యతిరేకం కాదని, కేవలం ఆశ్రిత పెట్టుబడివేత్తలైన మోడీ స్నేహితులకే వ్యతిరేకమని రాహుల్ స్పష్టం చేశారు.

బీచ్‌ల శుభ్రత కాంట్రాక్ట్‌పై రగిలిన గోవా అసెంబ్లీ



పనాజీ : గోవా రాష్ట్రంలోని బీచ్‌లను శుభ్రపరిచే కాంట్రాక్టును ఒక ప్రైవేట్ సంస్థకు అప్పగించడంపై రాష్ట్ర శాసనసభలో వాడీవేడిగా చర్చ జరిగింది. బీచ్‌ల శుభ్రత కాంట్రాక్టును దృష్టి లైఫ్ సేవింగ్ సర్వీసెస్ అనే ప్రైవేట్ సంస్థకు పర్యాటకశాఖ మంత్రి మనోహర్ అజ్గోయంకర్ అప్పగించారని కాంగ్రెస్ సభ్యులు ఫిలిప్ నెరి రోడ్రిగ్యూస్, దిగంబర్ కామత్, అలైక్సో రెజినాల్డోలౌరెన్కో సభలో ఆరోపించారు. శుభ్రత పనులకు టెండర్ జారీ చేయకుండా ప్రైవేటు సంస్థకు రెండేళ్లు కాంట్రాక్టు ఇచ్చారన్నారు. అయితే దీనిపై మంత్రి స్పందిస్తూ, బీచ్‌ల శుభ్రతకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కేంద్ర విజిలెన్స్ కమిషన్ మార్గదర్శకాల అనుసరించే టెండర్‌లకు అనుమతిచ్చామని తెలిపారు. 2018 అక్టోబ‌ర్ 20న ఈ పనులకు టెండర్ జారీ అయ్యిందని, అలాగే డిసెంబరు 5న సాంకేతిక బిడ్‌లను తెరిచినట్టు తెలిపారు. త్వరలో ఈ పనులు పూర్తవుతాయని చెప్పారు.

బీజేపీకి గిరిజన నాయకుడి గుడ్‌బై..



అగర్తలా : త్రిపుర గిరిజన నాయకుడు రాజేశ్వర్ దెబ్బర్మ బీజేపీకి గుడ్‌బై చెప్పారు. ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చడంలో బీజేపీ పూర్తిగా వైఫల్యం చెందినందున పార్టీని వీడుతున్నట్లు ఆయన వెల్లడించారు. పౌరసత్వబిల్లు (2016)ను రద్దు చేయడాన్ని ఆయన నిరసిస్తూ, త్రిపుర ప్రజలకు ఇది శాపంగా పరిణమిస్తుందన్నారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి విప్లవ్ కుమార్ దేవ్‌కు ఆయన రాజీనామాను అందచేశారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో బీజేపీ వైఫల్యానికి నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నానన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల వాగ్దానాల్లో ఒక్కటి కూడా నెరవేర్చ లేదన్నారు.

మాణిక్ సర్కార్‌ను అడ్డుకునే ప్రయత్నం


అగర్తలా : మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు మాణిక్ సర్కార్‌ను పార్టీ మీటింగ్‌కు హాజరవ్వకుండా అడ్డుకునేందుకు గుర్తు తెలియని దుండగులు జాతీయ రహదారి 8ను బ్లాక్ చేశారని సీనియర్ పోలీసు ఆఫీసర్ ఒకరు బుధవారం వెల్లడించారు. సర్కార్‌కు వ్యతిరేకంగా గోబ్యాక్ అంటూ 20 మంది ఆందోళనకారులు నినాదాలు చేశారన్నారు. పోలీసులు అక్కడకు చేరుకోగానే వారంతా పారిపోయారని, అంబస్సాలోని సీపీఎం జిల్లా ముఖ్య కార్యాలయం ఎదుట వారు నిరసనలు తెలిపారని ఎస్పీ సదీప్తదాస్ తెలిపారు. సర్కార్ పార్టీ వర్కర్ల సమావేశానికి హాజరయ్యారు. ఆందోళనకారులు ఏ రాజకీయపార్టీకి చెందని వారని పోలీసులు భావిస్తున్నారు. దీనిపై సీపీఎం స్పందిస్తూ, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా దీనిని పేర్కొంది.

జడ్జిపై చెప్పులు విసిరిన దొంగ

థానే : మహారాష్ట్రలోని థానే జిల్లాకోర్టులో తీర్పు వెలువరించిన న్యాయమూర్తిపై దొంగ జత చెప్పులను విసిరాడని బుధవారం పోలీసులు వెల్లడించారు. అయితే మెజిస్ట్రేట్ పక్కకు తప్పుకోవడంతో ప్రమాదం తప్పింది. అష్రాఫ్ అన్సారీ (22)పై కొద్ది రోజుల క్రిందట ఇంట్లో దొంగతనం చేశాడని కేసు నమోదు అయ్యింది. మంగళవారం మెజిస్ట్రేట్ అన్సారీని దొంగగా తీర్పు వెలువరించడంతో కోపంతో అతను చెప్పులు విసిరాడన్నారు. వెంటనే అతనని చుట్టుముట్టిన పోలీసులు కోర్టు హాలు నుంచి బయటికి తీసుకు వెళ్లారని, ఆపై కేసులు నమోదు చేసి దొంగను అరెస్టు చేశామన్నారు.

బీజేపీ ఎమ్మెల్యే దురుసు ప్రవర్తనకు వైద్యుడి రాజీనామా

షాజహాన్‌పూర్ : బీజేపీ ఎమ్మెల్యే దురుసు ప్రవర్తనకు మనస్తాపం చెందిన ప్రభుత్వ వైద్యుడు తన పోస్టుకు రాజీనామా చేశారు. వివరాల్లోకి వెళితే, ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్‌లో నిగోహిలో మంగళవారం ప్రభుత్వ కంటి వైద్య నిపుణుడు ఏపీ ఆర్య ఆధ్వర్యంలో వైద్య శిబిరం జరిగింది. ఆ సందర్భంలో ప్రభుత్వ పెన్షన్ కోసం వికలాంగ సర్టిఫికేట్ కావాలని వచ్చిన ఒక వ్యక్తికి 30 శాతం దృష్టి లోపం ఉన్నట్టు సర్టిఫికేట్‌ను ఇచ్చారు. అయితే ఆయనకు 40 శాతం దృష్టి లోపం ఉన్నట్టు సర్టిఫికేట్ ఇవ్వాలని బీజేపీ ఎమ్మెల్యే రోషన్‌లాల్ వర్మ వైద్యుడిపై ఒత్తిడి తెచ్చారు. దీనికి నిరాకరించిన ఆయన్ని బహిరంగ ప్రదేశంలో అసభ్యంగా దూషించాడు. దీంతో మానస్తాపం చెందిన డాక్టర్ ఆర్య తన పోస్టుకు రాజీనామా చేశారు. ఈ సంఘటనపై జిల్లా మెజిస్ట్రేట్ అమ్రిత్ స్పందిస్తూ, డా. ఆర్య ఫిర్యాదు ఇస్తే కేసు దర్యాప్తు చేస్తామని తెలిపారు. కాగా వైద్యుడితో దురుసుగా ప్రవర్తించిన ఎమ్మెల్యే రాతపూర్వకంగా క్షమాపణలు తెలపాలని మెడికల్ సర్వీసుల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఓపీ గౌతమ్ డిమాండు చేశారు.



జిల్లా మెజిస్ట్రేట్‌కు రాజీనామా సమర్పిస్తున్న డాక్టర్ ఏపీ ఆర్య

హాల్ ఉద్యోగులపై సీబీఐ కేసు

న్యూఢిల్లీ : ప్రభుత్వాన్ని మోసగించి రూ.13.28 కోట్లు నష్టపరిచారన్న ఆరోపణలతో ఒడిశాలో కోరాపుట్‌లోని హిందుస్తాన్ ఎయిరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) ఇంజన్ డివిజన్ ఉద్యోగులపై సీబీఐ మంగళవారం కేసులు నమోదు చేసింది. నకిలీ బిల్లులు, ఫోర్జరీ పత్రాలతో ఫైనాన్స్ సీనియర్ మేనేజర్ భబెన్ మిత్ర, హాల్ కంపెనీ ఉద్యోగులు 2013లో 13.11 లక్షలు, 2017లో రూ.7.78 కోట్లు అవకతవకలకు పాల్పడ్డారని అధికారులు తెలిపారు. 2013 నుంచి 2017 వరకు అవకతవకలు పాల్పడిన వీరిపై మొత్తం ఐదు కేసులు నమోదుచేసినట్టు తెలిపారు. గతేడాది అక్టోబర్‌లో కూడా నకిలీ బిల్లులతో మిత్ర మోసానికి పాల్పడ్డాడని చెప్పారు.

చట్టంతో ఆటలొద్దు..

- రూ.10కోట్లు జమ చేస్తే విదేశాలకు వెళ్లొచ్చు
- కార్తీ చిదంబరానికి సుప్రీంకోర్టు ఆదేశం



న్యూఢిల్లీ : ఐఎన్ఎక్స్ మీడియా, ఎయిర్‌సెల్ మ్యాక్సిస్ కేసుల్లో కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత పి.చిదంబరం కుమారుడు కార్తీకి సుప్రీంకోర్టు షరతులతో కూడిన ఊరటను కల్పించింది. కోర్టు రిజిస్ట్రీలో రూ.10కోట్లు జమ చేసి విదేశాలకు వెళ్లవచ్చని సూచిస్తూనే చట్టంతో ఆటలు ఆడవద్దని, కేసు విచారణకు పూర్తిగా సహకరించాలని ఆయనకు స్పష్టంచేసింది. ఎయిర్‌సెల్ మ్యాక్సిస్, ఐఎన్ఎక్స్ మీడియా కేసులో మార్చి 5, 6, 7, 12 తేదీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఎదుట తప్పనిసరిగా హాజరుకావాలని కార్తీని న్యాయస్థానం ఆదేశించింది. 'ఫిబ్రవరి 10 నుంచి 26 తేదీల్లో ఎక్కడికి కావాలంటే అక్కడికైనా వెళ్లవచ్చు. విచారణకు మాత్రం తప్పకుండా సహకరించాలి. సహకరించకపోతే మేం చాలా చెప్పాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి ఏమీ అనడం లేదు' అని సీజేఐ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం వెల్లడించింది. సుప్రీంకోర్టు రిజిస్ట్రీలో రూ. 10కోట్లు జమ చేయాల్సి ఉంటుంది' ఆదేశించింది. అంతర్జాతీయ టెన్నిస్ టోర్నమెంట్ల కోసం కొద్ది నెలల పాటు ఫ్రాన్స్, స్పెయిన్, జర్మనీ, యూకే వెళ్లేందుకు అనుమతివ్వాలంటూ కార్తీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఫిబ్రవరి 10 నుంచి 26, మార్చి 23 నుంచి 31 మధ్య విదేశాలకు వెళ్లేందుకుగాను అనుమతిని కోరారు. ఆయన పిటిషన్‌ను పరిశీలించిన సర్వోన్నత న్యాయస్థానం ఫిబ్రవరి 10 నుంచి 26 తేదీల్లో విదేశాలకు వెళ్లవచ్చునని ఆయనకు స్పష్టంచేసింది.

ఎస్సీ, ఎస్టీ చట్టసవరణపై

స్టేకు సుప్రీం నో



- రివ్యూ పిటిషన్‌తో సహా అన్ని అంశాలు ఒకేసారి విచారణ
- తదుపరి విచారణ 19కి వాయిదా

న్యూఢిల్లీ : ముందస్తు బెయిల్ నిబంధనను పునరుద్ధరిస్తూ ఎస్సీ/ఎస్టీ చట్ట సవరణపై స్టే మంజూరు చేసేందుకు అత్యున్నత న్యాయస్థానం బుధవారం మరోసారి తిరస్కరించింది. ఈ కేసుకు సంబంధించి కేంద్రం రివ్యూ పిటిషన్‌తో సహా అన్ని అంశాలను ఫిబ్రవరి 19వ తేదీన విచారించనున్నట్టు ప్రకటించింది. ఈ అంశంపై సవివరంగా విచారణ జరపాల్సి ఉన్నదని, ఇందుకు సంబంధించిన అంశాలన్నింటినీ ఒకేసారి విచారించటం తగినదని జస్టిస్ యూ యూ లలిత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొన్నది. కేసు తదుపరి విచారణను ఫిబ్రవరి 19కి వాయిదావేసింది. ఎస్సీ, ఎస్టీ చట్టానికి చేసిన సవరణలపై స్టే ఇచ్చేందుకు ధర్మాసనం తిరస్కరించింది. చట్టానికి చేసిన సవరణలను సవాల్ చేస్తూ, వీటిపై తక్షణం స్టే మంజూరు చేయాలని సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ పిటిషనర్ల తరుపున కోర్టులో వాదించారు. ఎస్సీ, ఎస్టీ చట్టం 2018కి సవరణలను సవాల్ చేసే పిటిషన్లను, కేంద్రం దాఖలు చేసిన రివ్యూను కలిపి తగిన ధర్మాసనం విచారణ నిర్వహిస్తుందని జనవరి 25న అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. నిందితులకు ముందస్తు బెయిల్ మంజూరు చేయని నిబంధనను పునరుద్ధరిస్తూ షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల (దాడుల నిరోధం) సవరణ చట్టం, 2018పై స్టే మంజూరు చేసేందుకు అత్యున్నత న్యాయస్థానం ఇంతకుముందు తిరస్కరించింది. ఎస్సీ, ఎస్టీ చట్టం క్రింద అరెస్టు అయిన వారికి కొన్ని రక్షణలు కల్పిస్తూ అత్యున్నత న్యాయస్థానం జారీచేసిన ఆదేశాలను త్రోసిపుచ్చుతూ పార్లమెంట్ గత ఏడాది ఆగస్టు 9వ తేదీన ఒక బిల్లును ఆమోదించింది. ఎస్సీ, ఎస్టీ చట్టం దుర్వినియోగం అవుతోందని, ప్రభుత్వోద్యోగులు, ప్రైవేట్ వ్యక్తులను లక్ష్యంగా చేసుకునేందుకు ఈ బిల్లును ఉపయోగించుకుంటున్నారని పేర్కొంటూ సర్వోన్నత న్యాయస్థానం 2018 మార్చి 20న ఆదేశాలు జారీచేసింది. ఈ చట్టం క్రింద చేసిన ఫిర్యాదులపై తక్షణం అరెస్టులు చేయవద్దని పేర్కొన్నది. ఎస్సీ, ఎస్టీ చట్టానికి కొత్తగా పార్లమెంట్ ఆమోదించిన సవరణలు స్టే ఇవ్వలేనివనీ సుప్రీంకోర్టు ఇంతకుముందు పేర్కొంటూ నిబంధనలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై కేంద్రం స్పందనను కోరింది.

మోడీలా కులరాజకీయాలు చేయను

బీజేపీ ఎమ్మెల్యే ఆసక్తికర వ్యాఖ్యలు



జబల్‌పూర్ : ప్రధాని మోడీపై మధ్యప్రదేశ్ బీజేపీ ఎమ్మెల్యే రాజవీర్‌సింగ్ దిలేర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మోడీలా కుల రాజకీయాలు చేయడం లేదని ఆయన అన్నారు. ఈ వార్తకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో సంచలనమైంది. అయితే, ఆ తర్వాత ఎమ్మెల్యే నాలుక కరచుకొని..తాను అలా అనలేదని, తన ప్రసంగాన్ని వక్రీకరించారని బుకాయించారు. మంగళవారం జరిగిన గ్యాస్ కనెక్షన్ల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సింగ్ మాట్లాడుతూ 'మన ప్రధానమంత్రి లాగా నేనెప్పుడూ కుల రాజకీయాలు చేయలేదు. నాకు సంబంధించినంత వరకు హిందూ, ముస్లింలు సమానమే. బీజేపీ అధికారంలోకి వస్తే మమ్మలను నిర్లక్ష్యం చేస్తారని ముస్లింలు భావిస్తున్నారు. బీజేపీకి అలాంటి భావజాలం లేదు. రాజకీయరంగంలో అడుగుపెట్టిన తర్వాత కులం, మతం, రంగు వంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వకూడదు' అని చెప్పుకొచ్చారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటేయాలని ఆయన ప్రజలను కోరారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయి. అందరూ బీజేపీకి ఓటేయాలని కోరుతున్నాను. రెండోసారి నరేంద్రమోడీని ప్రధానిని చేయాలని వేడుకుంటున్నానని ఆయన అన్నారు.

'రాహుల్ గొప్ప నేత'

బీజేపీ ఎమ్మెల్యే ప్రశంసలు



పనాజీ : కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ వంటి నాయకుడు గోవాకు, భారతదేశానికి అవసరమని గోవా బీజేపీ శాసనసభ్యుడు, డిప్యూటీ స్పీకర్ మైఖేల్ లోబో వ్యాఖ్యానించారు. ఆయన నిరాడంబరత, వినయం గోవా ప్రజలకు, దేశ ప్రజలందరికీ నచ్చుతుందన్నారు. 'భారత్, ప్రపంచంలోనే రాహుల్‌గాంధీ గొప్ప నాయకుడు. ఆగస్టు హౌస్(గోవా అసెంబ్లీ)లో ఆయనకు స్వాగతం పలకడం మాకు సంతోషంగా ఉంది. అనారోగ్యంతో బాధపడుతున్న మా ముఖ్య మంత్రి మనోహర్ పారికర్‌ను పరామర్శించేందుకు రాహుల్ ఇక్కడికి ప్రత్యేకించి రావడం గొప్పగా ఉంది' అని లోబో అన్నారు. మంగళవారం ఉదయం పారికర్‌ను రాహుల్ పరామర్శించారు. రాహుల్ చాలా సాధారణ వ్యక్తి అని, ఆయన లాంటి నాయకుడు గోవాకు, భారతదేశానికి అవసరమని ఎమ్మెల్యే ప్రశంసలు కురిపించారు. సొంత పనిమీద గోవా వచ్చిన రాహుల్..పారికర్‌ను కలిసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారని తెలిపారు. ఇక్కడికి వచ్చినందుకు రాహుల్‌కు ధన్యవాదాలు చెబుతున్నానన్నారు. రాహుల్, యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ జనవరి 26న ఓ ప్రైవేట్ విమానంలో గోవా వచ్చారు. ఐదు నక్షత్రాల హోటల్‌లో బస చేశారు.

ఎన్నికల తర్వాత

ప్రియాంక అదృశ్యమే..

త్రిపుర సీఎం వ్యాఖ్య



న్యూఢిల్లీ/కోల్‌కతా : సమాజ్‌వాదీ పార్టీ, బహుజన సమాజ్ పార్టీ లేకుండా ప్రియాంక గాంధీ ఉత్తర ప్రదేశ్‌లో ఏమీ చేయలేదని త్రిపుర ముఖ్యమంత్రి విప్లవదేవ్ అన్నారు. ప్రియాంక క్రియాశీల రాజకీయ ప్రవేశంపై విప్లవదేవ్ బుధవారం స్పందించారు. 'ఇప్పుడు ఎస్పీ, బీఎస్పీ కాంగ్రెస్‌తో లేవు. ప్రియాంకగాంధీ ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూద్దాం. యూపీ ప్రజలు ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చేశారు' అని ఆయన విలేకరులతో అన్నారు. అఖిలేష్‌యాదవ్, మాయావతి సహకారం లేకుండా కాంగ్రెస్ పార్టీ 2014లో ఆ రెండు సీట్లు కూడా గెలిచేది కాదని వ్యాఖ్యానించారు. 'ప్రియాంకగాంధీ రాజకీయ ప్రవేశం ఇదే మొదటిసారి కాదు. కాంగ్రెస్ ఇలాంటి నాటకాలు ఆడుతుంటుంది. ఎన్నికల సమయంలోనే ఆమె బయటికి వస్తారు. ఆ తర్వాత అదృశ్యమవుతారు. గత ఎన్నికల్లోనూ సోనియా, రాహుల్ నియోజకవర్గాల బాధ్యతలు ఆమే చూశారు. ఆ రెండు సీట్లు కూడా గెలవలేక వాటిని తమకు వదిలేయాలని ఎస్పీ, బీఎస్పీని వేడుకున్నారు. లేకపోతే అమ్మాకొడుకు పార్లమెంటు ముఖం చూసేవారు కాదు' అని దేవ్ అన్నారు.



బీజేపీ ఎమ్మెల్యే

అహంకారం

బలియా(ఉత్తరప్రదేశ్) : బీజేపీ నాయకులకు నోటి దురుసు, అహంకారం ఎక్కువైంది. పాట్నాలో రాహుల్‌గాంధీని రాముడుగా చూపిస్తూ ఓ పోస్టరు వెలిసింది. గంటల వ్యవధిలోనే యూపీ బీజేపీ ఎమ్మెల్యే దీనిపై స్పందించారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రావణుడని, ఆయన సోదరి శూర్పణఖ అని వ్యాఖ్యానించారు. యూపీలోని రొహానియా నియోజకవర్గం నుంచి గెలుపొందిన బీజేపీ ఎమ్మెల్యే సురేంద్రసింగ్ రామాయణాన్ని ఉటంకిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీని మునిగిపోతున్న నావగా పేర్కొన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయమని చెప్పారు. 'లంకలో రాముడు, రావణుడు యుద్ధం చేసుకున్నారని మనకు తెలుసు. ఆ సమయంలో రావణుడు తన సోదరి శూర్పణఖను రంగంలో దించాడు. అదేమాదిరిగా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ రావణుడి పాత్ర పోషిస్తాడని, భారత దేశమే కాకుండా ప్రపంచమంతా గర్వపడే ప్రధాని మోడీ రాముడు పాత్ర పోషిస్తారని అన్నారు.

ఆటోవాలాలకు 'పన్ను' చిక్కులు

ప్రభుత్వ ప్రకటనపై లేని క్లారిటీ
మినహాయింపులపై భిన్నవాదనలు
వాహనదారులలో గందరగోళం

విశాలాంధ్ర-విశాఖసిటీ: ఆటోలు, ట్రాక్టర్లపై పన్ను రద్దు విషయంలో ఏపీ ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో ఆటోవాలాలు గందరగోళానికి గురవుతున్నారు. పన్ను రద్దు, చెల్లింపులు ఏయే వాహనాలకు వర్తిస్తాయో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. ఆటోలు, ట్రాక్టర్లపై జీవితకాల, త్రైమాసిక పన్నును ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. దీనిపై ఆటోవాలాలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. అయితే అధికారిక ఉత్తర్వులు విడుదల కాకపోవడంతో ఈ విషయంలో భిన్నవాదనలు వినిపిస్తున్నాయి. ఒక్క విశాఖ జిల్లాలోనే సుమారు 50వేల ఆటోలు, 5 వేల ట్రాక్టర్లు, 15 వేల రవాణా ఆటోలు ఉన్నాయి. అన్ని సంఘాలతో సంబంధం లేకుండా లెక్కడితే ఈ సంఖ్య మరింత పెరుగుతుందని తెలుస్తోంది. కొంతమంది ఆటోడ్రైవర్లు, ఆర్టీఏ అధికారులు, బ్రోకర్లు పన్ను తీసివేయలేదని కట్టాలని చెప్పడం, మరికొందరు ఏడాదికి చెల్లించాల్సిన విధానాన్ని రద్దుచేశారని, ఎప్పటిలాగే మూడు నెలలకు (త్రైమాసిక) పన్ను చెల్లించాలనడం, ఇంకొందరు పాసింజర్ ఆటోలకు, ట్రాక్టర్లకు పన్ను ఎత్తివేశారని, రవాణాకు ఉపయోగించే మూడు చక్రాల ఆటోలకు యథావిధిగా చెల్లించాలని చెబుతుండటం ఆటోవాలాలను మరింత గందరగోళానికి గురిచేస్తోంది. ఇంతకు ముందు పాసింజర్ ఆటోలు, పాసింజర్ నాలుగు చక్రాల వాహనాలు, రవాణా ఆటోలు, నాలుగు చక్రాల వాహనాలు, ట్రాక్టర్లు, టాక్సీలు యజమానులు త్రైమాసిక పన్నును చెల్లించేవారు. ఆ తరువాత ఏడాది కొకసారి చెల్లించేవారు. ఇటీవల జీవితకాల పన్ను విధానం అమల్లోకి వచ్చింది. ఒకేసారి పన్నును చెల్లించాలంటే భారమవుతోందని, ఈ విధానాన్ని రద్దు చేయాలని ఆటోవాలాలు కోరారు. ఇదిలా ఉండగా అసలు రహదారి పన్నునే తీసివేసినట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో వారంతా సంతోషం వ్యక్తపరిచారు. వెనువెంటనే భిన్న వాదనలు వినిపిస్తుండటంతో ఆయోమయంలో పడ్డారు. డిసెంబరు నెలాఖరుకు పన్ను గడువు ముగిసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ అంశంపై స్పష్టతిస్తూ అధికారిక ఉత్తర్వులను విడుదల చేయాలి. పూర్తిగా పన్ను తీసివేశారా, మినహాయింపులు ఉన్నాయా అనేది స్పష్టంచేయాలి. ఇప్పటికే సీజ్ చేసిన ఆటోల విషయంలోనూ స్పష్టత ఇవ్వాలని ఆటోవాలాలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పన్ను లేదు : 'రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు పాసింజర్, రవాణా ఆటోలు, ట్రాక్టర్లకు సంబంధించి రోడ్డు టాక్స్‌ను చెల్లించనవసరం లేదు. త్రైమాసిక, ఏడాది అంటూ కాదు పూర్తిగా పన్ను నుంచి మినహాయింపు ఉంది. దీనిపై ప్రభుత్వం నుంచి మాకు మెసేజ్ వచ్చింది. జీఓ రావాల్సి ఉంది. మా సిబ్బంది ఎవ్వరూ టాక్స్ కట్టమని చెప్పడం లేదు. రెండు నెలల ముందే మేం సూచనలు చేశాం. ఇప్పటికే పన్ను కట్టలేదని సీజ్ చేసిన ఆటోలనూ అపరాధ రుసుం లేకుండా విడుదల చేస్తాం'

- వెంకటేశ్వరరావు, డీటీసీ, ఆర్టీఏ విశాఖపట్నం

దుర్గమ్మ సన్నిధిలో 'మజ్ను' చిత్ర బృందం



విశాలాంధ్ర - విజయవాడ (వన్‌టౌన్) : ఇంద్రకీలాద్రిపై వేంచేసివున్న కనకదుర్గమ్మను మిస్టర్ మజ్ను సినిమా బృందం బుధవారం దర్శించుకున్నారు. హీరో అక్కినేని అఖిల్, హీరోయిన్ నిధి అగర్వాల్, నిర్మాత బీఎస్‌వి.ప్రసాద్‌లకు ఆలయ అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం చిత్ర బృందం అమ్మవారిని దర్శించుకున్నారు. వేదపండితుల ఆశీర్వచనలు తీసుకున్నారు. పాలక మండలి ఛైర్మన్ గౌరంగబాబు వారికి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవదాయ కమిషనర్ ముప్ప పద్మ తన కుమార్తె మనవడుతో అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈవో కోటేశ్వరమ్మ అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

రైలు నుంచి జారిపడి యువకుడు మృతి



విశాలాంధ్ర - కోటబొమ్మాళి : శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలంలోని సరియాబొడ్డపాడు పంచాయతీ బడ్డిపేట గ్రామానికి చెందిన అన్నెపు సతీష్ (19) ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి వెళ్ళి కానరాని లోకాలకు వెళ్ళిన హృదయవిదారక ఘటన మంగళవారం జరిగింది. సతీష్ తన సోదరుడు కిషోర్‌తో కలిసి సికింద్రాబాద్‌లో జరుగుతున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొనేందుకు వెళ్ళాడు. సికింద్రాబాద్‌లో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా ర్యాలీ వాయిదా పడటంతో తన సోదరునితో కలిసి మంగళవారం సాయంత్రం ఇంటికి వచ్చేందుకు హైదరాబాద్‌లో ఫలక్‌నుమా రైలు ఎక్కాడు. కొద్ది దూరం వెళ్ళాక రైలు నుంచి జారిపడి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందాడు. సతీష్‌కు తల్లి కళావతి, తండ్రి ఆనందరావు ఉన్నారు. ఆర్మీలో చేరి తమకు ఆర్థిక భరోసా ఇస్తాడనుకున్నామంటూ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ వార్త తెలియటంతో బడ్డిపేట గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతదేహం గురువారం ఉదయానికి స్వగ్రామానికి చేరుతుందని గ్రామస్తులు తెలిపారు. హైదరాబాద్ రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఉత్కంఠగా రాష్ట్ర అంతర్ పాలిటెక్నిక్ క్రీడలు

విశాలాంధ్ర - గుడివాడ : కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు ఏఏఎస్ఎమ్ అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో డిపార్టుమెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి 23వ అంతర్ పాలిటెక్నిక్ క్రీడా పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. బుధవారం కీలకమైన సెమీఫైనల్స్, ఫైనల్స్ జరిగాయి. ప్రధానంగా వాలీబాల్, ఖోఖో, టేబుల్ టెన్నిస్ డబుల్స్ విభాగాల్లో ఆతిథ్య కృష్ణా జిల్లా బాలికల జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. బాలుర విభాగంలో కేవలం రెండు విభాగాల్లో మాత్రమే ఫైనల్‌కు చేరుకున్నారు.

బాలుర విభాగంలో : కబడ్డీలో పశ్చిమగోదావరి, నెల్లూరు జట్లు, వాలీబాల్‌లో విశాఖపట్నం, కర్నూలు జట్లు, బాల్‌బ్యాడ్మింటన్‌లో గుంటూరు, కృష్ణా జిల్లా జట్లు, బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో పశ్చిమగోదావరి, తూర్పు గోదావరి జిల్లా జట్లు, బ్యాడ్మింటన్ డబుల్స్‌లో విశాఖపట్నం, పశ్చిమగోదావరి జట్లు, టేబుల్ టెన్నిస్‌లో కృష్ణా, తూర్పుగోదావరి, డబుల్స్ విభాగంలో గుంటూరు, విశాఖపట్నం జట్లు, చెస్‌లో పశ్చిమగోదావరి, తూర్పు గోదావరి జిల్లా జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి.

బాలికల విభాగంలో : బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో తూర్పు గోదావరి, ప్రకాశం జట్లు, బ్యాడ్మింటన్ డబుల్స్‌లో అనంతపురం, కడప జట్లు, ఖో-ఖోలో గుంటూరు, కృష్ణా జట్లు, చెస్‌లో విజయనగరం, శ్రీకాకుళం, టేబుల్ టెన్నిస్‌లో గుంటూరు, చిత్తూరు జట్లు, డబుల్స్ విభాగంలో కృష్ణా, గుంటూరు జిల్లా జట్లు, వాలీబాల్‌లో కృష్ణా, ప్రకాశం జిల్లా జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ముగింపు కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు చేసిన జానపద నృత్యాలు, స్టాట్యూ డాన్స్‌లు ఆకర్షించాయి. అనంతరం వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఏఎన్ఎం & వీవీఆర్ఎస్ఆర్ విద్యాసంస్థల అధ్యక్షులు వల్లూరుపల్లి సుబ్బారావు, ఉపాధ్యక్షులు కృష్ణారావు, కరస్పాండెంట్ సత్యనారాయణరావు, ప్రిన్సిపాల్ రామాంజనేయులు, వైస్ ప్రిన్సిపాల్ కరుణకుమార్, జి.ప్రసాద్, వివిధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు, పాలిటెక్నిక్ విభాగ అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన థాయ్‌లాండ్ ప్రతినిధులు



విశాలాంధ్ర - తడ : థాయ్‌లాండ్ వాణిజ్య మంత్రిత్వశాఖకు చెందిన 9 మంది ప్రతినిధుల బృందం బుధవారం శ్రీసిటీని సందర్శించింది. ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ సోమ్మేట్ సూసోంబూన్ నేతృత్వంలో ఇక్కడకు విచ్చేసిన బృందానికి శ్రీసిటీ ప్రెసిడెంట్ రమేష్ సుబ్రహ్మణ్యం సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతి, ప్రత్యేకత, వ్యాపార అనుకూలతల గురించి వారికి వివరించారు. అక్కడ నుంచి వీరు శ్రీసిటీ పరిసరాలను చూడటంతో పాటు థాయిలాండ్‌కు చెందిన ఫర్నిచర్ తయారీ పరిశ్రమ రాకవర్త్‌ను సందర్శించి ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం శ్రీసిటీ ప్రతినిధులతో సమావేశమై పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. శ్రీసిటీలో మౌలిక వసతులు, స్నేహ పూర్వక వ్యాపార వాతావరణంతో అద్భుతమైన పారిశ్రామికవాడ ఏర్పాటుకు కృషిచేసిన యాజమాన్యాన్ని ఈ సందర్భంగా ప్రశంసించారు. శ్రీసిటీ వ్యాపారానుకూలతల దృష్ట్యా తమ దేశంలోని వివిధ సంస్థలు ఇక్కడ పెట్టుబడులు పెట్టగలవన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. థాయ్ బృందంలో ప్రభుత్వ అధికారులు, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లతో పాటు చెన్నైలోని థాయ్‌లాండ్ కాన్సులేట్ జనరల్ పాల్గొన్నారు.

ప్రతిభా అవార్డు గ్రహీతలు
బ్యాంక్ అకౌంట్ వివరాలివ్వాలి
ఏయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సుధాకర్‌రెడ్డి

విశాలాంధ్ర - విశాఖసిటీ : 2018 సంవత్సరానికి గాను ప్రతిభా అవార్డులు సాధించిన విద్యార్థులు తమ బ్యాంక్ అకౌంట్ నెంబరు, ఆధార్ నెంబర్లను వెంటనే అందించాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్.వి. సుధాకర రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిభా అవార్డులతోపాటు అందించే నగదును నేరుగా విద్యార్థుల బ్యాంక్ అకౌంట్‌లలో జమ చేస్తామన్నారు. విద్యార్థి బ్యాంక్ అకౌంట్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్, ఆధార్ నెంబర్లను సత్వరం తమకు పంపాలని కోరారు. వివరాలు నమోదు చేయని విద్యార్థులకు బ్యాంక్‌లలో నగదు జమ చేయడం సాధ్యంకాదన్నారు. విద్యార్థులు వివరాలను coe@andhrauniversity.edu.inకు పంపాలన్నారు. వివరాలకు 0891-2844177 నంబరును సంప్రదించాలన్నారు.

కాలుష్య కోరల్లో విశాఖి

విశాలాంధ్ర - విశాఖ సిటీబ్యూరో : కాలుష్యంతో విశాఖ నగరం ఉక్కిరిబిక్కిరవుతోంది. ఓ పక్క పరిశ్రమలు, మరో పక్క సముద్రంలో కలిసిపోతున్న విష వాయువులతో విశాఖ వాసులు ఊపిరి తీసుకోలేకపోతున్నారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి విడుదల చేసిన తాజా నివేదికలో వాయు నాణ్యత సూచికలో దేశంలోని ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే విశాఖ నగరం ప్రథమ స్థానంలో ఉంది. పీఎల్బే గాలిలోని సూక్ష్మ, స్థూల ధూళికణాలు, కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్ సహా ఇతర కాలుష్య కారకాలను పరిగణనలోకి తీసుకొని సీపీసీబీ తాజాగా వాయు నాణ్యత సూచిక (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్-ఎక్యూఐ)ను విడుదల చేసింది. ఇందులో మహావిశాఖ నగరం 229 పాయింట్లు సాధించింది. వాయు కాలుష్యం విషయంలో మన నగర పరిస్థితి దాదాపు శ్రుతి మించినట్లేనని ఈ సంఖ్య సూచిస్తోంది. దేశ రాజధాని ఢిల్లీ 292 పాయింట్లు సాధించి అధ్వాన్న వాయు నాణ్యతతో మెట్రో నగరాల జాబితాలో తొలి స్థానంలో నిలిచింది. ఈ నగరం అత్యంత హానికరమైన వాయు కాలుష్యంతో సతమతమవుతున్నట్లు నివేదిక తేల్చింది. ఇక ఈ జాబితాలో ఉన్న నాలుగు తెలుగు నగరాల్లో విశాఖ పరిస్థితి దారుణంగా ఉంది. అయితే కేంద్రప్రభుత్వం ఇటీవల నిర్దేశించిన కార్యక్రమంతో కాలుష్య నియంత్రణ ఆశలు చిగురిస్తున్నాయి.

నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ పేరుతో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమం ద్వారా దేశంలోని 102 నగరాల్లో పొల్యూషన్ కంట్రోల్ చేసేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. వాయు కాలుష్యాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యంగా ప్రాజెక్టు అమలుకు రంగం సిద్ధమైంది.



స్వచ్ఛమైన గాలి కరవు : దేశంలోని చాలా నగరాల్లో స్వచ్ఛమైన గాలి కరవైంది. పెరుగుతున్న వాహన వినియోగం, పరిశ్రమలు వాయు కాలుష్యానికి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ మూడు సంవత్సరాల క్రితం నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌సీఏపీ) పేరుతో ప్రాజెక్టు ప్రారంభించింది. దేశంలోని అన్ని నగరాల్లో సర్వే నిర్వహించింది. ఏఏ నగరాల్లో ఎంత మేర వాయు కాలుష్యం ఉన్నదీ.. ఆ నగర వాసుల పరిస్థితు లు.. తదితర అంశాలపై తుది నివేదిక రూపొందించిన అనంతరం 102 నగరాల్ని కాలుష్య నియంత్రణకు ఎంపిక చేసింది. ఢిల్లీ, ముంబయి, పూణె, వారణాసి, లక్నో, అలహాబాద్, కోల్‌కతా, బెంగళూర్, చండీఘర్, జైపూర్, జమ్మూ, పాటియాలా, జలంధర్, లూథియానా, పాట్నా హైదరాబాద్, విశాఖపట్నం.. ఇలా నగరాలను అక్కడి కాలు ష్య సూచికల ప్రకారం ఎంపిక చేశారు. ఎంపికైన నగరాల్లో రానున్న మూడేళ్లలో 35శాతం, అయి దేళ్లలో 50 శాతం కాలుష్యాన్ని నియంత్రించాలన్నది ఈ ప్రాజెక్టు ముఖ్యలక్ష్యం.

అయిదు రంగాలను గుర్తిస్తూ : విశాఖ సహా ఎంపికైన ఆయా నగరాల్లో వాయు కాలుష్యానికి అయిదు ప్రధాన రంగాలు ప్రధాన కారణాలుగా ఎన్‌సీఏపీ గుర్తించింది. విద్యుదుత్పత్తి కేంద్రాలు, రవాణా, పరిశ్రమలు, రెసిడెన్షియల్, వ్యవసాయ రంగాల ద్వారా వాయు కాలుష్యం పెరుగుతుందని నివేదికలో పేర్కొన్నారు. వీటి ద్వారా ఉత్పత్తి అయ్యే కాలుష్య కారకాల నియంత్రణకు చర్యలు తీసుకునేందుకు ప్రయత్నాలు చేపట్టనున్నారు. ఇందు కోసం దేశ వ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న 684 మాన్యువల్ మోనిటరింగ్ స్టేషన్లను 1000కి పెంచనున్నారు. విశాఖలో ప్రస్తుతం 8 మోనిటరింగ్ స్టేషన్లు ఉన్నాయి. యాంబియంట్ ఎయిర్ క్వాలిటీ మోనిటరింగ్ స్టేషన్లను 84 నుంచి 268కి పెంచనున్నారు. ఎప్పటికప్పుడు డేటాను ప్రజలకు తెలియపరిచి వారిలో చైతన్యం పెంచేందుకు కృషి చేయనున్నారు. ప్రజలను కూడా ఇందులో భాగస్వామ్యం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం పలు గ్లోబల్ ఏజెన్సీలతో కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ ఒప్పందాలు కుదుర్చుకుంది. ప్రపంచ బ్యాంకు, జర్మన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ, ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు కూడా ఈ ప్రాజెక్టుకు సహకారం అందించనున్నాయని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తెలిపారు.



'రూఫ్ టాప్ సోలార్ పవర్'పై వర్క్‌షాప్

విశాలాంధ్ర - తడ : కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) శ్రీసిటీ సంయుక్తంగా బుధవారం స్థానిక బిజినెస్ సెంటర్‌లో 'రూఫ్ టాప్ సోలార్ పవర్' అంశంపై వర్క్‌షాప్ నిర్వహించాయి. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ కార్యక్రమం ప్రారంభ ఉపన్యాసంలో సమకాలీన విద్యుత్ అవసరాలకు రూఫ్ టాప్ సోలార్ పవర్ కీలకమైన పరిష్కారమని పేర్కొన్నారు. ప్రత్యేకించి పారిశ్రామిక వినియోగదారులకు నమ్మకమైన నాణ్యమైన విద్యుత్‌ను అందించడా నికి ఇది అత్యంత అనుకూలమైనదన్నారు. ఈ అంశాలపై సందేహాల నివృత్తి కోసం సంబంధిత నిపుణులతో పరస్పర చర్చల్లో చురుకుగా పాల్గొనవలసినదిగా వర్క్‌షాప్‌కు విచ్చేసిన ప్రతినిధులను ఆయన కోరారు. హీరో ఫ్యూచర్స్ ఎనర్జీ ప్రతినిధి అనిమేష్ శర్మ, మాండెలెజ్ ఇండియా ఫుడ్స్ సంస్థ ప్రతినిధి భుజరంగరావ్ కోకా అధ్యయనాలను ఉటంకిస్తూ రూఫ్ టాప్ సోలార్ పవర్ అవసరాలు, ప్రయోజనాల గురించి వివరించారు. సీఐఐ డైరెక్టర్ సాయికత్ రాయ్ చౌదరి ఈ కార్యక్రమం ప్యానల్ డిస్కషన్ ఛైర్మన్‌గా వ్యవహరించగా, సాయత్ కామత్, అనిమేశ్ శర్మ, లెర్రి సోలార్ టెక్నాలజీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రాహుల్ కపిల్, వ్యారిఎనర్జీస్ అతుల్ కామతి, స్టేట్ బ్యాంక్ ఏజీఎం గోపాల్‌మోహన్ ప్యానల్ సభ్యులుగా పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా 'కాల్‌హెల్త్' సేవల విస్తరణ



విశాలాంధ్ర - విశాఖ సిటీ బ్యూరో : ఇంటిగ్రేటెడ్ హెల్త్ కేర్ సేవల ప్లాట్‌ఫామ్ కాల్‌హెల్త్ తన వైద్య సేవలను దేశ వ్యాప్తంగా మరింతగా విస్తరించనున్నట్లు హెల్త్‌కేర్ సీఈఓ తళపల్లి హరి పేర్కొన్నారు. విశాఖలోని స్థానిక హోటల్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో కాల్‌హెల్త్ ఫైనాన్షియల్ హెడ్ సతీష్‌తో కలసి ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఢిల్లీతో పాటు దేశంలోని 13 నగరాల్లో దాదాపు 20 మిలియన్ ప్రజలకు గత రెండేళ్లుగా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. 2000కి పైగా నగరాల్లో 400 మిలియన్ ప్రజలకు ఇంటివద్ద లేదా తమ మెడికల్ సెంటర్‌ల వద్ద వైద్య, ఆరోగ్య సేవలు అందించేందుకు కాల్‌హెల్త్ సిద్ధమైనట్లు చెప్పారు. తొలి దశలో తెలంగాణ, ఏపీలలో 100కి పైగా నగరాల్లో 25 మిలియన్ల ప్రజలకు సేవలు అందించనున్నామన్నారు. అల్లోపతి, హోమియోపతి, ఆయుర్వేదంలో వైద్యసేవలు, నర్సింగ్, బెడ్ సైడ్ అసిస్టెన్స్, ఫిజియోథెరపీ, ఫిట్‌నెస్ ట్రైనింగ్, వెల్‌నెస్ ప్రోగ్రామ్స్, డయాగ్నోస్టిక్ శాంపిల్ కలెక్షన్, ఇమేజింగ్, హాస్పిటలైజేషన్ అసిస్టెన్స్, వైద్య ఆరోగ్యానికి సంబంధించిన సేవలు అందించడం, అన్ని రకాల మందుల సరఫరా, ఎక్విప్‌మెంట్ రెంటల్స్, మానసిక, శారీరక సంబంధించిన అన్ని అంశాల్లో సేవలు, స్పీచ్ థెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, హెల్త్ ఇన్స్యూరెన్స్ తదితర సేవలు అందిస్తామన్నారు. అసోసియేట్ హెల్త్ ఎకోసిస్టమ్ లివరేజ్ పార్ట్‌నర్స్ (ఎ-హెల్ప్) ద్వారా ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ కేంద్రాలు తమతో భాగస్వాములు కావచ్చన్నారు. ఇంటి వద్ద నుంచే ఎవరైనా ఎప్పుడైనా తమ కాల్‌హెల్త్‌ను సంప్రదించి ఎటువంటి వైద్య సేవలైనా పొందవచ్చన్నారు. తాము అదనంగా రుసుం వసూలు చేయబోమన్నారు. తమ సేవలు కావాలనుకునే వారు కాల్‌హెల్త్ మొబైల్ యాప్, వెబ్‌సైట్ ద్వారా సంప్రదించవచ్చన్నారు. తమతో కలసి వైద్యసేవలు అందించాలనుకునేవారు 1800 30 111 222 నంబరును సంప్రదించాల్సిందిగా కోరారు.

సమస్యలపై అవిశ్రాంత పోరు

ఆర్టీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ పలిశెట్టి



విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించేంతవరకు పోరాటాలు ఆగవని ఆర్టీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ దామోదరరావు స్పష్టం చేశారు. విజయనగరంలోని ఆర్టీసీ డిపో వద్ద బుధవా రం 'చలో ఆర్ఎం' కార్యక్రమం జరిగింది. తొలుత కార్మికులంతా ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయం నుంచి ఆర్టీసీ డిపో వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం దామోదరరావు మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద రవాణా సంస్థ అయిఉండి, రోజుకు 65 లక్షల నుంచి 70 లక్షల మంది ప్రజలకు రవాణా సౌకర్యాన్ని అందిస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల నష్టాల బాటలో నడుస్తున్నదన్నారు. వీటన్నిటినీ అధిగమించాలంటే బడ్జెట్లో నిధులు కేటాయించి ఆదుకోవాలన్నారు. 91 డిమాండ్లపై చేస్తున్న ఉద్యమంలో ప్రభుత్వం, యాజమాన్యం వైఖరి చూస్తుంటే ఫిబ్రవరి 6 నుంచి సమ్మె తప్పని పరిస్థితి ఏర్పడుతున్నదన్నారు. దీనిలో భాగంగా ఆర్టీసీ జేఏసీ కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా రీజినల్ మేనేజర్ కార్యాలయాల వద్ద సమ్మె నిర్వహిస్తున్నామన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం, యాజమాన్యం కార్మికుల పట్ల అవలంభిస్తున్న తీరు అత్యంత దారుణంగా ఉందన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, 2017 నుంచి వేతన సవరణ వేగవంతం చేయాలని, సెక్యూరిటీ సిబ్బందిని తగ్గించే ఆలోచనను విరమించుకోవాలని, కారుణ్య నియామకాల ప్రక్రియ వెంటనే చేపట్టాలని, సిబ్బంది అక్రమ కుదింపు విధానాన్ని విడనాడాలన్నారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు అన్నపూర్ణమ్మ, జీఎస్ఎన్ రాజు, జోనల్ అధ్యక్షులు చింతాడ వెంకటరావు, జోనల్ కార్యదర్శి పి. భానుమూర్తి, జేఏసీ నాయకులు జి.రవికాంత్, బాసూరు కృష్ణమూర్తి, దుర్గ రాజు, కె.సంజీవరావు, టీఎస్ఎం రాజు, జేఏసీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

- ఒక్కో గ్రూపు నుంచి రూ. 5 వేలు వసూలు చేస్తున్న వైనం
- సంఘ లీడర్లను, అధికారులను నిలదీసిన పొదుపు మహిళలు

'పసుపు కుంకుమ'లో
గ్రామైక్య సంఘాల చేతివాటం



విశాలాంధ్ర - ఆళ్ళగడ్డ : ముఖ్యమంత్రి చంద్రబాబు పసుపు, కుంకుమ పథకం క్రింద రూ.10 వేలు మంజూరు చేస్తే దాం ట్లో మీకెందుకు లంచమివ్వాలంటూ పొదుపు సంఘాల మహిళలు గ్రామైక్య సంఘ లీడర్లపై ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు ధర్నా నిర్వహించారు. ఈ ఘటన బుధ వారం రాత్రి కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ నగర పంచాయతీ కార్యాలయం వద్ద జరిగింది. పొదుపు సంఘాలకు రెండో విడత పసుపు కుంకుమ క్రింద రూ. 10 వేలు విడతల వారీగా పొదుపు మహిళల ఖాతాల్లో జమ చేస్తామని, ఇందుకోసం ఎవరూ ఎవరికీ పైసా కూడా డబ్బు ఇవ్వవద్దంటూ ప్రకటించి 24 గంటలు గడవక ముందే ఒక్కొక్కరు రూ. 500 ఇస్తేనే డబ్బు మీ చేతికందుతుందని చెబుతూ వారి నుంచి డబ్బు వసూ లు చేస్తున్నారు. దీంతో ఆగ్రహానికి గురైన మహిళలు భారీ ఎత్తున బుధవారం రాత్రి నగర పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అధికారులు ఎవరికీ పైసా ఇవ్వవద్దని చెబుతుంటే మీకు మేమెందుకు 500 రూపాయలు ఇవ్వాలంటూ సంఘ లీడర్లను నిలదీశారు. అయితే అధికారులు మాత్రం మీరెందుకు గ్రామైక్య సంఘాలకు డబ్బు ఇచ్చారంటూ పొదుపు గ్రూపు మహిళలను ప్రశ్నించడం ఒకింత ఆశ్చర్యా నికి గురిచేస్తోంది. ఇదే అదనుగా భావించిన గ్రామైక్య సంఘాల లీడర్లు చిన్నగా అక్కడి నుంచి జారుకున్నారు. పట్టణంలో దాదాపు 800 గ్రూపులు ఉన్నాయి. దీనిపై ఓ అధికారిని వివరణ కోరగా సభ్యులను డబ్బులు అడిగిన విషయం తమకు తెలియదని, డబ్బు ఇచ్చిన వారికి తిరిగి ఇప్పిస్తామని చెప్పారు.

అవినీతిలో అగ్రస్థానం పౌరసేవలదే!

- రెవెన్యూ అధికారులే కీలకం
- పౌరసేవల చార్జుకు సమాంతరంగా లంచాల చార్జులు
- అవినీతి కేసులపై ఏసీబీ నివేదిక

విశాలాంధ్ర - చోడవరం : నిరంతరం ప్రజలతో సత్సంబంధాలు కలిగిన ప్రభుత్వ శాఖల్లోనే అవినీతి అగ్రస్థానంలో కొనసాగుతోందని అవి నీతి నిరోధక శాఖ (ఏసీబీ) సర్వే తేల్చింది. రెవెన్యూ, పురపాలక, పోలీస్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్టాంపులు - రిజిస్ట్రేషన్లు, ఇంధన వనరులు వంటి శాఖల్లో లంచావతారులు పెరిగిపోతున్నట్టు గుర్తించింది. ఏయే శాఖల్లో ఎలాంటి అంశాలకు సంబంధించిన వ్యవహారాల్లో అవినీతి ఎక్కువ చోటుచేసుకుంటున్నది, లంచాలకు ఎక్కడ ఆస్కారమేర్పడుతుందనే అంశాలపై ఇటీవల ఏసీబీ విడు దల చేసిన నివేదికలో స్పష్టం చేసింది. గడిచిన మూడేళ్ల లో లంచాలు తీసుకుంటూ ఏసీబీకి దొరికిన అధికారులు, ఉద్యోగుల్లో అధిక శాతం పౌరసేవలు అందించడంలో పౌరులను జలగల్లా పీడించినవారే. ప్రభుత్వశాఖల్లో వేళ్ళూనుకుపోయిన అవినీతి నిర్మూలనకు నడుంబిగించిన ఏసీబీ అధికారులు సహకరించాల్సిందిగా ప్రజలను కోరు తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరల్లేక మానసిక వేదనతో భూమి తల్లిని నమ్ముకున్న అన్నదాతలను అవినీతిపరులు అడుగడుగునా వెంటాడి లంచాలు పిండుకుంటున్నారు. పట్టాదారు పాసుపుస్తకాలు, అడంగల్ ప్రతుల మంజూరుకు కనిష్ఠంగా రూ.10 వేల నుంచి మొదలెట్టి గరిష్ఠంగా భూమి విలువ, అవతలి వ్యక్తులకు ఆ పని ఎంత ముఖ్యమో అంచనా వేసి సొమ్ము చేసుకుంటున్నారు రెవెన్యూ సిబ్బంది. వంశపారంపర్యంగా సంక్రమించే భూములకు తగిన ఆధారాలు ఉండకపోవడంతో వాటికి పాసుపుస్తకాలు ఇవ్వాలన్నా, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నా మార్కెట్టు విలువను బట్టి ఎకరాకు లంచం ధరలు నిర్ణయించి దండుకుంటూ ఏసీబీకి దొరికిన వారి జాబితాలో ప్రథమ స్థానం వీఆర్వోలు, తహశీల్దార్లదే. ప్రభుత్వం ఆన్‌లైన్ విధానం తీసుకొచ్చాక అవినీతి తీవ్రత కొంతమేర తగ్గినా అధికారులు, ఉద్యోగుల చేతివాటం మాత్రం ఆగడం లేదన్నది బహిరంగ రహస్యం. పౌరసేవల చార్జును ప్రభుత్వం ప్రకటిస్తే వాటికి సమాం తరంగా లంచాల చార్జులను ఉద్యోగులు, అధికారులు రూపొందించారు. ట్రేడ్ లైసెన్సులు, భవనాల క్రమ బద్ధీకరణ, అనుమతులకు పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఎక్కువ లంచాలు వసూలు చేస్తున్నారు. కేసుల దర్యాప్తు పూర్తయిన తర్వాత, అభియోగపత్రాల్లో మార్పులు, చేర్పులకు పోలీసులు బహిరంగంగానే చేతులు చాపుతున్నారు. బెయిల్ మంజూరుకు, కొన్ని అంశాల్లో కేసు నమోదు కాకుండా చూసేందుకు డబ్బు డిమాండ్ చేస్తున్నవారిలో ఎక్కువమంది పోలీస్‌స్టేషన్ హౌస్ అధికారులు, హెడ్ కానిస్టేబుళ్లు ఉంటున్నారు. ఇక విద్యుత్ మీటర్ల ఏర్పాటు, వ్యవసాయ, గృహేతర సర్వీసులకు లైన్‌మేన్లు, భూములకు సంబంధించి డాక్యుమెంట్లు, ఈసీలు, సేల్‌డీడ్లు కోసం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు బహిరంగంగా వసూళ్లు చేస్తున్నారు. ప్రభుత్వశాఖల్లో అవినీతికి పాల్పడు తున్న అక్రమార్కుల సమాచారాన్ని స్వయంగా గాని, మొబైల్ ద్వారా గానీ, తమకు చేరవేస్తూ సహకరించాలని అవినీతి నిరోధకశాధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

పట్టాలు పంపిణీ చేయకుంటే
ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుంటాం



విశాలాంధ్ర - డోన్ : కర్నూలు జిల్లా డోన్ పట్టణంలోని రుద్రాక్ష గుట్టలో పేద ప్రజలకు పట్టాలు ఇవ్వక పోతే ఆమరణ నిరాహార దీక్షకు పూను కుంటామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు స్పష్టం చేశారు. రుద్రాక్షగుట్టలో పేద ప్రజలకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ గత మూడు రోజులుగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. బుధవారం నాటి దీక్షలను సీపీఐ పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ ప్రారం భించారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, సీపీఐ డోన్ నియోజక వర్గ కార్యదర్శి రంగ నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, ఏఐటీ యూసీ జిల్లా అధ్యక్షులు సుంకయ్య, మోట రాముడు బుధవారం తహశీల్దార్ తిరుమల వాణికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా రుద్రాక్షగుట్టలో పట్టాలు ఇవ్వాలని ధర్నాలు దీక్షలు చేపడుతున్నా అధికారుల్లో చలనం లేదన్నారు. పట్టాలు పంపిణీ చేయకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని హెచ్చ రించారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ వెంటనే రుద్రాక్ష గుట్టలో సర్వే చేయించి అర్హులైన పేదవారికి పట్టాలు పంపిణీ చేసేలా ఉన్నతాధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. దీంతో దీక్షలను విరమించారు. బుధవారం దీక్షల్లో ప్రభాకర్, శివ, వెంకట రమణమ్మ, లక్ష్మి దేవి, సువర్ణమ్మ, ముంతాజ్, ఆచారి, నాగేంద్ర, నజీమా, ఫర్వీన్‌లు కూర్చున్నారు.

హోదాకోసం గొంతు కోసుకున్న మహిళ

తిరుపతిలో కలకలం

విశాలాంధ్ర - తిరుపతి : ప్రత్యేక హోదా కోసం మహిళ గొంతుకోసుకున్న ఘటన తిరుపతిలో కలకలం రేపింది. తిరుమలకు వెళ్ళే మార్గంలో గరుడ విగ్రహం ముందు బ్లేడుతో గొంతు, చేతులు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు ,పోలీసులు అడ్డుకుని.. ఆమెను ఆసుపత్రికి తరలించారు. ప్రధాని మోడీ రాష్ట్రానికి మోసం చేశారంటూ పద్మాదేవి రెడ్డి నిరసన చేపట్టింది. ముంతడు నీళ్లు, మట్టితో మోడీ ఏపీని బురిడీ కొట్టించారంటూ పద్మాదేవిరెడ్డి నిరసన తెలిపారు. ప్రత్యేక హోదా ఇవ్వకుంటే ప్రాణత్యాగానికైనా సిద్ధమంటూ ఆమె హెచ్చరించారు. గరుడ విగ్రహం ముందు కేంద్ర ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. గతంలోనూ హోదా కోసం పద్మాదేవి రెడ్డి పొర్లు దండాలు పెట్టి వినూత్న నిరసన తెలిపారు.



మహాసభల నిర్వహణకు రూ.5 వేల విరాళం

విశాలాంధ్ర - ఏలూరు : ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య 14వ రాష్ట్ర మహాసభల నిర్వహణకు 5 వేల రూపాయల విరాళాన్ని సీనియర్ పాత్రికేయులు అమరశ్రీ నిర్వాహణ కమిటీకి అందజేశారు. ఏలూరులో మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలు జరుగుతున్న విషయం విదితమే. ఈ మహాసభల నిర్వహణ కోసం విరాళంగా ప్రకటించిన 5 వేల రూపాయలను సీపీఐ జిల్లా కార్యదర్శి డేగా ప్రభాకర్ ద్వారా జిల్లా మహిళా సమాఖ్యకు అమరశ్రీ అందజేశారు.



దిగజారుతున్న రాజకీయాలు

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర - నగరి : దేశంలో, రాష్ట్రంలో రాజకీయాలు దిగజారిపోయి పతనావస్థకు చేరుకున్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన చిత్తూరు జిల్లా నగరిలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడి ప్రధాని అయిన తరువాత బెదిరింపు రాజకీయాలతో ప్రతిపక్ష పార్టీలను లొంగతీసుకోవడానికి రాజ్యాంగబద్దమైన వ్యవస్థలైన సీబీఐ, సీఐడీ వంటి వాటిని సొంత ప్రయోజనాలకు వాడుతున్నారన్నారు. నేడు ఆర్థిక వ్యవస్థను కూడా పూర్తిగా ఛిన్నాభిన్నం చేశారన్నారు. బీజేపీలో పురంధేశ్వరి ఉంటూ ఆమె భర్త దగ్గుబాటి వెంకటేశ్వరరావు వైసిపిలో చేరుతారని వార్తలు చూశానని, అంటే బీజేపీ, వైసీపీ భార్యాభర్తలు లాగా రాష్ట్రంలో సంబంధం కలిగి ఉన్నాయనడానికి ఇది నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాలుగున్నర సంవత్సరాలు బీజేపీతో అంటకాగి ఎన్నికలు దగ్గరపడే కొద్ది అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారన్నారు. రాష్ట్రంలో సీపీఐ, సీపీఎం, జనసేన కలిసి ఎన్నికలలో పోటీచేయనున్నాయని, ప్రజలు ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ.రామానాయుడు, నియోజకవర్గ కార్యదర్శి టి.కోదండయ్య, నాయకులు వేలన్, విజయకుమార్, భువన పాల్గొన్నారు.

నుమాయిష్ బుగ్గి

పలు స్టాల్స్ దగ్ధం - సందర్శకుల బెంబేలు
రంగంలోకి 10 ఫైర్ ఇంజిన్లు
భారీగా ఆస్తి నష్టం అంచనా
నాంపల్లిలో స్తంభించిన ట్రాఫిక్

హైదరాబాద్: నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. నుమాయిష్ జరుగుతుండటంతో గ్రౌండ్ సందర్శకులతో కిక్కిరిసిపోయింది. పలు స్టాల్స్ నుంచి మంటలు ఎగసిపడుతుండటంతో జనం భయంతో పరుగులు తీశారు. దీంతో తొక్కిసలాట జరిగింది. తొలుత ఎగ్జిబిషన్ ఎదురుగా ఉన్న స్టాల్‌లో మంటలు చెలరేగగా.. పలు స్టాల్స్ దగ్ధమయ్యాయి. పొగలు దట్టంగా అలుముకోవడంతో పలువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. రంగంలోకి దిగిన 10 అగ్నిమాపక శకటాలు, సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రమాదాలకు గల కారణాలు తెలియరాలేదు. అయితే ఆస్తి నష్టం భారీగా ఉంటుందన్న అంచనా ఉంది. ప్రమాదం కారణంగా సందర్శకులు ఒక్క సారిగా గ్రౌండ్ నుంచి బయటకు పరుగులు తీయడంతో నాంపల్లిలో భారీస్థాయిలో ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో ఫైరింజన్లు ఘటన స్థలా నికి చేరుకోవడానికి కొంత ఇబ్బంది ఏర్పడింది.

టికెట్ లేకున్న మెట్రో ప్రయాణం..

నాంపల్లి ఎగ్జిబిషన్‌లో అగ్ని ప్రమాదం కారణంగా భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో సందర్శకులు మెట్రోలో టికెట్ లేకున్న ప్రయాణం చేయవచ్చని మెట్రో రైలు ఎన్వీస్ రెడ్డి తెలిపారు. మెట్రో సర్వీసులను కూడా వేగంగా నడుపుతున్నారు.

బుసలు కొడుతున్న అసహనం

- లౌకికవాదం, రాజ్యాంగ రక్షణకు ప్రజాతంత్ర శక్తులు ఏకంకావాలి
- హైదరాబాద్ సదస్సులో సురవరం



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : మతశక్తుల అసహనం తీవ్రస్థాయిలో పెచ్చుపెరిగి బుసలు కొడుతోందని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి అన్నారు. రాజ్యాంగాన్ని, లౌకికవాదాన్ని ధ్వంసం చేసే దిశగా మతశక్తులు కుట్రలు, కుయుక్తులు పన్నుతున్నాయని విమర్శించారు. మతశక్తులకు వ్యతిరేకంగా లౌకికవాదాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, యావత్తు ప్రజాతంత్ర, వామపక్ష శక్తులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. తమకు అనుకూలంగా లేనివారిని మతశక్తులు శత్రువులుగా చూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత మతశక్తులు పెట్రేగిపోతున్నారని, కమ్యూనిస్టులు, మైనారిటీలు, దళితులపై దాడులకు తెగబడుతున్నారని పేర్కొన్నారు. ఎర్రజెండా, ఎర్రచొక్కా ఉన్నా నక్సలైట్‌గా ముద్రవేస్తున్నారని, అర్బన్ నక్సలైట్‌ల పేరిట దాడులకు పూనుకుంటున్నారని చెప్పారు. మహాత్మాగాంధీ వర్ధంతి రోజున రాజ్యాంగాన్ని కాపాడాలి, లౌకికవాదాన్ని పరిరక్షించాలని పేరుతో కార్యక్రమం నిర్వహించాలని సీపీఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో బుధవారం పార్టీ కార్యాలయం మఖ్దూంభవన్‌లో సదస్సు జరిగింది. సదస్సులో సురవరం మాట్లాడుతూ మహాత్మా గాంధీ స్వాతంత్ర్య ఉద్యమాన్ని, రాజకీయాలను ప్రభావితం చేశారని, గాంధీ శక్తిమంతమైన నాయకుడని అభివర్ణించారు. మహాత్మాగాంధీతో భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ శత్రువుగా చూడలేదని పేర్కొన్నారు. గాంధీ అనుసరించిన విధానం లౌకికవాదమని, మతాతీతమైన వ్యవస్థే లౌకికవాదమని పేర్కొన్నారు. మతాలకు అతీతమైంది రాజ్యాంగమని స్పష్టం చేశారు. పాకిస్థాన్ ఇస్లామ్ మత దేశంగా ప్రకటించుకున్న క్రమంలో హిందూ మతోన్మాద శక్తులు భారతదేశాన్ని హిందూ దేశంగా మార్చేందుకు కుయుక్తులు చేస్తున్నారని చెప్పారు. మహాత్మా గాంధీని హతమార్చిన గాడ్సే విగ్రహాలను, ఆలయాలను ఏర్పాటు చేస్తామని, వాటి ప్రారంభానికి ప్రధానిని ఆహ్వానిస్తామని బీజేపీ ఎంపీ సాక్షి మహరాజ్ చేసిన ప్రకటనను ప్రధాని ఖండించకపోవడం శోచనీయమన్నారు. మన్‌కి బాత్‌లో మోడీ చేస్తున్న ప్రసంగానికి బయటమాట్లాడే మాటలకు పొంతనలేదని, మోసపూరిత ప్రసంగాలేనన్నారు. అసహనానికి వ్యతిరేకంగా, పౌరహక్కులను కాపాడేందుకు పోరాడుతున్న శక్తులను ఏకం చేయాలని సురవరం పిలుపునిచ్చారు. మేధావులపైనా, విద్యార్థి నాయకులపైనా దాడులు చేస్తున్నారని, తమకు అనుకూలంగా లేనివారిని శత్రువులుగా చూస్తున్నారని తెలిపారు. ప్రొ॥ హరగోపాల్ మాట్లాడుతూ రాజ్యాంగ హక్కులను, రాజ్యాంగాన్ని కాపాడుకొని దేశాన్ని మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాజ్యాంగంలో రాసుకున్న స్వేచ్ఛా, సమానత్వం కోసం పోరాటాలు జరుగుతున్నాయని తెలిపారు. అన్నిరకాల ఆధిపత్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. కమ్యూనిస్టు లాంటి ఉద్దాతమైన వ్యక్తులు సమాజానికి అవసరమని పేర్కొన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం గొప్పదని, ఇలాంటి రాజ్యాంగం రాయడం చాలా కష్టమని చెప్పారు. విశాలమైన విలువలు రాజ్యాంగంలో ఉన్నాయని, ఎలాంటి సమాజం కావాలో రాజ్యాంగంలో రాసుకున్నామని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా ఉద్యమ నిర్మాణం ద్వారా సమాజం మార్పుకోసం కమ్యూనిస్టులు పోరాటాలు చేస్తున్నారని చెప్పారు. సమాజంలో మానవ విలువలను కాపాడుకోవాలని, ప్రమాదంలోపడిన లౌకికవాద రక్షణ కోసం పోరాటం చేయాలన్నారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. దళితులపై, మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. మతోన్మాద శక్తుల ఆటలు కట్టించేందుకు వామపక్ష, ప్రగతిశీల శక్తులు ఉద్యమించాలన్నారు. స్వతంత్ర సంస్థలను తమకు అనుకూలంగా మార్చుకుని కీలుబొమ్మలుగా చేశారని చెప్పారు. గాంధీ ప్రబోధించిన అహింసా మార్గం ద్వారా పోరుసాగించాలని, లౌకికవాదాన్ని రక్షించుకోవాలన్నారు.

గవర్నర్ చేత అబద్ధాలు చదివించారు : శ్రీకాంత్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: అసెంబ్లీ సాక్షిగా గవర్నర్ నరసింహన్‌తో 40 పేజీల అబద్ధాలు చదివించారని వైసీపీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి విమర్శించారు. గవర్నర్ ప్రసంగం అబద్ధాల కరపత్రమని ఎద్దేవా చేశారు. రాజ్యాంగ పదవిలో ఉన్న గవర్నర్‌తో టీడీపీ అబద్ధాల కరపత్రం చదవడం, అది ఏపీ ప్రజలు వినాల్సి రావడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్టీఆర్ ఎప్పుడో చెప్పిన డైలాగ్ "సమాజమే దేవాలయం..ప్రజలే దేవుళ్లు" గవర్నర్‌తో చెప్పించారన్నారు. నిజంగా సమాజమే దేవాలయమైతే.. రాజ్యాంగాన్ని ఉల్లంఘించి 23 మంది ప్రతిపక్ష ఎమ్మెల్యేలను తీసుకొని నలుగురుని మంత్రులుగా కొనసాగిస్తున్న అసెంబ్లీని దయ్యాల కొంప అనుకోవాల్సిందే అన్నారు. రాజ్యాంగంపై విశ్వాసం లేకుండా, చులకనగా చూసే చంద్రబాబు పక్కన గవర్నర్ ప్రసంగాన్ని చదవడం అసహ్యంగా ఉందన్నారు. రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కుతున్న స్పీకర్‌ను ఏమనాలని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రాన్ని విడగొట్టింది కాంగ్రెస్ పార్టీ అయితే, సమస్యను పరిష్కరించాల్సింది ఎన్డీఎ ప్రభుత్వం అన్నారు. నాలుగేళ్లు ఎన్డీఎలో కొనసాగిన చంద్రబాబుకు రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలు గుర్తుకు రాలేదన్నారు. ప్రత్యేకహోదా వద్దు..ప్యాకేజీ ముద్దు అన్నది చంద్రబాబు కాదా అని నిలదీశారు. వృద్ధిరేటు గురించి గవర్నర్ ప్రసంగంలో పేర్కొన్నారని, దేశ వృద్ధి రేటు 7.3 ఉంటే రాష్ట్రంలోని వృద్ధి రేటు 10.66 ఉందని గవర్నర్‌తో చెప్పించారన్నారు. దేశం కంటే ఎక్కువ వృద్ధి రేటు అంటున్న చంద్రబాబు మాటలు పరిశీలిస్తే..రాష్ట్రంలో 55 శాతం పైగా ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెంది ఉండాలన్నారు. 55 శాతం వృద్ధి రేటు పెరిగినట్లు ఏ గ్రామంలోనైనా రుజువు చేయగలరా అని సవాలు విసిరారు. జగన్ ప్రకటించిన నవరత్నాలు కాపీ కొట్టి గొప్పగా గవర్నర్ ప్రసంగంలో చెప్పించారన్నారు. కాపులను వంచించే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు.



తిరుమల వాసుల ఉద్యమబాట

విశాలాంధ్ర - తిరుపతి క్రైం : ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తిరుమల స్థానికులు ఉద్యమ బాటపట్టారు. టీటీడీ పరి పాలన భవనం ఎదుట బుధవారం ధర్మ పోరాట దీక్షలు ప్రారంభించారు. మూడు రోజుల్లో సమ స్యలు పరిష్కరించకుంటే తిరుమలలో దుకాణాలు, హోటళ్లను పూర్తిగా బంద్ చేస్తామని హెచ్చరిం చారు. తిరుమలలో తరాలుగా స్వామివారిని నమ్ముకుని వివిధ వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని.. సమస్యల పరిష్కారానికి అధికారులు స్పందించడం లేదని విమర్శిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం టీటీడీ మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని సంకల్పించినప్పుడు. మాడవీధులు వెడల్పు చేసిన సందర్భాల్లో స్థానికుల నివాసాలు.. దుకాణాలను స్వాధీనం చేసుకున్నారన్నారు. వీరికి ప్రత్యామ్నాయంగా దుకాణాలు, ఇళ్లను కేటాయించినా.. పూర్తిస్థాయిలో ఇంకా కేటాయింపులు జరగలేదు. మాస్టర్ ప్లాన్ లో సర్వం కోల్పోయిన నిర్వాసితుల్లో ఇంకా 128 మందికి లైసెన్సులు ఇవ్వలేదని, దుకాణాల నిర్వహణకు సంబంధించి రెవెన్యూ, హెల్త్ సెక్షన్ పేరుతో ఒకరిపై ఒకరు చెప్పుకొని భారీగా అపరాధ రుసుములు విధిస్తున్నారన్నారని స్థానికులు ఆందోళన వ్యక్తంచేశారు. షాపుల కేటాయింపు, కాలనీలో సౌకర్యాల కల్పన, యువతకు ఉపాధి తదితర 16 సమస్యలపై తిరుమల స్థానికులు ఆందోళన చేపట్టారు. బుధవారం పెద్ద సంఖ్యలో స్థానికులు టీటీడీ పరిపాలన భవనం ఎదు రిలే దీక్షలు చేపట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం, టీటీడీ స్పందించి సానుకూల నిర్ణయం తీసుకుని.. సమస్యల

టీటీడీ ఏడీ బిల్డింగ్ ఎదుట దీక్షలు

పరిష్కారానికి కృషి చేయాలని తిరుమల స్థానికుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు డాక్టర్ కోడూరి బాలసుబ్రహ్మణ్యం, అధ్యక్షులు జేకేవెస్ గిరి, కార్యదర్శి ఆర్వీ గిరి డిమాండు చేశారు. సంఘం ప్రెసిడెంట్ జయ కృష్ణ మాట్లాడుతూ తిరుమల స్థానికులు అందరికీ ప్రభుత్వ పథకాలను వర్తింప చేయాలని, టీటీడీ బోర్డు సభ్యత్వం కల్పించాలని, తిరుమల వ్యాపారస్తులు, స్థానికులు తిరుమల వెళ్లేందుకు ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేయాలనీ, తిరుమలలో ప్రైవేట్ ఫ్యాక్టరీలు గాని, వ్యవసాయ భూములు లేనందున చదువుకున్న తిరుమల యువతీ యువకులు టీటీడీలో 20 శాతం ఉద్యోగాలు కల్పించాలని కోరారు. జేకేవెస్ గిరి మాట్లాడుతూ, దీక్షలను మూడు రోజుల పాటు కొనసాగిస్తామని చెప్పారు. దీనిపై ప్రభుత్వం, టీటీడీ అధికారులు సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆదివారం నుంచి మూడ్రోజుల పాటు తిరుమలలో స్వచ్ఛందంగా అన్నిరకాల దుకాణాలు మూసివేస్తామన్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా కొన్ని హోటళ్లను తెరిచి ఉచితంగా భోజనం అందజేస్తామని చెప్పారు. చివరిగా అలిపిరి వద్ద ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, తిరుమల శాఖ నాయకులు రామచంద్రయ్య, బాలరంగా, గంగాధర్, ఢిల్లీబాబు పాల్గొన్నారు. వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి సంఘీభావం తెలిపారు.

వినోదం మరింత ప్రియం

భారీగా పెరగనున్న కేబుల్ బిల్లులు
ఫిబ్రవరి 1నుంచి అమలు



విశాలాంధ్ర-కోటబొమ్మాళి: రెండు దశాబ్దాల క్రితం వరకూ వినోదానికి సినిమా థియేటర్లే వేదికలు. అప్పట్లో థియేటర్‌కు వెళ్లి సినిమా చూడటం ఒక స్టేటస్‌గా ఫీలయ్యేవారు. టెలివిజన్లు వచ్చినా దూరదర్శన్ ప్రసారాలు గొప్పింటికే పరిమితమయ్యేవి. పుష్కర కాలం క్రితం నుంచి వచ్చిన డిజిటల్ విప్లవంతో ప్రతి ఇంట్లో బుల్లితెర కొలువు తీరింది. కేబుల్ వ్యవస్థ వచ్చాక సామాన్యుడు కూడా టెలివిజన్‌తో వినోదం పంచుకునే అవకాశం లభించింది. ఇప్పుడు సినిమాకు వెళ్లాలంటే ఒక్కొక్కరికీ రూ. 200 చొప్పున్న టికెట్‌కు ధర చెల్లించాలి. ఒక్క టికెట్‌కు చెల్లించే రూ.200 కేబుల్ కనెక్షన్‌కు కడితే నెలపాటు ఇంటిల్లిపాదీ సినిమాలు, సీరియల్స్‌తో వినోదం పొందవచ్చు. బుల్లితెర ఎంతగా ప్రజల్లో మమేకమైందంటే పూరిగుడిసెలోనూ కలర్ టీవీ కనిపిస్తోంది. న్యాయస్థానం ఆదేశాలంటూ ట్రాయ్ విధిస్తున్న నిబంధనల ప్రకారం కేబుల్

వాణిజ్య ప్రకటనలు నిలిపేయాలి

వాణిజ్య ప్రకటన ద్వారా కోట్లాది రూపాయల ఆదాయం పొందుతున్న వివిధ చానళ్లు తమ వినియోదారులపై ధరల భారం మోపడం తగదు. ధరలు పెంచితే వాణిజ్య ప్రకటనలను నిలిపివేయాలి. వినోద కార్యక్రమాలను మాత్రమే ప్రసారం చేయాలి.

- హనుమంత మాధవరావు, ఊడికలపాడు

టీవీ ప్రసారాల విధివిధానాలు సామాన్య, మధ్యతరతగతి ప్రజలకు పెనుభారంగా మారనున్నాయి. దీనికి తొలుత 2018, డిసెంబరు 31ను గడువు తేదీగా ప్రకటించినా తదుపరి జనవరి 31 వరకూ అవకాశం ఇచ్చింది. కొత్త నిబంధనల ప్రకారం ఒప్పందం చేసుకోని కేబుల్ వినియోగదారులకు ప్రసారాలు నిలిచిపోతాయని ఆదేశాలు జారీచేసింది. ఈ నెలాఖరు నుంచి ట్రాయ్ నిబంధనల ప్రకారం కేబుల్ వినియోగదారులు చెల్లించే నెలసరి బిల్లు మరింత ప్రియం కానుంది. ఇప్పటివరకూ గ్రామాల్లో రూ.150.. పట్టణాల్లో రూ.200 చెల్లిస్తున్న వినియోగదారులు సుమారు వందకు పైగా చానళ్లను వీక్షిస్తున్నారు. ప్రేక్షకుడు

ధరల పెంపు సామాన్యుడిపై భారం

చానళ్ల ధరలను పెంచాలన్న ఆలోచనను ఉపసంహరించుకోవాలి. సామాన్యుడికి టీవీ ద్వారానే వినోదం అందుతోంది. చానళ్ల ధరలు పెరిగితే పేద, మధ్య తరగతి ప్రజలు చార్జీలను చెల్లించలేని పరిస్థితి ఏర్పడుతుంది. మరోసారి దీనిపై ఆలోచన చేయాలి.

- కవిటి మాధవరావు, వ్యవసాయకూలి, కోటబొమ్మాళి

కావాల్సిన చానల్‌ను ఎంపిక చేసుకుని వాటికి మాత్రం బిల్లు చెల్లించేలా ట్రాయ్ చేసింది. ప్రస్తుతం ఉన్న పే చానళ్ల వాటి ధరలు ఇప్పటికే ఆయా చానళ్లు ప్రకటిస్తున్నాయి. ఈ క్రమంలో ప్రస్తుతం చెల్లిస్తున్న కేబుల్ బిల్లు రెట్టింపవుతుంది. డీటీహెచ్‌లకూ నిబంధనలు వర్తించడంతో అది మరింత ప్రియం కానుంది. ఇప్పటికే హెచ్‌డీ చానల్స్ ప్రచారం పేరుతో డీటీహెచ్ కంపెనీలు రూ.300 నుంచి రూ.350 వరకు వసూలు చేస్తున్నాయి. ప్యాకేజీ ఎంచుకొని తక్కువ ధరలో ప్రసారాలు చూడాలన్నా ఇంట్లో చిన్నపిల్లల దగ్గర నుంచి వృద్ధుల వరకూ వినోదాన్ని, విజ్ఞానాన్ని ఇచ్చే రకరకాల చానళ్లకు డబ్బులు చెల్లిస్తే జేబుకు చిల్లు పడటం ఖాయం. ప్రకటనల ద్వారా కోట్లాది రూపాయిలు ఆర్జిస్తున్న టీవీ చానళ్లు ప్రేక్షకుల నడ్డి విరిచేలా ధరలు పెంచడాన్ని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు.

వెంకన్న ఆలయానికి నేడు భూమిపూజ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమరా వతిలో గురువారం శ్రీవారి ఆలయానికి సీఎం చంద్రబాబు భూమిపూజ చేస్తారని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ చెప్పారు. వెంకటపాలెంలో ఆలయన నిర్మాణ ప్రాంతంలో ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఉదయం 9.15 గంటల నుంచి 9.40 గంటల మధ్య శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తా మన్నారు. సీఎం ఆదేశాల మేరకు సీఆర్డీయే కేటాయించిన 25ఎకరాల స్థలంలో 7 ఎకరాల్లో రూ.150కోట్ల వ్యయంతో రాతి కట్టడంతో శ్రీవారి ఆలయాన్ని నిర్మిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జేఈవో పోలభాస్కర్, గోపినాథ్‌జెట్టి, చీఫ్ ఇంజనీర్ చంద్రశేఖరరెడ్డి, ఎస్‌ఈలు వెంకటేశ్వర్లు, రాములు, డీఎఫ్‌వో ఫణికుమార్‌నాయుడు, ఎస్టేట్ ఆఫీసర్ విజయసారథి పాల్గొన్నారు.

త్వరలో 'అగ్రి' బాధితులకు పరిహారం

విశాలాంధ్ర-అమరావతి : కోర్టు అనుమతితో రూ.10 వేల లోపు అగ్రిగోల్డ్ డిపాజిటర్లకు ప్రభుత్వం త్వరలోనే నష్టపరిహారం చెల్లిస్తుందని పణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు తెలిపారు తెలంగాణ, ఆంధ్రాలో నమోదైన కేసులను విడదీసి దర్యాప్తు చేస్తున్నారని, తెలంగాణలో 36, ఆంధ్రాలో 33 కేసులున్నాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 10.50 లక్షల మంది బాధితులు ఉన్నారని తెలిపారు. రూ.10వేల లోపు డిపాజిటర్లు ఐదున్నర లక్షల మంది ఉన్నారని, రూ.20వేల కంటే తక్కువ ఉన్న డిపాజిట్‌దారులకూ న్యాయం జరుగుతుందని తెలిపారు. ఏ ఒక్క ఆస్తిని దుర్వినియోగం చేసినట్లు ఆధారాలున్నా కోర్టుకి ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. అగ్రిగోల్డ్ బాధితులకు ఎలాంటి న్యాయం చేయాలో కేబినెట్‌లో నిర్ణయిస్తామన్నారు. బీజేపీ నేతలు కియా మీద దుష్ప్రచారం చేస్తున్నారని, మోడీ కొరియా వెళ్లినప్పుడు కీయా తెచ్చినట్టు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ విజయాన్ని తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అగ్రిగోల్డ్ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని తెలిపారు.

మూడో ప్రత్యామ్నాయానికి అవకాశమివ్వండి

'కరవు కేక' సభలో సీపీఐ, సీపీఎం, జనసేన నేతల పిలుపు



మాట్లాడుతున్న రామచంద్రయ్య

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ప్రజా సమస్యలను విస్మరిస్తూ అక్రమార్జనకు మొగ్గుచూపే అధికార, ప్రతిపక్ష పార్టీలకు బుద్ధిచెప్పాలని, ధన రాజకీయాలపై పోరాడాలని సీపీఐ, సీపీఎం, జనసేన నాయకులు పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు పి.రామచంద్రయ్య, రామాంజనేయులు, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్, జనసేన నేత హర్షద్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని దోపిడీదొంగల చేతుల్లో పెట్టవద్దని, సీపీఐ, సీపీఎం, జనసేనతో కూడిన మూడవ ప్రత్యామ్నాయానికి అవకాశమివ్వాలని రాష్ట్ర ప్రజలను కోరారు. బుధవారం కర్నూలోని ఆలూరు పట్టణంలో సీపీఐ మండలకార్యదర్శి భూపేష్, సీపీఐ(ఎం) నాయకులు హనమంతు అధ్యక్షతన జరిగిన 'కరవు కేక' బహిరంగ సభ నేతలు మాట్లాడారు. ఓట్లు, నోట్లు అనే వ్యాపారంతో దేశాన్ని, రాష్ట్రాన్ని దోచుకుంటున్న పార్టీలకు రాబోయే ఎన్నికల్లో గట్టి గుణపాఠం చెప్పాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ నాలుగున్నరేళ్ల పాలనలో అక్రమాలు, అవినీతి రాజ్యమేలినట్టు తెలిపారు. వర్షాలు లేక ఉపాధి లభించక వ్యవసాయ కూలీలు, యువత నైరాశ్యంలో మునిగిపోయారని, పలువురు వలసబాట పట్టారని నాయకులు ఆందోళన వ్యక్తంచేశారు. వేదవతి ప్రాజెక్టు నిర్మాణాన్ని నాటి సీఎం వైఎస్ఆర్, నేటి సీఎం చంద్రబాబును కోరినా ఫలితం లేదని, ఈ ప్రాజెక్టు పూర్తి అయితే 80 ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణానికి హామీనిచ్చిన చంద్రబాబు దాని కోసం ఇప్పటివరకు ఒక్క రాయి కూడా వేయలేదని నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. రాయలసీమలో కరవు తాండవిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత నివారణ చూపడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఇక్కడి రైతులు దుర్భర జీవితాలను గడుపుతున్నారని, కరవులో పుట్టి.. కరువులో పెరిగి.. చివరకు అప్పులతో కరవులోనే చనిపోతున్నారని రామచంద్రయ్య తీవ్ర ఆవేదనను వ్యక్తపరిచారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలులో నిర్లక్ష్యం చేస్తూ రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఎన్నికల వేళ చంద్రబాబు అరచేతిలో వైకుంఠం చూపిస్తూ మరోమారు రాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. మూడో ప్రత్యామ్నాయానికి అవకాశమివ్వాలని ఆయన కోరారు. జనసేన నేత హర్షద్ మాట్లాడుతూ, ప్రత్యేక హోదా వద్దు, ప్యాకేజీ ముద్దు అన్న చంద్రబాబు ఇప్పుడు హోదా కోసం ధర్మపోరాటం చేపట్టడం హాస్యాస్పదమని అన్నారు. సీఎం కుర్చీ కోసం చంద్రబాబు, జగన్మోహన్ రెడ్డి ఆరాటపడుతున్నారే తప్ప ప్రజల సంక్షేమం వారికి పట్టడం లేదని వ్యాఖ్యానించారు. ప్రజాసమస్యలపై అధికార పక్షాన్ని నిలదీయాల్సిన ప్రతిపక్ష నేత కనీసం అసెంబ్లీ మెట్టైనా ఎక్కడం లేదని, పాదయాత్ర అంటూ రోడ్ల వెంట తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. రాజకీయాల్లో నైతిక విలువలు కొరవడ్డాయని, రాజకీయాల్లో మార్పు రావడానికి యువత రాజకీయాల్లోకి రావాలని నాయకులు పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, జనసేన నేత వెంకప్ప ప్రసంగీకుల్లో ఉన్నారు. తొలుత పట్టణ శివారు నుంచి భారీ ప్రదర్శన నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నబీరసూల్, సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు మద్దిలేటిశెట్టి, నాయకులు నాగేంద్రయ్య, విరుపాక్షి, మునిస్వామి, సర్పారామ్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, రామాంజనేయులు, శేఖర్, జనసేన నేతలు సురేష్, పీర్‌సాహెబ్, చక్రపాణి, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐతో పాటు వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



రైతును కట్టుకో... లక్ష పట్టుకో..!

బెంగళూరు : పెళ్లి పెద్ద సమస్యగా మారింది. మనసు మంచిదైనా గొప్ప హోదా లేకపోతే పెళ్లి జరగడం లేదు. సంప్రదాయ వృత్తులు చేసుకునేవారిని పెళ్లాడటానికి యువతులు ఆసక్తి చూపడం లేదు. రైతుల పరిస్థితి కూడా అలాగే ఉంది. అందుకే ఇలాంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్న యువకులకు కర్ణాటకలోని యల్లాపుర తాలూకాలో ఉన్న ఆనగోడ సేవా సహకార సంఘం ఓ వెలుగు రేఖలా కనిపిస్తోంది. ఈ గ్రామ రైతు కుటుంబాల్లోని యువకులు ఈ సంఘంలో చేరితే, ఆ యువకులను పెళ్లి చేసుకునే అమ్మాయికి రూ.1 లక్ష బహుమతిగా ఇవ్వాలని ఈ సంఘం నిర్ణయించింది. కుల ప్రసక్తి లేకుండా ఈ నిర్ణయాన్ని అమలు చేస్తారు. ఇతర గ్రామాల యువతులు కూడా ఈ గ్రామ రైతు యువకులను పెళ్లి చేసుకోవచ్చు. ఆ వధువు పేరు మీద రూ.1 లక్ష డిపాజిట్ చేస్తారు. మార్చి నుంచి ఈ పథకం అమల్లోకి వస్తుందని ఈ సంఘం అధ్యక్షుడు ఎస్ కే హెగ్డే అగ్గాశికుంబ్రి తెలిపారు. ఈ సంఘంలో వక్కలు, ఎరువులు, పశువుల దాణా, సిమెంట్, ఇనుము, నిత్యావసర సరకులు వంటివి విక్రయిస్తారు. ఈ సంఘంలో చేరే రైతు యువకులు సంవత్సరానికి సుమారు రూ.3 లక్షల విలువైనవాటిని ఇక్కడే కొనాలి. ఆ విధంగా వచ్చే లాభాలను తిరిగి వారికే ఉపయోగపడేలా వినియోగించాలనే ఆలోచన రావడంతో ఈ వినూత్న నిర్ణయానికి శ్రీకారం చుట్టారు.

విశాలాంధ్ర

క్రీడలు

పరువు కోసం...!



- కివీస్ ఆరాటం
- ఆత్మవిశ్వాసంలో భారత్
- నేడు నాలుగో వన్డే
- శుబ్‌మన్ అరంగేట్రం..?

హ్యామిల్టన్ : న్యూజిలాండ్‌ను మూడు వన్డేల్లో వరుసగా ఓడించి సిరీస్ చేజిక్కించుకున్న భారత్ ముందు మరో అరుదైన అవకాశం ఉంది. అదే క్లీన్ స్వీప్. సిరీస్‌లో ఇంకా రెండు వన్డేలు మిగిలుండగా గురువారం హ్యామిల్టన్ వేదికగా నాలుగో వన్డే జరుగనుంది. రెగ్యులర్ కెప్టెన్ కోహ్లి విశ్రాంతి కారణంగా టోర్నీ నుంచి వైదొలగడంతో 200వ వన్డే ఆడనున్న రోహిత్ శర్మ కెప్టెన్సీ బాధ్యతలు తీసుకోనున్నాడు. సిరీస్ ఇప్పటికే గెలిచేసిన భారత్ ఆత్మవిశ్వాసంతో నాలుగో వన్డే బరిలో దిగనుండగా కివీస్ సొంత గడ్డపై ఎదురైన పరాభవంతో పరువు నిలబెట్టుకునే క్రమంలో ఈ మ్యాచ్ గెలిచేందుకు సన్నాహాలు చేస్తోంది. న్యూజిలాండ్ జట్టులో రెండు మార్పులు చేసింది. పేసర్ బ్రేస్‌వెల్ తప్పించి ఆల్ రౌండర్ జిమ్మీ నీషమ్‌ను తీసుకోగా స్పిన్నర్ ఇష్ సోథీ స్థానంలో టాడ్ ఆస్టిల్‌ను జట్టులో చేర్చింది. ముఖ్యంగా వారి ఓపెనింగ్ విఫలం కావడంతో టాప్ ఆర్డర్‌లో మార్పులు చేటుచేసుకునే అవకాశం ఉంది. కెప్టెన్ కేన్ విలియమ్సన్ మాట్లాడుతూ భారత్ మెరుగ్గా రాణిస్తోంది. వారి స్పిన్నర్లను ఎదుర్కోవడంలో విఫలమవుతున్నాం' అని చెప్పడంతో, కివీస్‌పై చాహల్, కుల్దీప్‌ల ప్రభావం ఏ మాదిరిగా ఉందో ఇట్టే అర్థమవుతోంది. కేన్ విలియమ్సన్‌కు మంచి ఆరంభం లభిస్తున్నా భారీ స్కోరుగా మలచలేకపోతున్నాడు. మిడిలార్డర్‌లో రాస్ టేలర్, లాథమ్ రాణిస్తున్నా కీలక సమయాల్లో వికెట్లు కోల్పోతున్నారు. బౌలింగ్‌లోనూ బౌల్ట్‌కు సహకారం లభించడంలేదు. ఆల్ రౌండర్‌గా మంచి రికార్డు ఉన్న జిమీ నీషమ్‌ను జట్టులో తీసుకునే అవకాశం ఉంది. ఎట్టి పరిస్థితుల్లోనైనా ఈ వన్డే గెలిచేసేందుకు కివీస్ శాయశక్తులా కృషి చేస్తోంది. ఇక భారత్ అన్ని విభాగాల్లోనూ పటిష్టంగా ఉంది. ఓపెనింగ్‌లో రోహిత్, ధావన్ మంచి ఫాంలో ఉన్నారు. రాయుడు, జాదవ్ మంచి స్కోరును రాబడుతున్నారు. గాయంతో మూడో వన్డేకు దూరమైన ధోనీ ఈ వన్డేకూ విశ్రాంతి తీసుకుంటే కార్తీక్‌కు మరో అవకాశం దక్కనుంది. బౌలింగ్‌లో సిరాజ్, ఖలీల్‌లో ఒకరిని ఆడించవచ్చు. ఇక కోహ్లి స్థానంలో యువ ఆటగాడు శుబ్‌మన్ గిల్ అరంగేట్రం చేసే అవకాశాలున్నాయి. మ్యాచ్ ముందు రోజు నెట్స్‌లోనూ శుబ్‌మన్ శ్రమించాడు. హ్యామిల్టన్ సెడ్డెన్ పార్క్ బ్యాటింగ్‌కు అనుకూలించడంతో మ్యాచ్‌లో భారీ స్కోరు చేసే ఉంది.

శుబ్‌మన్‌ను ఆడించాలి : గవాస్కర్



న్యూఢిల్లీ : న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌ను ఇంకా రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే భారత్ 3-0తో చేజిక్కించుకున్న విషయం తెలిసిందే. చివరి రెండు మ్యాచ్‌లకు కెప్టెన్ విరాట్ కోహ్లికి బీసీసీఐ విశ్రాంతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో అతడి స్థానంలో యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్‌ను ఆడించాలని సునీల్ గవాస్కర్ కోరుతున్నాడు. టీమిండియా మెనేజ్‌మెంట్ గిల్‌ను కోహ్లి స్థానంలో బ్యాటింగ్‌కు పంపించాలని సూచించాడు. 'కోహ్లికి విశ్రాంతితో నం.3 స్థానం ఖాళీగా ఉంది. ఆ స్థానంలో గిల్‌ను ఆడించాలి. అతడికి రెండు మ్యాచ్‌ల్లో అవకాశం కల్పించి ఎలా ఆడుతున్నాడో పరిశీలించాలి' అని గవాస్కర్ అన్నాడు. పృథ్వీషా నేతృత్వంలో అండర్-19 ప్రపంచ కప్ గెలిచిన జట్టులో గిల్ కూడా ఒకడు. తన ఆట తీరుతో కెప్టెన్ కోహ్లిని మెప్పించిన గిల్‌కు న్యూజిలాండ్ సిరీస్‌తో అరంగేట్రం చేసే అవకాశం వచ్చింది. 19 ఏళ్ల గిల్‌లో గొప్ప ప్రతిభ ఉందని.. తాను అదే వయసులో ఉన్నప్పుడు అందులో 10 శాతం ప్రతిభ కూడా లేదని విరాట్ మూడో మ్యాచ్ అనంతరం మీడియాతో మాట్లాడుతూ అన్నాడు.

కోహ్లి అంటే నమ్మలేకపోతున్నా : కరన్

సిడ్నీ: టీమిండియా సారథి విరాట్ కోహ్లి నమ్మశక్యం కాని ఆటగాడని ఇంగ్లండ్ పేసర్ టామ్ కరన్ అన్నాడు. అతడి ఆట అద్వితీయమని పేర్కొన్నాడు. వచ్చే ఏడాది ఆస్ట్రేలియాలో జరిగే టీ20 ప్రపంచకప్ షెడ్యూలు విడుదలైన తర్వాత కరన్ మాట్లాడాడు. టీ20 ప్రపంచకప్‌లో భారత్, ఇంగ్లండ్, అఫ్ఘనిస్థాన్ ఒకే గ్రూప్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా కోహ్లీని ఎలా ఔట్ చేస్తావని అడిగిన ప్రశ్నకు 'చూడాలి. నో బాల్‌తో అయితే కాదు. కోహ్లి నమ్మశక్యం కాని ఆటగాడు' అని కరన్ జవాబిచ్చాడు. ఆస్ట్రేలియా మైదానాలు చాలా బాగుంటాయని కరన్ మెచ్చుకున్నాడు. 'అన్ని మ్యాచ్‌లు ఆసక్తిగా కొనసాగుతాయి. ప్రేక్షకులు అసాధారణంగా ఉంటారు. అక్కడి మ్యాచుల్లో భాగమవ్వడం అద్భుతం. ఆస్ట్రేలియాలో టీ20 ఆడటం బాగుంటుంది. 2015 వన్డే ప్రపంచకప్‌లో అక్కడెలాంటి వాతావరణం ఉంటుందో చూశాం. ప్రపంచంలో ఎక్కడా లేనటువంటి అద్భుతమైన మైదానాలు ఆస్ట్రేలియాలో ఉంటాయి. బిగ్‌బాష్ ఆడితే అక్కడ అనుభవం సంపాదించొచ్చు' అని టామ్ కరన్ అన్నాడు.

హిట్‌మ్యాన్ మరో డబుల్

200వ వన్డే ఆడనున్న రోహిత్



హ్యామిల్టన్: రోహిత్ శర్మ మరో డబుల్ సెంచరీ కొట్టనున్నాడు. పరుగుల పరంగా కాదు మ్యాచుల పరంగా..నేడు న్యూజిలాండ్‌తో జరుగనున్న నాలుగో వన్డే హిట్‌మాన్‌కు 200వ వన్డే మ్యాచ్. ఆట పరంగా ఒకప్పుడు రోహిత్ జీవితంలో ఎన్నో మలుపులు. అంతర్జాతీయ క్రికెట్ కెరీర్ అయితే ఒకానొక దశలో ప్రశ్నార్థకంగా మారిపోయింది. అలాంటి దశలో ఓపెనర్‌గా మారి వన్డేల్లో దిగ్గజ ఆటగాళ్లకు అందని రికార్డులు ఎన్నో అందుకున్నాడు. అతడి ప్రతిభను గుర్తించి ఓపెనర్ బాధ్యతలు కట్టబెట్టిన ఘనత మాత్రం మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీదే. రోహిత్ మీద నమ్మకం పెట్టి అతడిని ఓపెనర్‌గా బరిలోకి దింపాడు. అయితే రోహిత్ శర్మ సైతం తన బాధ్యతను నెరవేర్చాడు. ఇప్పుడు విజయవంతమైన ఓపెనర్‌గా కొనసాగుతున్నాడు. ఈ క్రమంలో ఎవరూ అందుకోని రీతిలో మూడు డబుల్ సెంచరీలు కొట్టేసి 'హిట్ మ్యాన్'గానూ పేరు తెచ్చుకున్నాడు. కెప్టెన్‌గానూ రోహిత్‌కు తిరుగేలేదు. గతేడాది జరిగిన 'ఆసియా కప్' టోర్నీకి రోహిత్ సారథ్యం వహించాడు. ఫేవరెట్‌గా బరిలోకి దిగిన టీమిండియాను ఆసియాకప్ విజేతగా నిలబెట్టాడు. వన్డేలో అత్యధిక వ్యక్తిగత పరుగులు: వన్డే చరిత్రలో అత్యధిక వ్యక్తిగత పరుగులు చేసిన ఏకైక బ్యాట్స్‌మన్ రోహిత్ శర్మ. 2014లో శ్రీలంకతో కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన వన్డేలో రోహిత్ 264 పరుగులు చేశాడు. మార్టిన్ గప్తిల్(237), అమీలియా కెర్(232), బెలిండా క్లార్క్(229) వీరేందర్ సెహ్వాగ్(219) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. అంతే కాకుండా వన్డేల్లో మూడు ద్విశతకాలు చేసిన రికార్డు రోహిత్‌కే సొంతం.

బౌండరీల వీరుడు

ఒక వన్డేలో మొత్తం 16 సిక్స్‌లు కొట్టిన ఘనత రోహిత్‌ది. 2013లో బెంగళూరు వేదికగా ఆసీస్‌తో జరిగిన వన్డేలో రోహిత్ 209 పరుగులు చేశాడు. అదే మ్యాచ్‌లో రోహిత్ 16 సిక్స్‌లు కొట్టాడు. దీంతో ఏబీ డివిలియర్స్, క్రిస్‌గేల్ వంటి దిగ్గజాల రికార్డులను సమం చేశాడు. అంతేకాకుండా ఆస్ట్రేలియాపై రోహిత్ ఇప్పటి వరకు 66 సిక్స్‌లు కొట్టాడు. ఒక ప్రత్యర్థి జట్టు పై ఇన్ని భారీ షాట్లు కొట్టిన రికార్డు ఇతడిదే. ఆ జట్టుపై రోహిత్ 65.85 సగటుతో 1778 పరుగులు చేశాడు. ఒక ఏడాది కాలంలో ఎక్కువ సిక్స్‌లు నమోదు చేసిన భారత క్రికెటర్ రోహితే. 2017లో 46 సిక్స్‌లు కొట్టి ఏబీ డివిలియర్స్(58), షాహిద్ అఫ్రిది(48) తర్వాతి స్థానాల్లో రోహిత్ నిలిచాడు. అలాగే 2014లో శ్రీలంకతో కోల్‌కతా వేదికగా జరిగిన వన్డేలో రోహిత్ ఏకంగా 42 బౌండరీలు బాదాడు. ఇదీ ఒక రికార్డు.

క్లీన్‌స్వీప్ చేస్తాం : మిథాలీ



మౌంట్ మాంగనుయ్ : న్యూజిలాండ్‌తో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయడమే తమ లక్ష్యమని భారత మహిళల క్రికెట్ జట్టు వన్డే సారథి మిథాలీ రాజ్ తెలిపింది. మీడియాతో మాట్లాడుతూ 'మేం కచ్చితంగా 3-0తో గెలుస్తాం. అదే సమయంలో యువ క్రికెటర్లకు అవకాశం ఇస్తాం. ఇక్కడి పిచ్‌లపై స్పిన్నర్లు మ్యాచ్‌లను మలుపులు తిప్పగలరా? అని కొందరు ఇంతకు ముందు ప్రశ్నించారు. వారు అద్భుతంగా రాణించారు. ఇక స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్ ఎక్కువ పరుగులు చేశారు. బ్యాటింగ్ విభాగానికి పరీక్ష ఎదురు కాలేదు. అవకాశం వచ్చిన ప్రతి ఒక్కరు అద్భుతంగా రాణిస్తున్నారు. ఆత్మవిశ్వాసంతో మూడో మ్యాచ్‌కు సిద్ధమవుతున్నాం. గత రెండు మ్యాచుల్లోనూ స్వల్ప లక్ష్యాలే ఛేదించాం. నేను పరుగులు చేస్తున్నంత వరకు జట్టుకు సంతోషంగా సహాయకురాలిగా ఉంటాను. జట్టు అవసరాలను బట్టి ఆడతాను' అని మిథాలీ తెలిపింది.

కోలుకుంటున్న జాకబ్ మార్టిన్

టీమిండియా మాజీలు, బీసీసీఐ సాయం



ముంబై : టీమిండియా మాజీ క్రికెటర్, బరోడా మాజీ కోచ్ జాకబ్ మార్టిన్ ప్రమాద గాయం నుంచి కోలుకుంటున్నాడు. గత నెల 27న రోడ్డు ప్రమాదంలో జాకబ్‌కు తీవ్రగాయాలయ్యాయి. దీంతో నెలరోజులుగా ఆయన ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. జాకబ్‌కు ఆర్థిక సమస్యలు తలెత్తడంతో వైద్యానికి కష్టంగా మారింది. విషయం తెలుసుకున్న టీమిండియా మాజీలు, క్రికెటర్లు, బీసీసీఐ, బీసీఏ(బరోడా క్రికెట్ అసోసియేషన్) సాయం చేసేందుకు ముందుకొచ్చారు. ప్రస్తుతం జాకబ్ కోలుకుంటున్నాడు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. టీమిండియా మాజీ సారథి సౌరవ్ గంగూలీ, క్రికెటర్ కృనాల్ పాండ్య వంటి క్రికెటర్లు జాకబ్ పట్ల మానవత్వం చూపారు. జాకబ్ కుటుంబానికి గంగూలీ అండగా ఉంటూ తనవంతు ఆర్థిక సాయం చేశారు. మరోవైపు కృనాల్ పాండ్య ఖాళీ చెక్ ఇచ్చిన విషయం తెలిసిందే. జాకబ్ ఆరోగ్య పరిస్థితి గురించి బీసీసీఐ, సీఓఏ అధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారని బరోడా మాజీ ఓపెనర్ రాకేశ్ పారిఖ్ తెలిపారు. బీసీసీఐ రూ.5లక్షలు, బీసీఏ రూ. 3లక్షలు జాకబ్‌కు విరాళంగా ఇచ్చారు. మార్టిన్ వైద్య ఖర్చుల నిమిత్తం రోజుకు 70,000 ఖర్చవుతున్నాయని సమాచారం.

• మనువాద పాలనను మట్టుబెడదాం

మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలో వక్తల పిలుపు



మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు. వేదికపై అనీరాజా, దుర్గాభవానీ, అక్కినేని వనజ, జల్లి విల్సన్ తదితరులు

విశాలాంధ్ర ప్రత్యేక ప్రతినిధి - ఏలూరు : కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో హిట్లర్ పాలన కొనసాగుతోందని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) ప్రధాన కార్యదర్శి అనీ రాజా విమర్శించారు. మతోన్మాద, ఆర్ఎస్ఎస్ శక్తులే బీజేపీ ప్రభుత్వాన్ని శాసిస్తున్నాయని, ఫలితంగా ప్రజాస్వామ్యం, దేశ భద్రత ప్రమాదంలో పడ్డాయన్నారు. మనువాద సిద్ధాంతాన్ని ప్రజలపై బలవంతంగా రుద్దేందుకు ఈ శక్తులు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులోని దూసనపూడి సుబ్బాయమ్మ నగర్ (టుబాకో మర్చంట్స్ అసోసియేషన్ హాల్) లోని చంద్ర రాజకుమారి సభాప్రాంగణంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యు అనుబంధ ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర 14వ మహాసభలలో భాగంగా బుధవారం ప్రతినిధుల సభ ప్రారంభమైంది. తొలుత సమాఖ్య పతాకాన్ని సీనియర్ నాయకులు వంక నాగమణి ఆవిష్కరించగా, మృతవీరుల స్మారక స్థూపానికి మరో సీనియర్ నాయకురాలు సౌభాగ్యలక్ష్మీ నివాళులర్పించారు. అనంతరం సభలో అనీ రాజా మాట్లాడుతూ, మోడీ ప్రజా, మహిళా వ్యతిరేక కార్యక్రమాలపై ధ్వజమెత్తారు. బీజేపీ పాలనలో యువతులు, మహిళలు ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారని చెప్పారు. చిన్న పిల్లలపై అత్యాచారాలు, మహిళలపై దాడులు జరుగుతున్నా ప్రధాని మౌనమునిలా వ్యవహరిస్తున్నారేతప్ప, ఖండించేందుకు ప్రయత్నించటంలేదన్నారు. దేశంలో హింసాత్మక ఘటనలు పెరుగుతున్నాయని, విద్యాసంస్థలు, బస్సులు, ఆలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ మహిళలకు భద్రత కొరవడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ మానస పుత్రిక భేటీ బచావో - భేటీ పడావో ప్రారంభమైన హర్యానాలో సీబీఎస్ఈ టాపర్‌పై అత్యాచారం జరిగిందంటేనే దేశంలో శాంతి భద్రతల పరిస్థితిని అర్థం చేసుకోవచ్చన్నారు.



మహిళల సమాఖ్య పతాకాన్ని ఆవిష్కరిస్తున్న వంక నాగమణి

ప్రస్తుతం మతపరమైన లా బోర్డులస్థానంలో యూనిఫాం సివిల్ కోడ్‌ను అమలు చేయాలని ఆమె డిమాండు చేశారు. పర్సనల్ లా బోర్డుల వల్ల మహిళలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ఓట్ల కోసం ట్రిపుల్ తలాక్‌ను తెచ్చిందని, గతంలో మాదిరిగా మళ్లీ యూనిఫాం సివిల్ కోడ్‌ను అమలు చేయాలన్నారు. ప్రపంచ దేశాలలో పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారని, అలాంటి వారిని తక్కువ చేసి చూడటం సరికాదన్నారు. న్యాయ, పార్లమెంట్ వ్యవస్థల్లోనూ ఫాసిస్టు, ఆర్ఎస్ఎస్ శక్తుల ప్రమేయం పెరిగిందని తెలిపారు.

మధ్య దళారీ అవతారం

బీజేపీ అధికారంలోకి వస్తే మధ్య దళారులు ఉండరన్న ప్రధాని మోడీయే నేడు కార్పొరేట్‌లకు దళారీగా వ్యవహరిస్తున్నారని అనీ రాజా విమర్శించారు. పార్లమెంట్‌లో 60 శాతం మంది కోటీశ్వరులే ఉన్నారని, వారంతా తమకు ఏవిధంగా లాభం వస్తుందో ఆలోచిస్తారేగానీ, పేద, మధ్యతరగతి ప్రజల సమస్యలు ఏమాత్రం పట్టవని తెలిపారు. కార్పొరేట్‌ల అనుకూల విధానాలను ప్రవేశపెట్టేందుకే పాలకులు ప్రాధాన్యం ఇస్తున్నారని, ఫలితంగా దేశంలో ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, వాటిని అదుపు చేసేందుకు ఒక్కరూ ప్రయత్నించాలని చెప్పారు. చట్ట సభల్లో కార్పొరేట్‌ల పెత్తనం పెరగటంతో అన్ని వ్యవస్థలూ నిర్వీర్యం అయ్యాయని తెలిపారు. విద్య, వైద్యం, సంక్షేమం తదితర రంగాలను నిర్వీర్యం చేసేందుకు ఆర్ఎస్ఎస్, హిందుత్వశక్తులు చాపకింద నీరులా ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ఉజ్వల పథకం కింద ఇంటింటికీ గ్యాస్ కనెక్షన్ ఇచ్చారని, అలా తీసుకున్న వారందరినీ బీపీఎల్ నుంచి ఏపీఎల్‌కే మార్చేశారని తెలిపారు. గ్యాస్ కనెక్షన్ ఉన్నవారంతా ధనికులుగా ఎన్‌డీఏ సర్కార్ చూపిస్తోందన్నారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను కేంద్రం మోసం చేస్తోందని విమర్శించారు. దేశంలో సంఘటిత, అసంఘటిత రంగాల్లోని మహిళా కార్మికులు, సంక్షేమ పథకాలలో పని చేస్తున్న వారి భద్రత, సమాన వేతనాల కోసం మహిళా సమాఖ్య పోరాటం చేస్తోందన్నారు. అన్ని రాష్ట్రాల్లోనూ మహాసభలు పూర్తయిన తర్వాత, అక్టోబరులో ఒడిశాలో జాతీయ మహాసభలు నిర్వహిస్తామ న్నారు. రెండు మూడు నెలల్లో ఎన్నికలు రానున్నందున మహిళలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఓడించి వామపక్షాలు, వాటి మద్దతున్న అభ్యర్థులను గెలిపించాలని అనీరాజా పిలుపునిచ్చారు.

బలీయమైన శక్తిగా ఎదగాలి : ముప్పాళ్ల

మహిళలు బలీయమైన శక్తిగా ఎదగాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలపై చైతన్యంకావాలని కోరారు. మహిళా సమస్యలపై అధ్యయనం చేసి, వాటిని ఎదుర్కొనేందుకు పోరాటాలు చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలని, అప్పుడే ఆలోచనాశక్తి పెరుగుతుందని తెలిపారు. సమాజంలో మార్పు మహిళల ద్వారానే సాధ్యపడుతుందని, ఆ దిశగా మహిళా సమాఖ్య కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. సామాజిక కార్యక్రమాల్లో భాగంగా స్త్రీ విద్యను ప్రోత్సహించాలని సూచించారు.

దోపిడీకి గురవుతున్న మహిళల శ్రమ : జల్లి విల్సన్



దేశంలో మహిళల శ్రమ దోపిడీకి గురవుతోందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు జల్లి విల్సన్ అన్నారు. మహిళల రక్షణకు ఉన్న చట్టాలను కూడా అమలు చేయని స్థితిలో పాలకులు ఉన్నారని విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వటంలేదని, మహిళలంటే చులకనభావం ఉండటమే ఇందుకు కారణమన్నారు. దేశం, భవిష్యత్‌తరాల రక్షణ కోసం మహిళా సమాఖ్య బాధ్యతాయుతమైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. కార్పొరేట్ కార్యాలయాల్లోనూ మహిళలకు వేధింపులు తప్పటంలేదని, ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున ఉద్యమించాలని కోరారు.

బలమున్నా మహిళా బిల్లు తీసుకురారే : ఓబులేసు



పార్లమెంట్‌లో తగినంత బలమున్నా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును కేంద్రంలోని బీజేపీ ఎందుకు తీసుకురావటం లేదని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు ప్రశ్నించారు. జనాభాలో సగానికిపైగా ఉన్న మహిళా ఓట్ల కోసం తాయిలాలను ప్రకటిస్తుందేగానీ చట్టాలను అమలు చేయటంలేదని విమర్శించారు. ఎన్ని చట్టాలున్నా మహిళలపై దాడులు, లైంగిక వేధింపులు పెరుగుతూనే ఉన్నాయన్నారు. దేశ అభివృద్ధి, సంతాన ఉత్పత్తిలో కీలకంగా వ్యవహరిస్తున్న మహిళాశక్తి నిర్లక్ష్యానికి గురవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు స్మార్ట్ ఫోన్‌లు, ఇతర తాయిలాలను ప్రకటిస్తోందని, ఈ నేపథ్యంలో అంతా అప్రమత్తంగా ఉండాలని ఓబులేసు కోరారు. మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి దుర్గాభవాని అతిథులను వేదికపైకి ఆహ్వానించారు. గుంటూరు జిల్లా కార్యదర్శి కె. స్వాతి సంతాపతీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వి జయలక్ష్మీ, పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు నెక్కంటి జగదాంబ, విశాఖ జిల్లా కార్యదర్శి ఏ విమల, కర్నూలుజిల్లా కార్యదర్శి బీ భాగ్యలక్ష్మీ, ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎస్ రామమ్మ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. సమావేశంలో సమాఖ్య రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు అక్కినేని వనజ, పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి గాళ్ల శారద, డాక్టర్స్ ఫోరం నాయకురాలు డాక్టర్ సుజాత, మిడ్ డే మీల్స్ పథకం కార్యదర్శి కళ్లేపల్లి శైలజ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సంఘం కార్యదర్శి జె లలితమ్మ, ఆహ్వాన సంఘం చైర్మన్, డీసీసీబీ మాజీ చైర్మన్ కె రాంబాబు, సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి డేగా ప్రభాకర్, శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.